ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 153 పేజీలు: 10+4 వెల: 6.50

బండరాళ్లు పడి 8 మంది కూలీలు మృతి

శరద్‌పవార్ ఎన్సీపి కాంగ్రెస్‌లో విలీనం?

5



## ముంపులో ముంబయి

మహారాష్ట్రను కుదిపేస్తున్న భారీ వర్షాలు, వరదలు

మ్యాన్‌హోల్‌లో పడి ఒకరి మృతి

**ముంబయి,జూలై 2:** మహారాష్ట్ర రాజధాని ముంబైని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. గడిచిన 24 గంటల్లో కొన్ని చోట్ల 200 మి.మీ.వర్షపాతం నమోదైంది. అనేక చోట్ల నీళ్లు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకుముంబై నగరంలోని పలులోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. దాదర్‌లోని హిందూకాలనీ పరిసరాల్లో రోడ్లపై భారీగా వరద నీరు చేరి >>2



గురువారం భారీవర్షాలకు జలమయమైన ముంబయి రోడ్లు

## న్యాయప్రక్రియలో ఎఐ అవసరమా?

ఆగ్రహించిన సుప్రీం కోర్టు

ఎఐతో తయారు చేసిన తీర్పులపై కఠినచర్యలని హెచ్చరిక

5





గన్‌పార్క్ వద్ద మంత్రులు పొన్నం, అజారుద్దీన్, లక్ష్మణ్ తదితరులు



బిఆర్ఎస్ భవన్ వద్ద హరీష్‌రావును తరలిస్తున్న పోలీసులు

# సవాళ్ల వీరంగం

## గురుకుల టెండర్లపై కాంగ్రెస్, బిఆర్ఎస్ ఢీ

గన్‌పార్కు వద్ద బహిరంగ చర్చకు కాంగ్రెస్ పిలుపు

హరీష్‌ను తెలంగాణ భవన్ వద్ద అడ్డుకొన్న పోలీసులు

తోపులాటలో కింద పడిన హరీష్, కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

ఇదంతా బిగ్‌బాస్ షో అంటూ బిజెపి నేత బండి సంజయ్ విమర్శ

తెలంగాణ భవన్‌కు వచ్చేందుకు జూపల్లి ఎందుకు భయపడుతున్నారు: హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై2:** తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటు చేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం బిగ్‌బాస్‌షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా,లోపల >>2



సిఎం, మంత్రులు తొడగొట్టి **తోక ముడిచారు** -కెటిఆర్ ఫైర్ 6



అప్పులపై కెసిఆర్ ఎందుకు **స్పందించరు?** -మంత్రి జూపల్లి 7

వ్యతిరేకిస్తున్నాం.. అయినా

# జీరామ్‌జీ అమలు

చట్టంపై సుప్రీంకు అప్పీలు చేస్తాం

ఇక టీచర్లకు కూడా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం



కేబినెట్ వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు సీతక్క, లక్ష్మణ్

మూసీ ఫేజ్-1 పనులకు రూ. 7,345 కోట్లు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల కోసం 6,278 పోస్టులు

వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో గోదాములకు 60 ఎకరాలు

నవోదయ, కేంద్ర విద్యాలయాలకు స్థలాల కేటాయింపు

కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై2:** గత్యంతరం లేని పరిస్థితిలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే ఆలోచనతో.. ఈ కొత్త చట్టాన్ని 2026 జులై 1 నుంచి రాష్ట్రంలో అమల్లోకి తెచ్చేందుకు నోటిఫికేషన్ జారీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కానీ న్యాయపరంగా పోరాటం చేయాలని, కొత్తచట్టంలో విధించిన నిబంధనలపై సుప్రీం కోర్టుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ లోనూ కేంద్రం తీరును నిలదీయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ చర్చించి ఆమోదించిన నిర్ణయాలను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టం రాష్ట్రంలో అమలుచేసే అంశంపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్రం తెచ్చిన ఈ చట్టంలో పొందుపరిచిన నిబంధనలపై మంత్రివర్గం నిరసన తెలిపిందని ఆయన పేర్కొన్నారు. కూలీలకు ఉపాధి భరోసా కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయవద్దని జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని చర్చించిందని పేర్కొన్నారు. మరోసారి తమ నిరసనను కేంద్రానికి తెలియజేయాలని కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపే నిర్ణయాన్ని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఏకపక్షంగా వీబీ జీ రామ్ జీ పథకం అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ చేసిన పలు సిఫారసులను మంత్రివర్గం చర్చించిందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాలన్నీ కొత్త చట్టం ఆమోదం తెలిపాయా.. లేదా అధికారులను అడిగి తెలుసుకుంది. అన్ని రాష్ట్రాలు కొత్త చట్టం అమలుకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వివరించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో >>2

**ప్రత్యామ్నాయ పంటలు వేస్తే ఎకరాకు 5 వేలు ప్రోత్సాహం!** 2



పోలీసుల అదుపులో ఉగ్రముఠా

## ఢిల్లీలో ఉగ్రకుట్ర భగ్నం

నలుగురు అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 2:** దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడికి కుట్ర పన్నిన నలుగురిని ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ అధికారులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ హ్యాండ్లర్ షెహ్‌జాద్ భట్టి ఆదేశాల మేరకు ఉగ్రకార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన >>2

# బుక్స్ లేని చదువులా?

నెలరోజులైనా ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు అందని తెలుగు మీడియం పుస్తకాలు

ఖాళీగా ఉన్నామంటున్న విద్యార్థులు



**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 2:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు కాలేజీలకు వచ్చి ఖాళీగా కూర్చోవల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలేజీలు ప్రారంభమై నెల రోజుల కావస్తున్నా ఇప్పటి వరకు తెలుగు మీడియం విద్యార్థులకు పుస్తకాలు అందజేయలేదు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడంతో వారికి క్లాసులు కొనసాగుతుండగా.. తెలుగు మీడియం విద్యార్థులు మాత్రం ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా వాటిల్లో కొన్నింటికి మాత్రమే తెలుగు మీడియం బుక్స్ అందాయి. రాష్ట్రంలోనఇ 85 శాతానికిపైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు తెలుగు మీడియం బుక్స్ ఇప్పటికీ చేరలేదు.

జూన్ 1 నుంచి కొత్త విద్యా సంవత్సరం 2026-27 ప్రారంభమైంది. అప్పటి నుంచి విద్యార్థులు కాలేజీలకు వస్తున్నారు. మొదటి సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 62వేల మంది విద్యార్థులు చేరగా.. వారిలో 35వేల మంది వరకు తెలుగు మీడియం విద్యార్థులున్నారు. మిగిలిన వారు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాదిలో సిలబస్ కూడా మారింది. ఈ నేపథ్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌ను ప్రింట్ చేసి ఇస్తేనే క్లాసులు బోధించడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి కొత్త బుక్స్ కోసం విద్యార్థులు ఎదురు చూస్తూ ఉన్నారు. ఇంగ్లీష్ మీడియం బుక్స్ వచ్చిన నేపథ్యంలో ఇంగ్లీష్ మీడియం బుక్స్ చూసి కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు సరఫరా చేసినట్టుగానే వెంటనే తెలుగు మీడియం విద్యార్థులకు కూడా పుస్తకాలను పంపిణీ చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. తెలుగు మీడియం బుక్స్ పంపిణీకి సంబంధించి తెలుగు అకాడమీ ఛైర్మన్‌ను సంప్రదించగా.. ఇంటర్ తెలుగు మీడియం బుక్స్‌కి సంబంధించి 90 శాతం ప్రింటింగ్ పూర్తి చేసి జిల్లాలకు రవాణా చేశామని తెలిపారు. మిగిలిన 10 శాతం వారం రోజల్లో పంపిస్తామన్నారు. గత ఏడాది ఇంటర్మీడియట్‌లో 90వేల మంది చేరగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 62 వేల మంది చేరారు. మంగళవారంతో ఇంటర్ మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ ముగియగా.. ఈ నెల 1 నుంచి ఈ నెల 31 వరకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించడానికి ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.



న్యూఢిల్లీలో గురువారం ప్రధాని మోదీతో భేటీ అయిన జపాన్ ప్రధాని తకైచి

# జపాన్‌తో భారత్‌కు ఎఐ బంధం

రక్షణ, ఆర్థిక భద్రత తదితర రంగాలలో కీలక ఒప్పందాలు

ఇద్దరు పిఎంలు మోడీ, తకైచి సమక్షంలో సంతకాలు

వచ్చే పదేళ్లలో 10 ట్రిలియన్ యెన్‌ల జపాన్ పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జులై 2:** కృత్రిమ మేధస్సు (ఎఐ), రక్షణ, ఆర్థిక భద్రత, ఔషధ రంగం, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాలలో భారత్- జపాన్ అనేక కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ మేరకు రాబోయే పదేళ్లలో ఇరు దేశాల మధ్య 10ట్రిలియన్ యెన్ల (దాదాపు 6లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు భారత ప్రధాని మోడీ తెలిపారు. >>2



# ఎసిబి వలలో మరో భారీ అవినీతి చేప

డిఎస్పీ భీంరెడ్డి అరెస్టు, ఆయన బంధువుల నివాసాల్లో ఎసిబి విస్తృతంగా సోదాలు

తెలంగాణ, కర్ణాటకలోని అక్రమాస్తుల పత్రాలు, 2 కిలోల బంగారం, 20 కిలోల వెండి, రూ. 19.91 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ స్వాధీనం

**నార్సింగి, జులై 2 ప్రభాతవార్త:** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్‌పి భీంరెడ్డి అతడి బంధువులు, స్నేహితుల ఇళ్లపై గురువారం ఏకకాలంలో 15.ప్రాంతాలలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేసి ఆయనను అరెస్టు చేశారు. ఈదాడులలో భారీ ఎత్తున భీంరెడ్డి ఆస్తుల చిట్టా వెలుగు చూసింది. ప్రస్తుతం భీంరెడ్డి హైదరాబాద్‌లోని పోలీసు కంప్యూటర్‌సర్వీసెస్‌లో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్నాడు. భీంరెడ్డికి సంబంధించిన ఆస్తుల చిట్టాను ఏసీబీ అధికారులు మీడియాకు విడుదల చేశారు. గోల్కొండ మండలం ఇబ్రహీంభాగ్‌లో ఉన్న వేసెల్లా మెడోస్‌లో ఒకవిల్లా, గచ్చిబౌలి టెలికాంనగర్‌లో జి+2+పెంట్‌హౌస్, సాయిప్రభా >>2

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం 2



## మాజీ పోలీసు అధికారులకు భద్రత తగ్గింపు

బుల్లెట్ ప్రూఫ్‌కార్లు, ఎస్కార్ట్‌లు తొలగింపు

గన్‌మన్‌ల సంఖ్య కుదింపు: ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, జూలై 2,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మాజీపోలీసు ఉన్నతాధికారులతోపాటు ప్రస్తుతం కీలక పోస్టుల్లో ఉన్న ఉన్నతాధికారులకు కేటాయించిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను తొలిగించింది. బుల్లెట్‌ప్రూఫ్‌వాహనాల తొలగింపుతోపాటు మాజీ డిజిపిలకు ఇప్పటికి వరకు కలిపిస్తున్న ఎస్కార్ట్ వాహనాలను పోలీసుశాఖ వెనక్కితీసుకొంది. పోలీసులు, రాజకీయనాయకులు మొత్తంగా 31 మందికి గన్‌మెన్‌లను ఇతర సౌకర్యాలను కుదించారు. రాష్ట్రంలో పలువురు మాజీ డీజీపీలతో >>2



అయోధ్యలో గురువారం రామాలయ ట్రస్టు సభ్యుల అక్రమాలపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేస్తున్న ఫరీదాబాద్ బార్ అసోసియేషన్ లాయర్లు

## మాజీ పోలీసు అధికారులకు భద్రత తగ్గింపు

>> పాటు ప్రస్తుతం కీలక పోస్టుల్లో ఉన్న ఉన్నతాధికారులకు కేటాయించిన భద్రతను భారీగా కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా సుమారు 20 మంది మాజీ పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ప్రస్తుతం విధుల్లో ఉన్న కొందరు అధికారుల బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను పోలీస్ శాఖ పూర్తిగా తొలగించింది. భద్రతా సమీక్ష అనంతరం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కోల్పోయిన వారిలో ప్రముఖ మాజీ డిజిపి లు స్వరజిత్ సేన్, ఎకె ఖాన్, ఎకె మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మలతో పాటు పూర్ణచంద్రరావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,డిటినాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా వంటి పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు ఉన్నారు. వీరితో పాటు ప్రస్తుత ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను సైతం పోలీస్ శాఖ ఉపసంహరించుకుంది.

కేవలం వాహనాలే కాకుండా మాజీ డిజిపి లకు ఇన్నాళ్లూ కొనసాగిన ఎస్కార్ట్ వాహనాలను కూడా పూర్తిగా తీసివేశారు. పోలీస్ అధికారులకే కాకుండా రాష్ట్రంలోని పలువురు రాజకీయ నేతలతో పాటు స్టీఫెన్ రవీంద్ర వంటి పోలీస్ అధికారులకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ కార్లు తొలగించడంతోపాటు,గన్ మెన్ల సంఖ్యను కూడా పోలీస్ శాఖ భారీగా తగ్గించి వన్ ప్లస్ వన్ కే పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో భద్రతా అవసరాలు, ముప్పు తీవ్రతను అంచనా వేసిన తర్వాతే ఈ కీలక నిర్ణయం తీసుకొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలు వేస్తే ఎకరాకు 5 వేలు ప్రోత్సాహం!

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుండగా, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగు తగ్గుతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానంపై దృష్టి సారించింది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రోత్సాహకం ఇవ్వాలనే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. వరికి బదులుగా పెసలు, కందులు, జొన్నలు, మొక్కజొన్న, నూనెగింజలు, కూరగాయలు వంటి పంటలు సాగు చేసే రైతులకు ఈ ప్రోత్సాహకం అందించాలని సూచనలు వచ్చాయి. రాష్ట్రంలో సాగునీటి లభ్యత పెరగడం, ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేయడం, కనీస మద్దతు ధరతో పాటు సన్న రకాల వరికి బోనస్ ఇవ్వడం వల్ల రైతులు అధికంగా వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఇతర ఆహార పంటల ఉత్పత్తి తగ్గిపోవడంతో వాటి కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయ పంటల సాగు పెరగడం వల్ల తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో పాటు, పప్పుధాన్యాలు, వంటనూనెల ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి నూనెగింజల సాగును కూడా ప్రోత్సహించాలని భావిస్తోంది.

## నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

### రాష్ట్రంలో మోస్తరు వర్షాలకు అవకాశం

**హైదరాబాద్, జూలై 2 ప్రభాతవార్త:** ఈ నెల 3న వాయవ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న వారం పాటు ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, తెలంగాణలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో వానకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతులంతా జూలై, ఆగస్టుపైనే ఆశలు పెట్టుకున్నారు. అయితే, వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ఆధారంగా జూలైలోనూ పెద్దగా వర్షాలు పడే అవకాశం లేదని అధికారులు చెప్పడం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. జూన్‌లో ఏకంగా 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

## ఢిల్లీలో ఉగ్రకుట్ర భగ్నం

>> వారిలో శుభ్‌దీప్ సింగ్ (23), గుర్‌జంత్ సింగ్ (22), సజన్ సింగ్ (28), గగన్‌ప్రీత్ (24) ఉన్నారు. వీరిలో ముగ్గురు పంజాబ్‌కు చెందినవారు కాగా, ఒకరిని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు విదేశీ తయారీ పిస్టళ్లు, తొమ్మిది బుల్లెట్లు, ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుల కదలికలపై అందిన సమాచారంతో ప్రత్యేక బృందాలు ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌ను ఏసీపీ వివేక్ కుమార్ త్యాగీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు సతీశ్ రాణా, అశోక్ నేతృత్వంలో చేపట్టారు.మొదట పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో శుభ్‌దీప్ సింగ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి విదేశీ పిస్టల్, బుల్లెట్లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆతడిచ్చిన వివరాలతో గుర్‌జంత్ సింగ్, సజన్ సింగ్‌లను పంజాబ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఏప్రిల్ 24న గగన్‌ప్రీత్‌ను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో విదేశీ ఫోన్ నంబర్ల ద్వారా నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. భారత భద్రతా సంస్థల నిఘాను తప్పించుకునేందుకు ఈ విధానాన్ని ఉపయోగించినట్లు పేర్కొన్నారు.అంతర్జాతీయ సరిహద్దు మీదుగా డ్రోన్ల సహాయంతో ఆయుధాలు, మాదకద్రవ్యాల సరుకులు అందుకున్నట్లు కూడా విచారణలో బయటపడినట్లు పోలీసులు తెలిపారు.నిందితుల్లో గగన్‌ప్రీత్ ఢిల్లీలోని పోలీస్ స్టేషన్లు, ప్రార్థనా స్థలాల వద్ద రెక్కీ నిర్వహించినట్లు ఆరోపించారు. రాజధానిలో కాల్పుల ఘటనకు పాల్పడే బాధ్యతను అతనికి అప్పగించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.

## ముంపులో ముంబయి

>> వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రంలోని పన్వేల్, ఉరాన్, పాల్ఘర్, రాయ్‌గఢ్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పన్వేల్, ఉరాన్, పాల్ఘర్, రాయ్‌గఢ్ ప్రాంతాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. పరిస్థితులను బట్టి స్థానిక అధికారులు మరిన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం సూచించింది. అత్యవసరమైతేతప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. ముంబైలో వచ్చే 24 గంటలపాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.తాజాగా ముంబైలో భారీవర్షం కారణంగా ఒకవ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ముంబైలోని చండివలి ఏరియాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చండివలి, సన్మాన్ హోటల్ సమీపంలోని ఖైరానిరోడ్డులో మెయింటెనెన్స్ వర్క్ జరుగుతోంది. ఈ క్రమంలో అక్కడ అస్లాం ఇసాక్ షేక్ (60) అనే వృద్ధుడు ఫోన్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. దీంతో అతడు ఆ మ్యాన్‌హోల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు, అధికారులు అక్కడికి చేరుకున్నారు. దర్యాప్తు జరుపుతున్నారు. అతడి మృతదేహాన్ని వెలికితీసేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. మ్యాన్‌హోల్‌లోకి నిచ్చెన వేసి అతడి కోసం గాలించారు.కానీ, అతడి గొడుగు,చెప్పులు మాత్రమే కనిపించాయి. మ్యాన్‌హోల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల అతడు ఎటువైపు కొట్టుకుపోయాడో కచ్చితంగా చెప్పడం కష్టమని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు అన్నారు. అతడిని గుర్తించడం కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల వర్షాల కారణంగా ముంబైలో సంభవించిన మూడో మరణం ఇది. ముంబై, చెంబూర్‌లోని ఒక స్కూల్ బస్సుపై చెట్టు పడటంతో 11 ఏళ్ల బాలుడు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మరికొందరు విద్యార్థులు గాయపడ్డారు. ఒక బిల్డింగ్ మూడో ఫ్లోర్ బాల్కనీ కూలిన ఘటనలో 51 ఏళ్ల మరో వ్యక్తి మరణించాడు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తున్నాయి.

### వారం - వర్జ్యం

03-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
తదియ ఉ.11.18, శ్రవణ ఉ.11.44
వర్జ్యం : సా.4.04-సా.5.48
దు.ఉ.8.15-ఉ.9.07,
2) మ.12.37-మ.1.29
శుభసమయం : ఉ.10.00-11.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** మీ ప్రమేయంలేకపోయినా తగాదాలలోనికి లాగటానికి మీ ఓర్పును రెచ్చగొట్టేవారు అధికమవుతారు.

**వృషభం:** సంతానంపట్ల సంతృప్తికలిగివుంటారు, అనవసర విషయాలలో జోక్యం వద్దు. అన్నివిధాల శ్రేయస్కరం.

**మిథునం:** గృహసంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, ఆదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**కర్కాటకం:** బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పలువురి ప్రశంసలు పొందుతారు. ఇంటా బయటా అనుకూల వాతావరణం ఉంటుంది.

**సింహం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలుతీరి ఊరట చెందుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కన్య :** క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి, కష్టపడి, ప్రతిష్టాత్మకమైన మంచిఫలితాలను సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**తుల :** ముఖ్యమైన విషయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. తండ్రి ద్వారా ఆస్తిలాభం పొందుతారు.

**వృశ్చికం:** ఉద్యోగస్తులకు కార్యాలయంలో అనుకూల వాతావరణం ఉంటుంది. తనఖా వస్తువులను విడిపిస్తారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**మకరం:** ఆర్థికవ్యవహారాలలో జీవిత భాగస్వామి తోడ్పాటు మీకు వెనులుబాటు కలిగిస్తుంది.ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కుంభం:** స్థిరాస్తివివాదాలనుండి బయటపడతారు. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు. ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**మీనం:** నూతనవ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మిత్రబృందాలను పెంచు కుంటారు. ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సవాళ్ల వీరంగం

>> ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు డబుల్ ఎలిమినేషన్ తప్పదని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పుల అంశాలపై చర్చించేందుకు గన్‌పార్క్‌కు బయల్దేరిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును తెలంగాణ భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని ముందుకు వెళ్లనివ్వలేదు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చర్చకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు.వాహనాన్ని నిలిపివేయడంతో హరీశ్‌రావు కాలినడకన గన్‌పార్క్‌కు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తొక్కిసలాటలో హరీశ్ రావు కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయన్ను, పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. తమ నేతను అడ్డుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.గురుకులాల్లో అవినీతి, రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లకు సవాల్ విసిరారు. గన్‌పార్క్ వద్ద తాము సిద్ధంగా ఉంటామని ప్రకటించారు. దీన్ని స్వీకరించిన హరీశ్‌రావు, తామే అక్కడికి వస్తున్నామని చెప్పారు. చర్చ నుంచి పారిపోవద్దని మంత్రులకు సవాల్ విసురుతూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే అనుమతి లేకపోవడంతో పోలీసులు ఆయన్ను గన్‌పార్క్‌కు వెళ్లనీయకుండా అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌రావుతో పాటు బిఆర్ఎస్ నేతలను కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అక్కడికి సీనియర్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు వెళ్లి హరీశ్‌రావును పరామర్శించారు. తర్వాత హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌లను పోలీసులు విడుదల చేశారు. అక్కడి నుంచి బయలుదేరి తెలంగాణ భవన్‌కు నేతలు చేరుకున్నారు. తర్వాత హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని అసెంబ్లీలో గట్టిగా ప్రశ్నిస్తామని తెలిపారు. తమకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు..బిఆర్ఎస్‌ను చర్చకు రమ్మంటారని..వస్తే అరెస్ట్ చేస్తారని, తెలంగాణ భవన్‌కు మంత్రి జూపల్లి వస్తానని ఎందుకు రాలేదు? అని ప్రశ్నించారు. జూపల్లి తక్షణమే రాజీనామా చేయాలని, నిన్నటి వరకు రూ.8 లక్షల కోట్లు అప్పు అన్నారని, ఇవాళ రూ. 7 లక్షల కోట్లు అప్పు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులపై జూపల్లి వద్ద సరైన సమాచారం లేదని, హామీలు అమలు చేయటమంటే తమపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. సవాల్ స్వీకరించిన జూపల్లి తోకముడిచారని, ప్రభుత్వ, గురుకుల పాఠశాల టెండర్లలో అవినీతి జరిగిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. టెండర్ల అవినీతిపై చర్చకు రావాలని ప్రవీణ్ కుమార్ ఆహ్వానించారని, హరీష్ రావుతోనే చర్చిస్తామని అన్నారని.. తన షెడ్యూల్ క్యాన్సిల్ చేసుకుని వచ్చానని చెప్పారు. చర్చకు వస్తుంటే పోలీసులు తనను ఎందుకు అడ్డుకున్నారు? అని ప్రశ్నించారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదని..ప్రభుత్వం తోకముడిచిందని, టెండర్లలో అవినీతి జరిగింది కాబట్టే చర్చకు భయపడుతున్నారని దుయ్యబట్టారు.

ఈ విషయాన్ని విడిచిపెట్టం..ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలియజేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని మాట్లాడుతున్నారని తెలంగాణ భవన్‌కు వచ్చేందుకు జూపల్లి ఎందుకు భయపడుతున్నారని జూపల్లిని సిఎం రేవంత్ రెడ్డి తిట్టారా? అని మొట్టికాయలు పడ్డాయా అని రాజీనామా చేయాల్సి వస్తుందని జూపల్లికి భయం వేసిందా? అని ప్రశ్నించారు. జూపల్లి దొరికిపోయా రు.. అందుకే మొహం చాటేసి నాటకాలు ఆడుతున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. విద్యార్థులు తినే ఆహారంలో కూడా అవినీతికి పాల్పడ్డారని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏసిబి వలలో మరో భారీ అవినీతి చేప

>> రెసిడెన్సిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలోని క్రాంతి సియాన్ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్, గండిపేట మండలం మణికొండ ల్యాంకోహిల్స్ రోడ్డు వద్ద జి+5 కమర్షియల్ కాంప్లెక్స్, మణికొండ మర్రిచెట్టు జంక్షన్ వద్ద 3.వేల ఎస్ఎఫ్‌టిల కమర్షియల్ స్పేస్, తెల్లాపూర్‌లోని అభినంద రెసిడెన్సిలో 2.రెసిడెన్షియల్ ఫ్లాట్స్, ప్రగతి రీసార్ట్స్‌లో 500.గజాల ఓపెన్ ప్లాట్, సంగారెడ్డి జహీరాబాద్‌లో 3.5ఎకరాల భూమి, కర్నాటక రాష్ట్రంలో 45.ఎరకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని నాగోల్ కామినేని ఆసుపత్రి సమీపంలో 200.గజాల ఓపెన్ ప్లాట్, జిఆర్‌పి హౌసింగ్ సొసైటీలో 400.గజాల ఓపెన్ ప్లాట్, పటాన్‌చెరువు వద్ద 200.గజాల ఓపెన్ ప్లాట్, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ వద్ద వెయ్యి గజాల ఓపెన్ ల్యాండ్, మోమిన్‌పేట్‌లో 2.ఎకరాల వ్యవసాయ భూమి, శంషాబాద్ మండలంలోని ముచ్చింతలలో 4.20.ఎకరాల వ్యవసాయ భూమి, శ్రీ రాఘవేంద్ర రాక్ అండ్ సాండ్ మినరల్స్‌లో రూ.75.లక్షల ఇన్‌వెస్ట్‌మెంట్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు, రూ.3.60.లక్షల నగదు భీంరెడ్డి ఇంట్లో, అలాగే బినామీలవద్ద రూ.40.లక్షల నగదు,2.కిలోల బంగారునగలు, 20.కిలోల వెండి ఆభరణాలు, రూ.19.91 లక్షల బ్యాంక్ బాలెన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూసిన భీంరెడ్డి ఆస్థుల విలువ బహిరంగ మార్కెట్‌లో వందల కోట్లలో ఉంటుంది.

**మణికొండ మాజీ వైస్ ఛైర్మన్ ఇంట్లో ఏసీబీ సోదాలు**

ఆదాయానికి మించి ఆస్థులు కూడబెట్టాడన్న ఆరోపణలతో డిఎస్‌పి భీమ్‌రెడ్డిపై ఏసీబీ అధికారులు చేస్తున్న కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. గురువారం భీమ్‌రెడ్డి బినామీలు, బంధువులు అందరి ఇళ్లల్లో ఏసీబీ అధికారులు రైడ్ చేశారు. ఈ క్రమంలో మణికొండ మాజీ వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి డిఎస్‌పి భీమ్‌రెడ్డికి బినామీగా ఉన్నట్లు అనుమానం వచ్చిన ఏసీబీ అధికారులు ఆయన ఇంట్లో దాడులు నిర్వహించి, బీర్వాలు, సెల్ఫ్‌లు అన్నీ జల్లడపట్టారు. తనిఖీల అనంతరం కొన్ని డాక్యుమెంట్లు, కొంత నగదును ఏసీబీ అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. ఈ డాక్యుమెంట్లు నరేందర్‌రెడ్డి ఇంట్లో ఎందుకున్నాయి? ఇవి నరేందర్‌రెడ్డివా? ఆరోపణలు వినిపిస్తున్నట్లు భీమ్‌రెడ్డివా? నిగ్గు తేల్చే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు. 2002-2005 మధ్యలో భీమ్‌రెడ్డి రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐగా పని చేసిన సమయం నుంచి నరేందర్‌రెడ్డి పరిచయం అయ్యారు. ఈ పరిచయం స్నేహంగా మారింది. నరేందర్‌రెడ్డి సైతం బిజెపి పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి మణికొండకు సర్పంచ్‌గా, వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. మణికొండలో రియల్ ఎస్టేట్ ఊపందుకున్న సమయంలో నరేందర్‌రెడ్డి సర్పంచ్‌గా పని చేశారు. ఆ సమయంలో ఇరువురి మధ్య ఏమైనా బినామీ ఆస్థులకు సంబంధించిన వ్యవహారం కొనసాగిందా? అన్న కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు తరువాతనే బినామీ ఆస్థులు ఉన్నమాట వాస్తవమా? ఆరోపణలు మాత్రమేనా? అన్న విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



న్యూఢిల్లీలో గురువారం ప్రధాని మోడీ, జపాన్ ప్రధాని తకైచి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాలకు చెందిన అధికారులు

## జపాన్‌తో భారత్‌కు ఎఐ బంధం

>> దీంతో ఇండియా- జపాన్ మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపడనున్నాయి. గురువారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ భవన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ, జపాన్ ప్రధాని సనయే తకైచి మధ్య జరిగిన వార్షిక శిఖరాగ్ర స్థాయి చర్చల సందర్భంగా పలు ఒప్పందాలు కుదిరాయి. చర్చల అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యానికి పరస్పర విశ్వాసమే అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్న ప్రధాని మోడీ, స్వేచ్ఛాయుత, ఇండోపసిఫిక్ ప్రాంతం ఉమ్మడి ప్రాధాన్యతగా కొనసాగుతుందని ఉద్ఘాటించారు. అలాగే, ఎఐపై కొత్త ఉమ్మడి ప్రకటన, చారిత్రాత్మక సైనిక సహఅభివృద్ధి ప్రాజెక్ట్ భవిష్యత్తు ద్వైపాక్షిక సహకారానికి కీలక స్తంభాలుగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో పరస్పర విశ్వాసం అత్యంత విలువైన ఆస్తి అని, భారత్- జపాన్ ద్వైపాక్షిక భాగస్వామ్యం కాల పరీక్షకు నిలిచిందని అన్నారు. నేడు భారత్ - జపాన్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఉన్నాయని, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్ ప్రాంతం రెండు దేశాలకు ఉమ్మడి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక భద్రత, ఇంధన భద్రత ప్రాముఖ్యతను రెండు దేశాలు అర్థం చేసుకున్నాయని ఆయన నొక్కి చెప్పారు. భారత్- జపాన్ సహకారంలో సాంకేతిక భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైన స్తంభంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు, భారత్ - జపాన్ ఎఐ రంగంలో ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయని మోడీ చెప్పారు. జపాన్ ఖచ్చితమైన సాంకేతికత, భారతదేశ సాఫ్ట్‌వేర్ సామర్థ్యాల కలయిక ప్రపంచ ఎఐ అభివృద్ధికి కొత్త ఊపును. బలాన్ని ఇస్తుందని ప్రధాని పేర్కొన్నారు. రక్షణ రంగంలో భారత్- జపాన్ మధ్య మొదటి సహఅభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై రెండు దేశాలు సంతకాలు చేశాయని ఆయన తెలిపారు.

**'అన్నాచెల్లెళ్లుగ్గా సంబంధాలను మరింత బలోపేతం: తకైచి**

పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో లోతైన ద్వైపాక్షి క సహకారం అవసరాన్ని ఎంతైనా ఉంది. ఉమ్మడి శ్రేయస్సును సాధించడానికి జపాన్, భారత్ తమ తమ బలాలను ఉపయోగించుకోవాలని జపాన్ ప్రధాని సనాయ్ తకైచి అన్నారు. సంయుక్త విలేకరుల సమావేశంలో జపాన్ ప్రధాని మాట్లాడుతూ, లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధాని మోడీ తనను "అందమైన చెల్లెల్లు" అని ఆప్యాయంగా సంబోధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రెండు దేశాల దృక్పథాలు ఒకేలా ఉన్నాయని, "అన్నాచెల్లెళ్లుగ్గా" సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆమె అన్నారు. "జపాన్, భారత్ కలిసికట్టుగా మరింత బలంగా, సుసంపన్నంగా మారడానికి మన మన బలాలను ఉపయోగించుకోవాలి. అంతర్జాతీయ వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉన్న ఈ తరుణంలో, ఇటువంటి పరస్పర పూరక సహకార సంబంధాన్ని నెలకొల్పడం మరింత ముఖ్యమైంద్ని" అని తకైచి పేర్కొన్నారు. భారత్-జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యం కింద, వ్యూహాత్మక దిశను పంచుకునే విశ్వసనీయ భాగస్వాములుగా, నా పెద్దన్నయ్య అయిన ప్రధాని మోడీతో కలిసి, భారత్-జపాన్ సంబంధాలు ఒక కొత్త దశలోకి ముందుకు సాగుతున్నాయని నమ్ముతున్నాను. వచ్చేసారి జపాన్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలకడానికి నేను ఎదురుచూస్తున్నా" అని తకైచి చెప్పారు.

అంతకుముందు, రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ప్రధాని తకైచికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ కూడా పాల్గొన్నారు. జపాన్ ప్రధానమంత్రి మూడు రోజుల భారత పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ప్రధానమంత్రి తకైచి భారతదేశంలో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన ఇది. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన ఒక ముఖ్యమైన ముందడుగు అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## జీరామ్‌జీ అమలు

>> అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు జవాబుదారీతనం పెంచే ఆలోచనలో భాగంగా రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్‌తో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులను కేబినెట్ మంజూరు చేసిందన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ బేసిక్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతించారు. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌ఓసిలు కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్-1 పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధికి రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. హిమాయత్ సాగర్ నుంచి ఈసా... ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు ఈ పనులు చేపడతారని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులు... నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల క్రియేషన్‌తో పాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్‌కు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో నిత్యావసర వస్తువులు గోదాముల నిర్మాణానికి 50 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాలను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేట్ ప్రకారం కేటాయించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలం కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేబినెట్ కేటాయించిందని వివరించారు. జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించిందని తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రులు సీతక్క,అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కేబినెట్ సమావేశానికి మంత్రి కొండా సురేఖ గైర్హాజరు

### సచివాలయ వర్గాల్లో చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై2:** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కీలక మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, గురువారం జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు. ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంలో తీవ్ర అలకపూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే గురువారం కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ జరుగుతోంది.

## విద్యుత్ సేవలు మరింత పారదర్శకం

### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శక, నాణ్యమైన విద్యుత్ సేవలను అందించేందుకు సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సిఎండి జితేష్ వి. పాటిల్ తెలిపారు. దీనికి సంబంధించి గురువారం ఒక ప్రకటనలో ఇందులో భాగంగా బిల్లింగ్ ప్రక్రియలోనే వినియోగదారుల విద్యుత్ సర్వీసులను సంబంధిత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) స్ట్రక్చర్ కోడ్‌లతో అనుసంధానం చేసే విధంగా ఆటోమేటెడ్ స్పాట్ బిల్లింగ్ మెషిన్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు వివరించారు. ఈ కొత్త విధానంలో మీటర్ రీడర్ ఒక డీటీఆర్ స్ట్రక్చర్ కోడ్‌ను ఎంపిక చేసి, ఆ డీటీఆర్‌కు అనుసంధానమైన అన్ని సర్వీసుల బిల్లింగ్‌ను వరుస క్రమంలో నిర్వహిస్తారన్నారు. దీంతో ప్రతి వినియోగదారు సర్వీస్ సరైన డీటీఆర్‌కు ఖచ్చితంగా మ్యాపింగ్ అవుతుందని వెల్లడించారు.

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో నూతన సిఎస్ సంజయ్‌జాజు భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 2:** రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మధ్యాహ్నం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ భార్య బదిలీ.. బిఆర్‌ఎస్ విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 2:** మాజీ ఐపిఎస్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సతీమణి లక్ష్మీబాయి బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖ మార్కెటింగ్ డైరెక్టర్ నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కోఆపరేటివ్స్‌కు బదిలీ చేశారు. ఈ బదిలీపై ప్రవీణ్‌కుమార్ స్పందించారు. అన్నింటికి తెగించే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. తొలుత తన భద్రత తగ్గించారని, హైకోర్టుకు వెళ్తే పాక్షిక ఉపశమనం లభించిందని చెప్పారు. అయినా జీర్ణించుకోలేక తన సతీమణిని బదిలీ చేశారని, సంబంధం లేని ఇతర పోస్టుకు బదిలీ చేశారన్నారు. భయపడేది లేదని, ప్రజల కోసం పోరాడుతూనే ఉంటానని చెప్పారు. బిఆర్‌ఎస్ నేత,మాజీ ఐపిఎస్ ప్రవీణ్‌కుమార్ భార్య,మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి బదిలీ అంశం వివాదంగా మారింది. ప్రవీణ్‌పై కక్షతోనే బదిలీ చేశారని బిఆర్‌ఎస్ నేతలు ధ్వజమెత్తారు. ఏడాదిలోపు రిటైర్మెంట్ అయ్యేవారిని బదిలీ చేయరాదనే నిబంధన ఉన్నా హౌసింగ్ ఫెడరేషన్ ఎండీగా బదిలీ చేశారని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి(ఐఎఎస్ శైలజా రామయ్యర్) విషయంలో తాము ఎప్పుడైనా అలా చేశామా? అని ప్రశ్నించారు.



కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు

## 'గురుకులాల్లోని అవినీతిపై మాట్లాడినందుకే ప్రభుత్వం కక్ష సాధింపు'

**హైదరాబాద్ (సైదాబాద్), జూలై 2, ప్రభాతవార్త:** తెలంగాణ భవన్ వద్ద అరెస్టు చేసిన బిఆర్‌ఎస్ నాయకులు హరీష్‌రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవి ప్రసాద్‌లను పోలీసులు కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రుల సవాల్‌ను స్వీకరించి గన్‌పార్క్‌కు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం జరిగిందన్నారు. దమ్ముంటే మీరు కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు రండి. లేదా మమ్మల్ని గన్‌పార్క్‌కు రానివ్వండి అంటూ మంత్రులకు వారు సవాల్ విసిరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి ఆహ్వానం పలికారు. ఛాలెంజ్‌ను స్వీకరించి చర్చకు వస్తున్న తమను అడ్డుకోవడం పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చర్చకే వస్తున్నామని, యుద్ధానికి కాదని ఆయన స్పష్టం చేశారు. మాజీ మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాలు, విద్యాసంస్థల్లో జరుగుతున్న అవినీతిపై మాట్లాడినందుకే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు.

**పోలీస్‌స్టేషన్ ముందు బిఆర్‌ఎస్ నాయకుల ఆందోళన**

బిఆర్‌ఎస్ నాయకులు హరీష్‌రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, జీవన్‌రెడ్డిలను కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. అక్రమంగా అరెస్టు చేసిన తమ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.




## పిఎఫ్ విత్‌డ్రాకు 25శాతం కనీసనిల్వ తప్పనిసరి

### 75% మాత్రమే విత్‌డ్రాకు వెసులుబాటు

**న్యూఢిల్లీ, జూలై 2:** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) పథకంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సవరించింది. పిఎఫ్ విత్‌డ్రా నిబంధనలను సవరిస్తూ ఉద్యోగుల భవిష్య నిధి పథకం, 2026ను నోటిఫై చేసింది. గతనెల 29 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం, పీఎఫ్ ఖాతా నుంచి పాక్షికంగా డబ్బులు విత్‌డ్రా చేయాలంటే, ఖాతాలో కనీసం 25 శాతం బ్యాలెన్స్ ఉంచడం తప్పనిసరి. ఉద్యోగి, యాజమాన్యం వాటాలు రెండింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. విత్‌డ్రాకు అందుబాటులో ఉండే మొత్తాన్ని లెక్కించే ముందు ఈ కనీస బ్యాలెన్స్‌ను పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఒకరి ఖాతాలో రూ.1 లక్ష అర్హత మొత్తం ఉంటే, అందులో రూ.25,000 కనీస బ్యాలెన్స్‌గా ఉంచి, మిగిలిన రూ.75,000 నుంచే పథకం నిబంధనలకు లోబడి విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. ఈ 25 శాతం తప్పనిసరి బ్యాలెన్స్‌ను తీసివేయగా మిగిలిన మొత్తాన్నే అర్హత ఉన్న సభ్యుని బ్యాలెన్స్‌గా ఈపీఎఫ్‌ఓ నిర్వచించింది. కొత్త పథకం కింద పాక్షిక విత్‌డ్రాలకు అనుమతించే కారణాల జాబితాను కూడా విస్తరించారు. గృహ సంబంధిత అవసరాలైన ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు, ఇంటి నిర్మాణానికి స్థలం కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణం తిరిగి చెల్లించడం, ఇంటి మరమ్మతులు లేదా ఆధునీకరణ వంటి వాటికి నిధులు డ్రా చేసుకోవచ్చు. వీటితో పాటు అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య, వివాహం వంటి ఖర్చుల కోసం అర్హత ఉన్న బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన 12 నెలల తర్వాత పాక్షిక విత్‌డ్రాలకు అర్హత లభిస్తుంది. ప్రత్యేక పరిస్థితుల్లో విత్‌డ్రా చేసుకునేందుకు అదనపు వివరణలు ఇవ్వాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేశారు. పిఎఫ్ చందాదారులు తమ పీఎఫ్ డబ్బులను నేరుగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా తమ బ్యాంకు ఖాతాల్లోకి పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తేనుంది. దీనికి సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ విధానం ద్వారా 7 కోట్లకు పైగా సభ్యులకు సేవలు వేగంగా, సులభంగా అందనున్నాయి. మరో నెల రోజుల్లో వాట్సాప్ ద్వారా కూడా కీలక సేవలను ప్రారంభించాలని ఈపీఎఫ్‌ఓ యోచిస్తోంది. ఈపీఎఫ్‌ఓ వెరిఫైడ్ వాట్సాప్ నంబర్‌కు హాలో అని మెసేజ్ పంపడం ద్వారా చందాదారులు సేవలు పొందవచ్చు.

# డీలిమిటేషన్ లక్ష్యంగా మోడీ వ్యూహం

### ఈ సమావేశాల్లోనే ఆమోదింపచేసేందుకు పక్కా కసరత్తు

**న్యూఢిల్లీ, జూలై 2:** మోడీ 4.0 లక్ష్యంగా కొత్త వ్యూహాలు సిద్ధం అవుతున్నాయి. తాజా లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. అందులో భాగంగా డీలిమిటేషన్ జమిలి నిర్వహణను ప్రధాని మోడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అమలు చేసి తీరాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు వీలుగా జాతీయ రాజకీయాల్లో వేగంగా అడుగులు పడుతున్నాయి. పార్లమెంట్ లో వీగిన బిల్లును మరోసారి ప్రవేశ పెట్టి ఆమోదం పొందేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా జమిలి డీలిమిటేషన్ అమలు ముహూర్తం దాదాపు ఖరారైంది. అధికారిక ప్రక్రియ లాంఛనంగా మారనుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొత్త లెక్కలు సిద్ధం చేస్తోంది. లోక్‌సభలో ఇటీవల వీగిపోయిన డీలిమిటేషన్ మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాగైనా ఆమోదించుకునే వ్యూహాలను సిద్ధం చేసింది. అందులో భాగంగా తాజాగా ఎన్డీఏ వైపు టీఎంసీ, థాక్రే శివసేన ఎంపీలు మద్దతుగా నిలవటం తో ధీమా కనిపిస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు (జమిలి) రెండింటికీ పార్లమెంట్ ఆమోదం పొందాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్‌లో డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు టీఎంసీ నుంచి 29 మంది, డీఎంకే నుంచి 22 మంది ఎంపీలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇండియా కూటమిలో ఉన్న టీఎంసీ, డీఎంకే పార్టీల ఆదేశాల ప్రకారం ఆయా ఎంపీలు ఇలా చేశారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టీఎంసీ నుంచి 20 మంది ఎన్డీఏ వైపు నిలుస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలపాల్సి ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 మంది (54 ) సభ్యుల మద్దతు ఉండగా, రాజ్యసభ లో ఎన్డీయేకు అనుకూలంగా 141 మంది (58 ) సభ్యుల మద్దతు మాత్రమే ఉంది. తాజా పరిణామా లతో టీఎంసీ (29 మంది ఎంపీలు), డీఎంకే (22 మంది ఎంపీలు) ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరైనా లేదా బిల్లుకు మద్దతు ప్రకటించినా డీలిమిటేషన్ బిల్లు లోక్‌సభలో గట్టెక్కే అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ఇండియా కూటమి నుంచి బయటకొచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ (లోక్‌సభ లో ముగ్గురు ఎంపీలు), కాంగ్రెస్‌తో దూరాన్ని పాటిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ (లోక్‌సభలో 37 మంది ఎంపీలు) ఒకవేళ మద్దతు ప్రకటిస్తే సునాయాసంగా లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు ఆమోదం లభించవచ్చు. ఇక, రాజ్యసభలోనూ లెక్కలు మారిపోతున్నాయి. ఈ లెక్కలను విశ్లేషించిన తర్వాతే.. డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం శాఖ మళ్లీ ప్రయత్నాలు చేస్తోంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా వీటి ఆమోదం అమలు దిశగా పక్కాగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. దీంతో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రాజకీయంగా కీలకంగా మారనున్నాయి.



# 'స్పీడ్ గంజాయి' ముఠా అరెస్టు

### రోజు దాదాపు 100 ఆర్డర్లకు సరఫరా

### యేడాదికి రూ. 5 కోట్లు ఆర్జిస్తున్న ముఠా: సిపి సజ్జనార్

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. హెచ్-పోస్ట్ అధికారులు, గుడిమల్కాపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పనిచేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌లతో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరా బాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని యుపిఐ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80-100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు.

ఒక్కో పార్సిల్‌లో 50-250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, యేడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఫోన్‌పే, యుపిఐ ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. ఎస్‌ఆర్‌నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తాన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. కాగా,ఈ అంతర్రాష్ట్ర ముఠా నెట్ వర్క్ ఛేదనలో 22 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్పీడ్ పోస్ట్ ద్వారా సరఫరా అవుతున్న గంజాయి ప్యాకెట్లను చూపుతున్న సిపి సజ్జనార్

## నకిలీ వీసాలతో 20 మంది మహిళలు అరెస్టు

### ఒమన్ వెళ్లేందుకు ప్రయత్నం

### అధికారుల తనిఖీతో బయటపడిన బాగోతం

**శంషాబాద్ జులై 2, ప్రభాతవార్త :** నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లేందుకు ప్రయ త్నించిన 20 మంది మహిళలను ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 20 మంది మహిళలు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానా శ్రయానికి చేరుకు న్నారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు తనిఖీలు చేస్తుండగా వారు సమర్పించిన వీసాలు నకిలీ అని తేలింది. మహిళలంతా ఒమన్ ఎయిర్ వేస్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వారిని అరెస్టు చేసి ఎయిర్ పోర్ట్ క్రైమ్ అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి శ్రీకాంత్‌గౌడ్

**ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు : ఎసిపి శ్రీకాంత్‌గౌడ్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి నకిలీ వీసాలతో ఒమన్ వెళ్లుందుకు ప్రయత్నించిన మహిళలపై అనుమానం వచ్చి విచారణ చేయగా వర్క్ వీసాకు బదులుగా టూరిస్ట్ వీసాతో చిన్న స్టాంప్ వేసుకోని వెళ్లేందుకు సిద్ధమైనట్లు అధికారులు గుర్తించి 20 మంది మహిళలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎసిపి శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు.మహిళలను విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారని నకిలీ విసాలను స్వాధీనం చేసుకొని మహిళల స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని అయితే విచారణలో 19 సబ్ ఏజెంట్స్ పేర్లు బయటకు వచ్చాయని వారిపైన ఇక ఏ ఎజెన్సీలు ఉన్నాయో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కోసం తాము విదేశాలకు వెళ్లేందుకు ఒక ట్రావెల్ ఏజెంట్‌ను ఆశ్రయిం చామని, అతను అసలు వీసాలు అని చెప్పి తమవద్ద పెద్దమొత్తంలో డబ్బులు వసూలుచేసి నకిలీవీసాలు ఇచ్చి మోసం చేశాడని మహిళలు వాపోయారు.

## బోడుప్పల్‌లో కల్వకుంట్ల కవిత భూపోరాటం

### ఉద్యమకారులతో కలిసి ఆందోళన

### తోపులాటలో కవితకు స్వల్పగాయాలు

**(హైదరాబాద్) ఉప్పల్, జులై 2, ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణసేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన భూపోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. బోడుప్పల్ బొల్లిగూడెంలో ఉద్యమకారులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో తోపులాట జరగడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అక్కడ వేసిన టెంట్లు తొలగించారు. అనంతరం కవిత సహా అక్కడున్న వారందరినీ అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలని, తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి డెడ్ లైన్ విధిస్తున్నామని హెచ్చరించారు. ఉద్యమకారులపై లాఠీచార్జ్ చేశారని, కార్యకర్తల రక్తం కళ్ల చూశారని ఆరోపించారు. ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని కవిత ఆరోపించారు. ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో ఉద్యమ కారులకు భూములు కేటాయించడంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. కవితతో పాటు పలువురు తెలంగాణ జాగృతి నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లారం పిఎస్‌కు తరలించారు.

# జులైలోనూ వర్షాలు అంతంతే

### 94 శాతానికే పరిమితమయ్యే అవకాశం

### సాధారణం కంటే తక్కువ వర్షపాతం

### ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాల రాక కోసం, స్థిరమైన వానచినుకుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలకు, సామాన్య ప్రజానీకానికి మరికొన్ని రోజులు నిరాశ తప్పేలా లేదు. జూన్ నెలలో తీవ్రమైన వర్షపాత లోటును ఎదుర్కొన్న దేశానికి, జూలై నెలలోనూ పెద్దగా ఊరట లభించే సూచనలు కనిపించడం లేదు. ఈ జూలైలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) విడుదల చేసిన అంచనాల్లో స్పష్టం చేసింది. దీర్ఘకాలిక సగటు 1971-2020 మధ్య కాలాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కించిన ప్రకారం జూలై నెలలో కేవలం 94 శాతం వర్షమే కురవొచ్చని ఐఎండీ తెలిపింది. సాధారణంగా జూలై నెలలో దీర్ఘకాలిక సగటు వర్షపాతం 280.4 మిల్లీమీటర్లుగా ఉంటుంది. గడిచిన జూన్ నెలలో దేశవ్యాప్తంగా ఏకంగా 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా మధ్య భారతంలో అత్యధికంగా 50.4 శాతం లోటు కనిపించింది. 1901లో వర్షపాత రికార్డులు ప్రారంభమైనప్పటి నుండి జూన్‌లో మూడవ అత్యల్ప వర్షపాతం నమోదైన నెలగా నిలిచింది. ఈ నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం కేవలం 99.5 మిల్లీమీటర్లుగానే రికార్డైంది. దేశవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాలకు మాత్రం తాత్కాలిక ఉపశమనం లభించనుంది. బంగాళాఖాతంలోని ఉత్తర భాగం నుంచి జమ్మూ కశ్మీర్ వరకూ దాదాపు 1500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న భారీ వర్ష మేఘాలు ఉపగ్రహ చిత్రాల్లో వ్యక్తమయ్యాయి. హిమాలయాలకు సమీపంలో ఏర్పడిన ఈ రుతుపవన ద్రోణి క్రమంగా దక్షి ణం వైపు కదులుతోంది. కాగా ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడానికి గల ప్రధాన కారణాలను ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వివరించారు. మధ్య-తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే ఎల్ నినో ప్రభావం రాబోయే నెలల్లో మరింత బలపడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు మాడెన్‌జూలియన్ ఆసిలేషన్ వాతావరణ వ్యవస్థ భారత్‌కు అనుకూలంగా లేకపోవడం, సముద్రంలో ఆశించిన స్థాయిలో అల్పపీడనాలు ఏర్పడకపోవడం, జూన్‌లో ఏర్పడిన తుపాను వ్యవస్థలు వాయవ్య దిశగా కదిలిపోవడం వల్ల రుతుపవనాల పురోగతి మందగించిందని ఆయన తెలిపారు.

# కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణకు చట్టం చేయాలి

### ఎస్ఎఫ్ఐ పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

### విద్యార్థి నాయకులపై లాఠీ-చార్జీ, అరెస్టులు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సం స్థల్లో ఫీజు నియంత్రణకు చట్టం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. తెలంగాణలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాసంస్థలను పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయ కేంద్రాలుగా మార్చే విధానాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ గురువారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేసి బలవంతంగా చెదర గొట్టేందుకు ప్రయత్నించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యను పూర్తిగా నిరక్ష్యం చేసిందని విమర్శించారు. ఒకవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇస్తూ, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడం ప్రభుత్వ విద్యకు గోరి కట్టడమేనని మండిపడ్డారు.

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండిస్తుందన్నారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# తెలంగాణ వ్యవసాయంపై ఇండొనేసియా అధ్యయనం

### రాష్ట్రంలో పర్యటించిన 12 మంది ప్రతినిధి బృందం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ప్రతినిధి బృందం అధ్యయనం చేస్తోంది. ఈ మేరకు 12 మందితో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇండోనేషియా ఆహార స్వయం సమృద్ధి దిశగా పయనిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ ఉన్నత విద్య, పరిశోధనా రంగానికి చెందిన 12 మంది సభ్యుల బృందం రెండు రోజులుగా రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధనను అధ్యయనం చేస్తోంది. ఆహార భద్రత, సుస్థిర వ్యవసాయ రంగాలలో సహకారాలను అన్వేషించడానికి హైదరాబాద్ విశ్వ విద్యాలయాన్ని (యూఓహెచ్) సందర్శించింది. భౌగోళికసూచన ఇండోనేషియా ఉన్నత విద్య, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సచివాలయ మంత్రిత్వ శాఖల సంయుక్త చొరవ అయిన వ్యవసాయ ప్రత్యామ్నాయాలను నేర్చుకోండి అనే కార్యక్రమం కింద ఈ పర్యటనను నిర్వహించారు. ఆహార భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించడంపై ఇండోనేషియా జాతీయ ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం అనుసంధానించబడిందని హైదరాబాద్ యూనివర్సిటీ గురువారం మీడియాకు వెల్లడించింది.

ఈ ప్రతినిధి బృందంలో ఉన్నత విద్య, శాస్త్ర, సాంకేతిక మం త్రిత్వ శాఖ, పరిశోధన, అభివృద్ధి డైరెక్టరేట్ జనరల్ కార్యదర్శి జునైదీ ఖోటిబ్‌తో పాటు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు ఉన్నారు. భారతదేశం మరియు ఇండోనేషియాలోని సంస్థల మధ్య సహకా రాలు, ఉమ్మడి పరిశోధన, జ్ఞానమార్పిడి ద్వారా సుస్థిరత, వ్యవసాయం, ఆహార వ్యవస్థలలోని ఉమ్మడి సవాళ్లను పరిష్కరించడంలో సహాయ పడగలవని హైదరాబాద్ విశ్వవిద్యాలయం విసి జె. అనురాధ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం పరిధిలో Floods-2026 పనుల నిమిత్తము టెండర్ నోటీసు నం. 08/2026-27, తేది: 30.06.2026లో అంచనా విలువ మొత్తం రూ.19.61 లక్షలకు టెండరు ఆహ్వానించడమైనది. టెండరు తేది: 01.07.2026 మ.03.00గం.ల నుండి 08.07.2026 మ.03.00గం.ల వరకు లభించును. గమనిక: మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడగలరు.
సం/-. ఏ వి పి యస్ నరసింహారావ్, యమ్‌టెక్, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం.
DIPR.NO. 5265-PP/CL/ADVT/1/2026-27 తేది: 02.07.2026

తెలంగాణ ప్రభుత్వం
ఎదులాపురం మునిసిపాలిటీ కార్యాలయము
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నెం: E1/EMC/176/2026-27, తేది: 02.07.2026. నిట్: E1/EMC/166/2026-27, తేది: 27.06.2026 (2వ పిలుపు). పని పేరు: ఎదులాపురం మునిసిపాలిటీలో వివిధ ప్రదేశాలలో బోర్ బావులు త్రవ్వుట (15 నం.లు) మరియు చేతి పంప్ సెంట్ల అమరిక (11 నం.లు) (2వ పిలుపు). అంచనా ధర: 12.65 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 03.07.2026, ఉ.11.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 06.07.2026, సా.4.00 గం. బిడ్ తెరుచు తేది: 06.07.2026, సా.4.30 గం. అధికారి పేరు & చిరునామాకు సంప్రదించుట: మొబైల్: 8500473773 (AEE)
DIPR.No.5322-PP/CL/Advt/1/2026-27, తేది: 02.07.2026 సం/- కమిషనర్, ఎదులాపురం మునిసిపాలిటీ

తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కమిషనర్ : తిరుమలగిరి
(కొటేషన్ కోరుతూ ప్రకటన)
టెండరు నోటీసు నం.Lr.No. MCT/E1/Quotation/2026-27/62 తేది: 02.07.2026
క్ర.సం. ఐటమ్ పేరు: 1. పారిశుధ్య పనులకు సంబంధించిన హైడ్రేటెడ్ లైమ్ పౌడర్, మలాథియాన్, సోడియం హైపోక్లోరైట్, స్టేబుల్ బ్లీచింగ్ పౌడర్, ఖిమోఫాస్, ఆయిల్ బాల్స్, నూనెలు, (స్ప్రే మిషన్ (బ్యాటరీ & తైవాన్) మొదలైనవి. 2. పారిశుధ్య పనులకు సంబంధించిన లేటెక్స్ రబ్బర్ చేతి తొడుగులు, లెదర్ చేతి తొడుగులు, లోగోతో కూడిన సేఫ్టీ రేడియం జాకెట్లు, ట్రూపర్ గమ్ బూట్లు, సేఫ్టీ కోన్‌లు, డస్ట్ బిన్‌లు (10 లీటర్లు), క్లాత్ మాస్క్‌లు, శానిటైజర్ 500 మి.లీ, డస్ట్ బిన్‌లు (120 లీటర్లు) మరియు లోగోలు మొదలైనవి.పైన పేర్కొన్న సామగ్రికి సంబంధించిన కొటేషన్ ఆహ్వాన నోటీసు షెడ్యూల్ తేదీలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: కొటేషన్ ప్రచురణ తేదీ, సమయం : 03.07.2026 ఉ. 10.00 గంటలకు. ముగింపు తేదీ, సమయం : 10.07.2026 సా.4.00 గంటలకు. తెరుచుతేదీ, సమయం : 10.07.2026 సా.4.15 గంటల తరువాత. కొటేషన్ ఆహ్వానించు మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి మున్సిపాలిటీ.
సం/-. కమిషనర్, తిరుమలగిరి మున్సిపాలిటీ.
DIPR.NO. 5336-PP/CL/ADVT/1/2026-27, తేది: 02.07.2026

వార్త

పట్టణాల శోభ ఎక్కడైనా ఒక్కటే, ప్రకృతి అందాలే పలువిధంగా పరిమళిస్తుంటాయి.
-తిరుక్కురళ్

# పతనం అంచున ప్రజారోగ్యం!


జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెబుతున్నా ఆచరణకు వచ్చేసరికి కనీస వైద్యసదుపాయాలు అందించలేకపోతున్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఈ లక్ష్యసాధన కోసం ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు.అయినా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికిపట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని చెప్పొచ్చు. అందరికీ వైద్యం అనేది దశాబ్దాలు దాటిపోయినా కనుచూపు మేరలో కన్పించడం లేదు. ఇప్పటికీ భారతదేశంలో దాదాపు నలభైఐదు కోట్ల మందికి పైగా అత్యవసర మందులు, వైద్యం అందుబాటులో లేవని చెబుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా దేశంలో మధ్యతరగతి ప్రజలు పెట్టే ఖర్చులో దాదాపు డెబ్బై శాతం పైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా సీజన్ మారినప్పుడల్లా ప్రజారోగ్యంపై రోగాలదాడి ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. కొత్త కొత్త మందులు,సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్సలు అందిస్తున్నా అంతకు రెట్టింపుస్థాయిలో రకరకాల వ్యాధులు విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ వ్యాధులను నియంత్రించడంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారని చెప్పొచ్చు. మొన్నటి కరోనా సృష్టించిన బీభత్సం నుండి ఇంకా కొందరు సంపూర్ణ ఆరోగ్యవంతులు కాలేకపోతున్నారు. ఆ వ్యాధి నుండి బయటపడేందుకు అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి నేటికీ కొలుకోలేకపోతున్నారు. ముఖ్యంగా గుండెజబ్బులు, కిడ్నీ తదితర వ్యాధులు విస్తరించిపోతున్నాయి. ఇక సీజన్‌తోపాటు వచ్చే వ్యాధుల గురించి చెప్పక్కర్లేదు. మలేరియా నిర్మూలనకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామని పాలకులు ఎంతగా చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులువేరుగా ఉన్నాయి.ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందుబాటులో లేదనే చెప్పొచ్చు. కలుషిత నీరు, దోమల కారణంగా డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలిపోతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో పసర్లు, వేర్లు, ఆకులతో వచ్చీరాని నాటువైద్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇకపోతే పట్టణాల్లో, నగరాల్లో ముఖ్యంగా మురికివాడల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులే కాదు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా రకరకాలజ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వీటన్నింటికంటే మించి నకిలీ, నాసిరకం మందులు జనారోగ్యాన్ని పతానంచుకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదైన మందుల రకాల కంటే రెట్టింపు స్థాయిలో నకిలీ, నాసిరకం మందులు చెలామణి అవుతున్నాయి. ఇవి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని గుల్లచేస్తున్న ఈ నకిలీ మందులు ఒక వ్యూహం ప్రకారం ప్రవేశపెడుతున్నారు. అప్పుడప్పుడు తప్పుబట్టుతున్నా ఏదో నామమాత్రపు కేసులతో కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీమళ్లీ పునరావృతంకాకుండా చేయలేకపోతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతిని దందాలు చోటు చేసుకుంటున్నా అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడటంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వాస్తవంగా ఆనాడే ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ముంబాయిలో నాసిరకం మందులతో పది మందికిపైగా మరణించడంతోప్రభుత్వం జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను నియమించింది. మంత్రిత్వ స్థాయి మొదలు దిగువ స్థాయి వరకు ఆరోగ్య, ఔషధ విభాగాల్లోని లొసుగులను వైఫల్యాలను అవినీతిని ఎత్తి చూపుతూ లెంటిన్ తన నివేదికలో ఆనాడే స్పష్టంగా పేర్కొన్నారు. ఆ నివేదికలో చేసిన ప్రతిపాదనలు పాలకులు అంతగా పట్టించుకోలేదనే చెప్పొచ్చు.నకిలీ మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు అటుంచి జబ్బు తగ్గకపోతే వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా అర్థంకాక వైద్యుడు మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. దానివల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా కుప్పకూలిపోతున్నాడు. అసలు వైద్య, ఆరోగ్య విషయంలో నిర్దిష్టమైన ప్రణాళిక,ముందుచూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. గత రెండు,మూడు వారాలుగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న విషజ్వరాలుప్రధానంగా గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి.ఇందులో మలేరియా, డెంగ్యూ అగ్రస్థానంలో ఉన్నట్లువార్తలు అందుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధిని ముఖ్యంగా డెంగ్యూను సకాలంలో గుర్తించలేకపోతున్నారు.వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. అన్నిటికంటే ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి ఇప్పటివరకు ఖచ్చితమైన ఔషధం, టీకా లేకపోవడంతో విస్తరణను అడ్డుకోలేకపోతున్నారు. పెరుగుతున్న వ్యాధుల బారిన పడుతున్న రోగులకు తగినట్టుగా ఆస్పత్రులు కానీ, సిబ్బంది కానీ లేవనిచెప్పొచ్చు.దారిద్య్రరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు వైద్యం అందుబాటులో లేదు. దీంతో కొన్ని గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగా చెలామణి అవుతూ తోచిన మందులు ఇచ్చేవారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు స్పష్టంగా రాయలేనివారు కూడా డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లు వైద్యనిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలు నేర్చుకొని ప్రజారోగ్యం ఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.



హెచ్. పోర్టర్

మామూలు మనుషులు కాలాన్ని ఎలా ఖర్చు చేయాలా అని ఆలోచిస్తే తెలివిమంతుడు కాలాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు.



సెయింట్ బెర్నార్డ్

## ప్రజావాక్కు



### రైళ్లలో నాణ్యమైన ఆహారం అందేనా?

ముంబై వెళ్తున్న తేజస్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడికి అందించిన వెజ్ బిర్యానీలో ఈగ కనిపించిన ఘటన మరోసారి భారతీయ రైల్వేల్లో అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తింది. ప్రయాణికులు పూర్తి ధర చెల్లించి భోజనం కొనుగోలు చేస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో నాణ్యతలేని, అపరిశుభ్రమైన ఆహారం అందుతుండటం ఆందోళనకలిగిస్తోంది.ఈఘటనపై సంబంధిత విక్రేతకు రూ.1 లక్ష జరిమానా విధించి, లైసెన్స్ రద్దుకు షోకాజ్ నోటీసు జారీ చేయడం స్వాగతించదగ్గ చర్యే. అయితేఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటమే అసలు లక్ష్యం కావాలి. రైలులో అందించే ఆహారం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రయాణికుల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కూడా. అపరిశుభ్రమైన ఆహారం వల్ల ఫుడ్ పాయిజనింగ్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. భారతీయ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ఆహార నాణ్యతపై మరింత కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే..

**నవమాసాలు** మోసి కని పెంచి విద్యాబుద్ధులు నేర్పి, ఎదుగుదలకుకృషి చేసిన తల్లిదండ్రులను ముదివయస్సు రాగానే నిర్లక్ష్యం చేయడం తగదు. ఆస్తిపాస్తులు అందగానే భారంగా భావించివృద్ధాశ్రమం, బస్టాండు, రైల్వే స్టేషన్‌లో వదిలిచేతులు దులుపుకోవడం ఇటీవల ఎక్కువ అవుతుండడం ఆందోళనకరం.మానవతానికి మాయని మచ్చఅంటే అతిశయోక్తికాదు.జీవిత చరమాంకంలో మన వాళ్లతో ప్రేమ, ఆప్యాయతల పలకరింపు కోసమై ఎదురు చూస్తుంటారు. నడిచే దేవుళ్లు జననీజనకులు. వార్ధక్యం దశ చిన్న పిల్లలంటారు. కావున కంటికి రెపనపలా కాపాడుకోవాలి. రేపటిపౌరులు కూడా ఇదేబాటలో నడుస్తారు. ప్రత్యేక చట్టం అమలులో ఉండడం ఆనందదాయకం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూర్లు

### కార్మికులను పట్టించుకోరా..

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటలకోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు,ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగాలి.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### బ్లాక్ మెయిల్ కార్యకర్తలపై నిషేధం

**సమాచారహక్కు** చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న కొంతమంది కార్యకర్తలపై నిషేధం విధించాలని ఈమధ్య ఆర్టీఐ చీఫ్ కమిషనర్ ఆదేశించారు.ఎందుకంటే ఇలాంటివారి వలన అసలైన కార్యకర్తలకు చెడ్డపేరు వస్తుంది. బ్లాక్ మెయిలర్స్‌కు ఖచ్చితంగా అడ్డుకట్ట వెయ్యాలి. అయితే చీఫ్ కమిషనర్ కార్యకర్తలు అడిగిన సమాచారాన్ని తగినకాలంలో ఇవ్వని పీఐఒ పై, మొదటి అప్పిల్లేట్ అధికారులపై, సకాలంలో సమాధానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు గాని, జరిమానా విధించటం గానీ ఖచ్చితంగా అమలుపరచినప్పుడే కమిషనర్లను కార్యకర్తలు నమ్ముతారు. ఎంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారో లేక జరిమానావిధించారో కూడాకమిషనర్ పత్రికలకు ఇస్తేకార్యకర్తలకు ధైర్యం వస్తుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పే కమిషన్ నత్తనడక

ఒక కమిషన్ వేసి సంవత్సరాలు ఆలస్యం చేసి మొత్తం దేశం అంతా దానిని ఊరేగించి పెద్దల ఎదుట పెట్టి (పార్లమెంట్ ) హారతిఇప్పించి చేయడానికి 2సంవత్సరాలు పడటం నిజంగా హాస్యాస్పదం.దానికిఫైనాన్స్ మినిస్టర్‌నిట్టూర్పులు ఇక ఎన్నో చెప్పలేము. ఆవిడ అందరికీ వరాల జల్లులు కురిపిస్తారు పాపం ఉద్యోగుల మొహాలు చూస్తే ఆవిడకెందుకో నచ్చదు. డిఏలు, బేసిక్లు, హెచ్‌ఆర్‌ఏలు, ఏరియర్లు అంతకన్నా ముఖ్యంగా టాక్స్‌రిలీఫ్‌లు కనపడతాయి. అదే ఎంపిలకు ఒక లక్ష పెంచడానికి ఆవిడ సూపర్ సోనిక్ రాకెట్‌ను ఉపయోగిస్తారు. ఒక గంట అనుకోవడం వేరే నిమిషంలో ఆర్డర్స్. ఈ ఎనిమిదోవ పే కమిషన్ గూడ్స్ ఎప్పుడు మన స్టేషనకి వస్తుందో.

- గార్లపాటీ సీతారామయ్య, హైదరాబాద్

### ఉద్యోగావకాశాల కల్పన

భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గా గుర్తింపు పొందనున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఉద్ధండరాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133క్యూబిట్లక్వాంటం కంప్యూటర్(సిస్టమ్2)ను నెలకొల్పడం. ఐబీఎం, టీసీఎస్ వంటి గ్లోబల్‌సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి.ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

-కె.రామకృష్ణ, నల్గొండ జిల్లా

# సామాజిక ఉద్యమమే శాశ్వత పరిష్కారం!

**'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహిష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల మనుగడ కోసం చరిత్ర మనపై ఉంచిన బాధ్యత.**



ఫిరోజ్ ఖాన్

మనం ప్లాస్టిక్‌ను వాడుతున్నామా.. లేక ప్లాస్టిక్కేమనల్ని వాడుకుంటూ నిశ్శబ్దంగా మన సమాధిని తవ్వుతోందా? ఆధునిక మానవాళి అలవాటు చేసుకున్న 'యూజ్ అండ్ త్రో' సంస్కృతి నేడు భూగోళానికి నిశ్శబ్ద ముప్పుగా మారింది. ఉదయం లేచింది మొదలు పాలు, కూరగాయల నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతి అవసరానికి ప్లాస్టిక్ కవర్లపై ఆధారపడటం ఒక సామాజిక వ్యసనంగా మారింది. కేవలం 12 నిమిషాల సగటు కాల పరిమితి కోసం మనం వాడి విసిరేసే ఈ ఒక్క సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచి, ఈ భూమిపై పూర్తిగా విచ్ఛిన్నం కావడానికి 500 నుండి 1000 సంవత్సరాల సమయం పడుతుందనే నిజం మనల్ని నిలువునా వణికించకమానదు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన పర్యావరణ నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ సంచులు వినియోగంలోకి వస్తున్నాయి. వాటిలో అత్యధికం చివరికి చెత్తకుప్పలకే చేరుతున్నాయి.ఇక్కడ ఉద్భవిస్తున్న పదునైన ప్రశ్న ఒక్కటే. పర్యావరణాన్ని నిశ్శబ్దంగా మింగేస్తున్న ఈ మహమ్మారిని అరికట్టడానికి తెచ్చిన కఠినమైన చట్టాలు, క్షేత్రస్థాయిలో ఎందుకు కాగితాలకే పరిమితమవుతున్నాయి? ప్రస్తుత వర్షాకాలంలో విచ్చలవిడిగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, ఆకాశం, జలాలను కలుషితం చేస్తూ పర్యావరణ సమతుల్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ప్లాస్టిక్ సంచుల వల్ల మురుగు కాల్వలు, డ్రైనేజీ వ్యవస్థలు పూడిపోయి నగరాలు స్వల్ప వర్షాలకే జలమయమవుతున్నాయి. అందుకు 2005 జులైలో ముంబై నగరంలో సంభవించిన భారీ వరదలకు ప్లాస్టిక్ వ్యర్థాలే ప్రధాన కారణమని నిపుణుల కమిటీలు అధికారికంగా తేల్చడం ఒక చారిత్రకసాక్ష్యం. అంతకంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఎల్లెన్ మాక్‌ఆర్థర్ ఫౌండేషన్ పరిశోధనా పత్రాల ప్రకారం, ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి సముద్రాలలో చేపల మొత్తం బరువు కంటే ప్లాస్టిక్ వ్యర్థాల బరువే ఎక్కువగా ఉంటుందని అంచనా. ఈవ్యర్థాలు నీటిలో విచ్ఛిన్నమై మైక్రోప్లాస్టిక్స్ (కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు) రూపంలో మారి సముద్ర జీవుల శరీరాల్లోకి, వాటి ద్వారా తిరిగి మానవ ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయి. మనం పారేసిన విషం తిరిగి మన ప్లేట్లలోకే వస్తోందని, దీనివల్ల మానవ శరీరంలో క్యాన్సర్ కారకాలు, హార్మోన్ల అసమతుల్యత పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో రోడ్లపై పారేసే ప్లాస్టిక్ చెత్తను ఆహారంగా భ్రమించి అమాయక పశువులు తింటున్నాయి, ఫలితంగా వాటి జీర్ణ వ్యవస్థలు దెబ్బతిని ప్రతిఏటా వేలాది మూగజీవాలు మృత్యువాత పడుతున్నట్లు



వెటర్నరీ నివేదికలు నిరూపిస్తున్నాయి. భారతదేశంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 జులై 1 నుండి దేశవ్యాప్తంగా 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకాలపై అధికారికంగా కఠిన నిషేధం విధిస్తూ గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. చట్టం ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడిన వారికి పర్యావరణ పరిరక్షణ చట్టం1986 కింద భారీ జరిమానాలతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించే నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ సంచుల వినియోగం ఇంకా యథేచ్ఛగా కొనసాగుతుండటం పాలనాపరమైన వైఫల్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 127 దేశాలు ప్లాస్టిక్ సంచులపై పూర్తిగా లేదా పాక్షికంగా నియంత్రణ చట్టాలు తెచ్చినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాలేదు. అయితే, ఈ సమస్యకు మరో కోణం కూడా ఉంది. ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం, ప్లాస్టిక్ పరిశ్రమలపై ఆధారపడి దేశంలోలక్షలాది మంది కార్మికులు, చిన్న వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు.వీరికి సరైన పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను, రాయితీలతో కూడిన బట్ట సంచులు లేదా జూట్ బ్యాగుల తయారీ పరిశ్రమలనుప్రభుత్వం భారీగా ప్రోత్సహించకపోవడం, తగినంత సమయం ఇవ్వకుండా ఆకస్మిక చర్యలకు దిగడం కూడా చట్టం పూర్తి స్థాయిలో విజయవంతం కాకపోవడానికి ఒక ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ భూమి మన సొంత ఆస్తి కాదు, రేపటి తరాలకు మనం ఇవ్వాల్సిన పచ్చని ఆస్తి. దీనిని ప్లాస్టిక్ సమాధిగా మార్చే హక్కు ఏ మనిషికీ లేదు. కేవలం ప్రభుత్వాల లాఠీలు, జరిమానాల వల్లే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. చట్టాల పట్ల భయం కంటే సమాజంలో పర్యా వరణం పట్ల నైతిక భయం పెరగాలి. 2024లో జరిగిన ఐక్యరాజ్యసమితి ప్లాస్టిక్ ఒప్పంద చర్చలు సైతం కేవలం వినియోగాన్ని మార్చడం మాత్రమే కాదు, ఉత్పత్తి స్థాయిలోనే ప్లాస్టిక్‌ను నియంత్రించాలని స్పష్టం చేశాయి. 'కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతిలో ఒక బట్ట సంచి పట్టుకెళ్లడం' అనే ఒక చిన్న అలవాటు రేపటి తరం భవిష్యత్తును మార్చగలదు. వ్యాపారులు లాభాపేక్షను పక్కనపెట్టి, వినియోగదారులు బద్ధకాన్ని వదిలిపెట్టి స్వచ్ఛందంగా 3ఆర్ (రిడ్యూస్, రీయూస్, రీసైకిల్) సూత్రాన్ని నిత్యజీవితంలో అమలు చేయాలి. ఒక చేత్తో ప్లాస్టిక్ మహమ్మారిని బహి ష్కరిస్తూ, మరో చేత్తో పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఆహ్వానించినప్పుడే ఈ యుద్ధంలో మనం గెలుస్తాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని కేవలం ఒక రోజు నినాదాల వేడుకగా కాకుండా, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాల బాధ్యతతో ముగిసే కార్యక్రమంకాదు, ప్రతి పౌరుడు చేపట్టాల్సిన జీవన ఉద్యమం. అది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం కాదు, రాబోయే తరాల మనుగడ కోసం చరిత్ర మనపై ఉంచిన బాధ్యత. ●

# ఇయు దేశాల్లోనూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం

బొల్లిముంత సాంబశివరావు

యూరోపియన్యూనియన్ అనేది 27దేశాల మధ్య ఏర్పడిన ఒకప్రత్యేకమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఉమ్మడి చట్టాలను రూపొందించడం, ప్రజల స్వేచ్ఛాసంచారాన్ని ప్రోత్సహించడం దాని ముఖ్యఉద్దేశం. దీనికి యూరో కరెన్సీ ప్రత్యేకంగా ఉంది. 20 దేశాలు యూరో కరెన్సీని ఉపయోగిస్తున్నాయి.దీనిని యూరో జోన్ అంటారు. ఈయూ ప్రజలచే ఎన్నుకోబడిన పార్లమెంట్, యూరోపియన్ కమిషన్ ఈయూ పరిపాలన నిర్వహిస్తాయి. ఇది పెద్ద ఆర్థికవ్యవస్థను కలిగిఉంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థికమాంద్యం తర్వాత యూరప్ దేశాలు తమ ప్రభుత్వరంగాలను ద్రవ్యలోటును అదుపు చేయలేకపోయాయి.ఈ దేశాలన్నిటికీ ఒకే కరెన్సీ యూరో ఉండటం వల్ల, ఆర్థికకంగా వెనుకబడిన దేశాలు తమ సొంత కరెన్సీ ఏర్పాటు చేసుకునే అవకాశం కోల్పోయాయి. రియల్‌ఎస్టేట్ రంగంలో సమస్యలు, ప్రైవేట్ అప్పులు పెరిగిపోవడంవల్ల అనేక బ్యాంకులు దివాలా స్థాయికి చేరుకున్నాయి. యూరప్ సెంట్రల్ బ్యాంకు స్వతంత్రంగా పనిచేసినప్పటికీ, గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లు, డాలర్ మారకం రేటు యూరప్ ఆర్థిక నిర్ణ యాలను తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక విధానాలు పేదరికాన్ని, సంపన్నవర్గాలను సృష్టిస్తుంది. యూరోపియన్యూనియన్లో ఈ విభజన ఎక్కు వగానే ఉంది. ఈ యూనియన్లో 27 దేశాలు ఉన్నాయి. ఈ దేశాల జనాభా 45 కోట్లు. ఇందులో 9.27 కోట్లమంది పేదరికంలో ఉన్నారు. ఇది మొత్తం జనాభాలో 20.9 గాఉన్నారు. ఇక్కడ పేదరికం కొలమానం వేరుగా ఉంటుంది. అంటే కనీస అవసరాలు లేనివారు కాకుండా, జాతీయ ఆదాయంలో 60శాతం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారు పేదలుగా గుర్తించబడతారు.ఈయూలోని బల్గేరియా 29శాతం, గ్రీస్27.5 శాతం, రుమేనియా 27.4 శాతంతో అత్యధిక పేదరికం కలిగి ఉండగా, ప్రధాన ఆర్థికవ్యవస్థలుగా ఉన్న స్పెయిన్లో 25.7 శాతం, ఇటలీలో 22.6శాతం, జర్మనీలో



21.2 శాతం పేదరికంలోఉన్నారు. యూరప్యూనియన్లో సంపద, అసమానతలు, ఆదాయ అసమానతల కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇందులోని ధనిక దేశాల్లో కూడా సంపద పంపిణీలో భారీ వ్యత్యాసాలున్నాయి. అత్యంత ధనవంతులుగా ఉన్న 10 శాతం జనాభా,మొత్తం సంపదలో సుమారు 67శాతం కలిగిఉన్నారు. దిగువ 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం 1.2 శాతం సంపద మాత్రమే ఉంది. అత్యంత ధనవంతులైన 1శాతం కుబేరుల చేతుల్లో యూరప్ మొత్తం సంపదలో 24 శాతం పోగుబడి ఉంది. పూర్వపు సోషలిస్టు దేశాలైన స్లోవేకియా, హంగరీ,పోలెండ్ వంటి దేశాల్లో సంపద అసమానతలు తక్కువగాఉన్నాయి. దీన్ని గమనిస్తే ఆ దేశాల్లో గతంలో అమలు జరిపిన సోషలిస్టు ఆర్థిక విధానాలే కారణం అన్న వాస్తవాన్ని తెలియచేస్తున్నది. జర్మనీ, నెదర్లాండ్ వంటి దేశాల్లో సంపద కేంద్రీకరణ ఎక్కువ ఉంది. బల్గేరియా,రుమేనియా, గ్రీస్, స్పెయిన్ దేశాల్లో ప్రతినలుగురులో ఒకరు పేదరికంలో ఉన్నారు. యూరోపియన్యూనియన్ అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయి.అందుకు కారణం దాని ఆర్థిక సంక్షోభం. ఈయు నిబంధనల ప్రకారం జిడిపిలో అప్పుల శాతం 60 మించి ఉండకూడదు. అందుకు విరుద్ధంగా 81.7 శాతం ఉంది. యూరోజోన్ దేశాల అప్పులు 87.8శాతం వరకు ఉన్నాయి.కొన్నిదేశాలు ముఖ్యంగా గ్రీస్ 146 శాతం,ఇటలీ 136.8 శాతం, ఫ్రాన్స్ 117.7 శాతం ,బెల్జియం 107.1 శాతం,స్పెయిన్ 103.2 శాతం వాటి జిడిపిలో అత్యధిక అప్పులు కలిగి ఉన్నాయి. యూరోపియన్యూనియన్లో నిరుద్యోగం 6శాతంగా ఉంది. కోటి,32 లక్షలమంది ప్రజలు ఉపాధికి దూరంగా ఉన్నారు.యూనియన్ దేశాలైనఫిన్లాండ్ 10.5 శాతం, స్పెయిన్ 10.3 శాతం, గ్రీస్ 9.5శాతంతో అత్యధిక నిరుద్యోగం ఉంది. ఈయూలో యువత సగటు నిరుద్యోగం 15.1శాతంగా ఉంది. ముఖ్యంగా స్పెయిన్, గ్రీస్, ఇటలీ వంటి దక్షిణ ఐరోపా దేశాలలో యువతలో నిరుద్యోగం 24శాతంగా ఉంది. ప్రతి నలుగురులో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. గుత్తపెట్టుబడిదారుల మధ్య మార్కెట్ల కోసం పోటీ, అత్యధిక ప్రజల అవసరాలకు కాకుండా కొద్ది సంపన్నుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులు అధికంగా చేయడం, మార్కెట్ సంక్షోభం,ఆర్థికవ్యత్యాసాలు గుత్తపెట్టుబడిదారుల పోటీవల్ల ఏర్పడినవే.ఆర్థిక సంక్షోభం, కొద్ది మంది వద్దే సంపద కేంద్రీకరణ, ప్రజల పేదరికం. పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికసంక్షోభాలు తొలగాలంటే సోషలిస్టు విప్లవాలు విజయవంతం కావాలి. ●

# వ్యవస్థ కాపలాదారులే దోపిడీదారులైతే..



పాపని నాగరాజు

దేశంలో ప్రజాస్వామ్యానికి, సుపరిపాలనకు వెన్నెముక సివిల్ సర్వీసెస్ వ్యవస్థ. చట్టాన్ని అమలు చేయడం, ప్రజా వనరులను సంరక్షించడం, ప్రభుత్వ విధానాలను ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగాఅమలు చేయడం ఈ వ్యవస్థ ప్రధానబాధ్యత. కానీ చట్టాన్ని కాపాడాల్సిన వారే చట్టంలోని బలహీనతలను తమ లాభాల కోసం వినియోగించడం ప్రారంభిస్తే, ప్రజాస్వామ్యానికి అది తీవ్రమైన హెచ్చరికగా మారుతుంది. మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల భూ కుంభకోణం, అదే రాష్ట్ర లోకాయుక్త పనితీరుపై బయటపడిన గణాంకాలు, అలాగే తెలంగాణలో బయటపడుతున్న భూవ్యవహారాల వివాదాలు, ఇవన్నీ కలిసి భారత పాలనా వ్యవస్థలో దాగి ఉన్న ఒక అసౌకర్యకరమైన సత్యాన్ని బయటపెడుతున్నాయి. అవినీతిని అరికట్టడానికి ఏర్పాటైన వ్యవస్థలే అవినీతికి అద్దం పట్టే పరిస్థితి ఏర్పడింది. మధ్యప్రదేశ్ లోకాయుక్త స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ గత ఇరవై ఏళ్ల అధికారిక గణాంకాలు ఒక చేదు వాస్తవాన్ని చెబుతున్నాయి. 2006 నుంచి 2026 వరకు కోర్టులు లోకాయుక్త కేసుల్లో 2,067 మందిని దోషులుగా నిర్ధారించాయి.మొదటి చూపులో ఇది విజయం అనిపించవచ్చు. కానీ అదే కాలంలో 966 మంది నిర్దోషులుగా విడుదల కాగా, మరో 105 మంది కేసులు విచారణ దశకే చేరలేదు. మొత్తం 1,071 కేసుల్లో, అంటే దాదాపు 34 శాతం సందర్భాల్లో, అవినీతి నిరోధక వ్యవస్థ కోర్టులో తన వాదనను నిలబెట్టలేకపోయింది. ఇటీవలి పరిస్థితి మరింత ఆందోళనకరం.2025-26లో కేవలం 71 మందికే శిక్షపడగా, 62 మంది నిర్దోషులుగా బయటపడ్డారు. అంటే లోకాయుక్త వలలో చిక్కిన వ్యక్తి కోర్టులో తప్పించుకునే అవకాశాలు దాదాపు సమానంగా ఉన్నాయన్న మాట. ఇది దర్యాప్తు నాణ్యత, సాక్ష్యాల సమర్పణ, కేసుల నిర్వహణలో తీవ్రమైన లోపాలను సూచిస్తోంది. దోషులుగా తేలిన వారి వర్గీకరణను పరిశీలిస్తే అసలు అసమానత స్పష్టమవుతుంది. శిక్షపడిన వారిలో 85 శాతం మంది అత్యల్ప స్థాయి ఉద్యోగులే. రెవెన్యూ శాఖలో 652 కన్విక్షన్లలో 558 మంది పట్వారీలు. పోలీస్ శాఖలో 321 కేసుల్లో 242 మంది కానిస్టేబుళ్లు లేదా హెడ్ కానిస్టేబుళ్లు. విద్యుత్ శాఖలో 194 కేసుల్లో 91 మంది లైన్‌మెన్లు. కానీ ఐఏఎస్, ఐపీఎస్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులవాటా ఒక శాతానికీ చేరలేదు.ఇక్కడే వ్యవస్థలోని వర్గ వివక్ష బయటపడుతోంది. చిన్న స్థాయి ఉద్యోగులు శిక్షను ఎదుర్కొంటుంటే, పైస్థాయి అధికారులపై చట్టం ప్రభావం చూపలేకపోతోంది. ఈ అసమానతకు భోపాల్ సమీపంలోని గురాడీ ఘాట్ భూ వ్యవహారం ప్రత్యక్ష ఉదాహరణ. 2022 ఏప్రిల్ 4న ఒకే రోజున, ఒకే రిజిస్టర్డ్ పత్రం ద్వారా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, తెలంగాణ కేడర్లకు చెందిన దాదాపు 50 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గురాడీ



ఘాట్ గ్రామంలో 2.023 హెక్టార్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి మార్కెట్ విలువ సుమారు 7.78 కోట్లు కాగా, కొనుగోలు ధర కేవలం 5.50 కోట్లు మాత్రమే. భూమి కొనుగోలు జరిగిన కేవలం 16 నెలలకే, 2023 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం 3,200 కోట్ల వ్యయంతో వెస్టర్న్ బైపాస్ ప్రాజెక్టును ఆమోదించింది. ఆశ్చర్యకరంగా ఆ ప్రతిపాదిత రహదారి ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే వెళ్లేలా ప్రణాళిక రూపొందింది.ప్రభుత్వ ప్రాజెక్టులపై ముందస్తు సమాచారం లేకుండా ఇలాంటి పెట్టుబడి సాధ్యమా అన్న ప్రశ్న తప్పనిసరిగాతలెత్తుతుంది. అంతటితో ఆగకుండా, 2024 జూన్‌లో అదే భూమిని వ్యవసాయ వినియోగం నుంచి నివాస వినియోగానికి మార్చారు. దీంతో భూమి ధరలు అమాంతం పెరిగాయి. 2022లో చదరపు అడుగు ధర 81.75 ఉండగా, బైపాస్ ప్రకటన తర్వాత 557కు చేరింది. ప్రస్తుతం అది 2,500 నుంచి 3,000 వరకు పెరిగింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలో ఎలాంటి ఉత్పాదక శ్రమ లేకుండా, కేవలం అధికార సమాచారం మరియు విధాన నిర్ణయాల ఆధారంగా 50 నుంచి 60 కోట్ల లాభం ఆర్జించబడింది. ఇంతటి తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం మరింత ఆందోళనకరం. దేశవ్యాప్తంగా చర్చ జరిగినప్పటికీ అధికారిక విచారణ ప్రకటించలేదు. చివరకు 62 మంది మాజీ సివిల్ సర్వెంట్లతో కూడిన ఒక బృందం ముఖ్యమంత్రికి లేఖ రాసి స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేయాల్సి వచ్చింది. ఇది వ్యక్తిగత అవినీతిసమస్య మాత్రమే కాదని, వ్యవస్థాగత అవినీతి రూపమని వారు హెచ్చరించారు. మధ్యప్రదేశ్ మాత్రమే కాదు, తెలంగాణలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల వ్యవహారంలో ఉన్నతాధికారులు, వారి బంధువులు, బినామీల పేర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలను హైకోర్టు సీరియస్‌గా పరిగణించింది. భూములు, ప్రజా వనరుల కేటాయింపుల్లో సీనియర్ అధికారుల పాత్రపై తరచుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దిగువ స్థాయి ఉద్యోగులపై విచారణలు వేగంగా సాగుతుంటే, ఉన్నతాధికారుల కేసులు సంవత్సరాల పాటు విచారణలకే పరిమితమవడం ఒకే వ్యవస్థలో రెండు న్యాయాలున్నాయనే భావనను మరింత బలపరుస్తోంది. ఇక్కడ ఒకేవ్యవస్థలో రెండురకాల న్యాయం కనిపిస్తోంది. ఉదా. 500లంచం తీసుకున్న పట్వారీ లోకాయుక్త వలలో పడతాడు.అతని పేరు మీడియాలో వస్తుంది. అతను సస్పెండ్ అవుతాడు,జైలుకు వెళ్తాడు. అదే సమయంలో ప్రభుత్వ రహస్య సమాచారం ఆధారంగా కోట్ల రూపాయల లాభం పొందిన ఉన్నతాధికారులు లేదా ప్రజా భూములను ప్రభావంతో మళ్లించిన అధికార వర్గాలు విచారణకే పరిమితమవుతున్నాయి. చిన్న ఉద్యోగి చేసినది నేరమైతే, పెద్ద అధికారి చేసినది పెట్టుబడిగా మారుతోంది. అవినీతిని నిర్వచించే శక్తి కూడా అధికార వర్గాల చేతుల్లో ఉండటంతో చట్ట సమానత్వం కేవలం నినాదంగా మిగిలిపోతోంది. రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ హెచ్చరించినట్లే, చట్టం ఎంత గొప్పదైనా దాన్ని అమలు చేసే వ్యవస్థ న్యాయబద్ధంగా లేకపోతే సమానత్వం కాగితాలకే పరిమితమవుతుంది. మధ్యప్రదేశ్ లోకాయుక్త గణాంకాలు, గురాడీ ఘాట్ భూ కుంభకోణం, తెలంగాణ భూదాన్ భూముల వివాదాలు కలిసి ఒక అసౌకర్యకరమైన నిజాన్ని చెబుతున్నాయి. ఇది కేవలం అమలు వైఫల్యం కాదు, వ్యవస్థ రూపకల్పనలోనే ఉన్న అసమానత. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్వతంత్ర విచారణలు జరిపించాలి. లోకాయుక్త, ఏసీబీవంటి సంస్థలకు పూర్తి స్వతంత్రత,పైస్థాయి అధికారులపై కూడా నిర్భయంగా చర్యలు తీసుకునే సామర్థ్యం కల్పించాలి. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# న్యాయప్రక్రియలో ఎఐ అవసరమా?




## ఆగ్రహించిన సుప్రీం కోర్టు

### సమగ్ర అధ్యయనానికి నిపుణులతో కమిటీ

### ఎఐతో తయారు చేసిన తీర్పులపై కఠినచర్యలని హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 2:** న్యాయ ప్రక్రియలో ఎఐ వినియోగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఒక ముఖ్యమైన పరిణామంలో, ఒక దివాలా వివాదాన్ని పరిష్కరించే క్రమంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి), నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి) రెండూ ఉనికిలో లేని, ఎఐ సృష్టించిన "భ్రమలతో కూడిన" న్యాయపరమైన తీర్పులపై ఆధార పడ్డాయని గుర్తించిన సుప్రీంకోర్టు, ఆ రెండు ఫోరమ్‌లు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. న్యాయవాద వృత్తిలో ఎఐ వల్ల ఎదురవుతున్న పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు, తీర్పు ప్రక్రియలో కృత్రిమ మేధస్సు వాడకం వల్ల తలెత్తే సమస్యలను పరిశీలించడానికి నిపుణులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది.

"ఈ సమస్యలను వివరంగా పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కూడా ఆదేశించాము" అని కోర్టు పేర్కొంది. బార్ కౌన్సిల్ ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించి, శ్రద్ధగా చర్చించి, నిబంధనల ఉల్లంఘనపై తీసుకునే క్రమశిక్షణా చర్యలతో పాటు, ఇలాంటి సంఘటనలను నివారించడానికి ఒక మార్గదర్శక సూత్రాన్ని నిర్దేశించాలి. తీర్పు ప్రక్రియలో సహాయపడటానికి ఎఐని ఉపయోగించవచ్చని, కానీ అది మానవ తార్కికతను ఎప్పటికీ భర్తీ చేయలేదని కోర్టు పేర్కొంది. తీర్పు ప్రక్రియ ప్రతి దశలోనూ మానవుల "సంపూర్ణ, పూర్తి నియంత్రణ" లోనే ఉండాలని నొక్కి చెప్పింది. "ట్రిబ్యునల్ తన తీర్పుకు మద్దతుగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడిన, ఉనికిలో లేని నకిలీ, కల్పిత సమాచారాన్ని పూర్వతీర్పులుగా భావించి దానిపై ఆధారపడిన కేసు ఇది. కింద పేర్కొన్న కారణాల దృష్ట్యా, తీర్పు ప్రక్రియ, దాని సమగ్రతను ధ్రువీకరించడానికి, కాపాడటానికి, ఎన్‌సిఎల్‌టి తీర్పును, అలాగే అప్పీల్‌లోని తీర్పును కూడా రద్దు చేశాము" అని కోర్టు వ్యాఖ్యానించింది. వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేయడమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల న్యాయవ్యవస్థ వైఖరిని నిర్వచించడానికి ఈ కేసు ఒక అవకాశాన్ని కల్పించిందని కోర్టు అభిప్రాయపడింది. "అటువంటి తీర్పును పక్కన పెట్టడం వల్ల కలిగే అనివార్య పరిణామం కంటే, మా నిర్ణయాలు తీసుకోవడంలో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తీర్పుల ప్రక్రియలో సహాయపడటానికి కృత్రిమ మేధ సాంకేతికతను స్వీకరించాలనే మా సంకల్పం. అదే సమయంలో, ప్రతి దశలోనూ మానవ ప్రమేయంతో తీర్పులపై పూర్తి, సంపూర్ణ నియంత్రణను కలిగి ఉంటామని చెబుతున్నాము, ప్రకటిస్తున్నాము" అని ధర్మాసనం పేర్కొంది. కృత్రిమ మేధతో తయారు చేసిన తీర్పులను ఎవరైనా కోర్టుల్లో ప్రదర్శిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు పూర్వ తీర్పు ఆదేశాలను వెరిఫికేషన్ లేకుండా గుడ్డిగా నమ్మరాదు అని ధర్మాసనం సూచించింది.



# తమిళనాట అన్నాడిఎంకెకు భారీ షాక్

## మాజీ మంత్రులుసహా 15 వేలమంది మద్దతుదారులు టివికెలో చేరిక

**చెన్నై, జులై 2:** తమిళనాడులో అన్నాడీఎంకేకు కోలుకోలేనివిధంగా షాక్ తగిలింది. పార్టీకి చెందిన కీలకనేతలు, మాజీ మంత్రులు డాక్టర్ సి. విజయ భాస్కర్, ఎంఆర్ విజయభాస్కర్ అధికార తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీలో చేరారు. వీరితో పాటు సుమారు 15వేల మంది మద్దతుదారులు కూడా పార్టీ మారడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశ మైంది. చెన్నై సమీపంలోని మామల్లపురంలో గల ఒక ప్రైవేట్ రిసార్టులో గురువారం ఈ భారీ చేరికల కార్యక్రమం జరిగింది. టివికె ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మంత్రి ఆధవ్ అర్జున కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అన్నాడీఎంకే నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితోనే తాము పార్టీ మారుతున్నట్లు మాజీ మంత్రులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సి. విజయ భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు మరియు తర్వాతకూడా టివికెతో పొత్తు పెట్టుకోవాలని తాము పార్టీ అధిష్ఠానానికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజిఆర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా డిఎంకేతో పొత్తుకు ప్రయత్నిస్తుండటంతో తాము పార్టీలో ఇమడలేకపోయామని తెలిపారు. ప్రజల్లో అపారమైన విశ్వాసం నింపిన విజయ్ నాయకత్వంలోని టివికెలో చేరడమే సముచితమైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన అతిపెద్ద చేరికల్లో ఇది ఒకటి. ఈ ఇద్దరు మాజీ మంత్రులతో పాటు మరో మాజీ మంత్రి ఎస్. వలర్మతి, ఎఎస్ఎం ఆనందన్, పలువురు మాజీఎమ్మెల్యేలు, 208 మంది యూనియన్ కార్యదర్శులు కూడా టీవీకేలో చేరారు. కరూర్, పుదుక్కోట్టై జిల్లాల నుంచి సుమారు 200 బస్సులు, 600 కార్లలో భారీ సంఖ్యలో మద్దతుదారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.




# 1500 అడుగుల ఎత్తులో పెళ్లికి ప్రపోజ్‌చేసిన ప్రియుడు

## కట్‌చేస్తే అదుపులోకి తీసుకుని అరెస్టుచేసిన పోలీసులు

**వాషింగ్టన్, జులై 2:** అమెరికాలోని ప్రముఖ ఎంపైర్ స్టేట్ భవనంపైకి ఎక్కిన రష్యాకు చెందిన ఓ జంట అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1,454 అడుగుల ఎత్తులో ఉన్న ట్రాన్స్‌మిషన్ టవర్ శిఖరానికి చేరుకున్న వారు ప్రపంచ శాంతిని కోరుతూ ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. అనంతరం యువకుడు యువతికి లవ్ ప్రపోజ్ చేయగా ఆమె అంగీకరించింది. ఇద్దరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకున్నారు. అయితే ఈ సాహసం చివరకు వారి అరెస్ట్‌కు దారితీసింది. ఏంజెలా నికోలా, వాన్యా బీర్కస్ అనే ఈ జంట ముఖాలకు మాస్కులు ధరించి టవర్‌పైకి ఎక్కింది. అక్కడి నుంచి తమ సాహసాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం టవర్ దిగువ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న తర్వాత వాన్యా మోకాలిపై కూర్చుని ఏంజెలాకు ప్రపోజ్ చేశాడు. ఆమె అంగీకరించడంతో ఇద్దరూ తమ ఎంగేజ్‌మెంట్‌ను అక్కడే జరుపుకొన్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు భవనం అబ్జర్వేషన్ డెక్‌ను ఖాళీ చేయించారు. పరిసర ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. టవర్‌పైకి వారు ఎలా చేరుకున్నారనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. అనుమతి లేకుండా ఇంత ప్రమాదకరమైన ప్రాంతంలోకి వెళ్లడం తీవ్రముప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బండరాళ్లుపడి ఎనిమిది మంది కూలీలు మృతి



**బెంగళూరు, జులై 2:** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఎనిమిదిమంది మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కావేరి స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బీహార్‌కు చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై కర్ణాటక సిఎం శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సిఎం శివకుమార్ హెచ్చరించారు.

# ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

## పేలుళ్ల శబ్దాలకు వణికిన జనం

**కీవ్, జులై 2:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. చమురుశుద్ధి కార్మాగారాలు లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేయడంతో రష్యాలో ఇంధన కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. ఇందుకు ప్రతిస్పందనగా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై మాస్కో దళాలు విరుచుకుపడ్డాయి. కొన్ని గంటలపాటు క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించాయి. రాజధాని నగరం కీవ్‌లో భారీ పేలుళ్లు వినిపించడంతో ప్రజలు వణికిపోయారు. ఈ దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడిలో రష్యా బాలిస్టిక్, క్రూజ్ క్షిపణులు ఉపయోగించింది. దీంతో నిప్రో నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. ఆ దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరించడంతో.. పలువురు మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఇది భయంకరమైన శత్రుదాడి అని ఉక్రెయిన్ ప్రభుత్వం అభివర్ణించింది. ఇప్పటి వరకు ఒకరు మరణించారని, 11 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. కొన్ని రోజులుగా ఉక్రెయిన్ ప్రతి రోజూ వందల డ్రోన్లతో విరుచుకుపడటంతో రష్యా ఉక్కిరిబిక్కిరి అయింది. డ్రోన్లు, క్షిపణుల విడిభాగాలు తయారుచేసే కార్మాగారాలు సహా సైనిక, ఇంధన స్థావరాలపై దాడులు చేసింది. ఆ తర్వాత మాస్కోలో బ్లాక్ రెయిన్ కురిసినట్లు వార్తలు కూడా వచ్చాయి. ఈ దాడులతో ఇంధన కొరత ఏర్పడింది. ఈ విషయాన్ని రష్యా అధ్య క్షుడు పుతిన్ కూడా స్వయంగా అంగీకరించారు. ప్రస్తుతం బంకులవద్ద ప్రజలు బారులు తీరుతు న్నారు. పెట్రోలు ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో అందిస్తోంది. ఈ కొరతను అధిగమించేందుకు భారత్ నుంచి రష్యా పెట్రోల్ దిగుమతి చేసుకుంటోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.



# ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందం 99% కొలిక్కి

## - కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



**న్యూఢిల్లీ,జులై 2:** భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన ఇండోపాన్ స్ట్రాటజిక్ డైలాగ్ కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి.

ఈ యేడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## అరేబియా సముద్రంలో అమెరికా హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్: ఒకరు గల్లంతు



**వాషింగ్టన్, జులై 2:** అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న అమెరికా ఎంహెచ్-60 ఎస్ సీహాక్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. ఈ ఘటనలో అందులోని సిబ్బంది ఒకరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ కూడా ధ్రువీకరించింది. 'సముద్రంలో గల్లంతైన అమెరికా ఎయిర్ క్రూమెన్ కోసం మా దళాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేపట్టాము' అని ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని అమెరికా విమానకవాహక నౌక యుఎస్ఎస్ జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్‌పై మోహరించిన హెలికాప్టర్ ఇది.

## కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో ప్రయాణించిన ట్రంప్




**నార్త్ డకోటా(యుఎస్),జూలై 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సుమారు 37 యేళ్ల తర్వాత ఆధునికీకరించిన నూతన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తొలిసారిగా ప్రయాణించారు. నార్త్ డకోటాలో ఏర్పాటు చేసిన థియోడర్ రూజ్‌వెల్ట్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ఆయన ఈ కొత్త విమానంలోనే విచ్చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం అందుబాటులోకి వచ్చిన కొత్త అధ్యక్ష విమానంలో ఇదే తన తొలి ప్రయాణమని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెడోరాలో నిర్వహించిన కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు.

## ఇస్రో ఛైర్మన్ కార్యాలయానికి బాంబు బెదిరింపు

**బెంగళూరు,జులై 2:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రధాన కార్యాలయంలో గురువారం బాంబు బెదిరింపు కలకలం రేపింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రానికి ఈమెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదిరింపు నకిలీదని పోలీసులు నిర్ధారించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇస్రో కేంద్రంలోని ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు మెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన ఇస్రో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా ప్రాంగణాన్ని ఖాళీచేయించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు కానీ, అనుమానాస్పద వస్తువులు కానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు.

## అమర్‌నాథ్ యాత్రికుల తొలిబృందానికి ఘనస్వాగతం

**శ్రీనగర్,జూలై 2:** అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూశ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస, 20 ఇళ్లకు నిప్పు

**ఇంఫాల్,జులై 2:** మణిపూర్ రాష్ట్రంలో హింస మళ్లీ ప్రజ్వరిల్లింది. భారత్‌మయన్మార్ సరిహద్దు సమీపంలోని కామ్‌జోంగ్ జిల్లాలో నాగా, కుకీ సామాజిక వర్గాల మధ్య సాయుధ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరు వర్గాలకు చెందిన సాయుధ బృందాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో పాటు గ్రామాల్లోని 20కి పైగా ఇళ్లకు నిప్పు పెట్టారు. ఉదయం వేళ ఒక కుకీ గ్రామం నుండి వచ్చిన సాయుధులు సమీపంలోని నాగా గ్రామంపై దాడి చేసి 10 ఇళ్లను తగలబెట్టడంతో ఈ హింస ప్రారంభమైంది. ఆ తర్వాత మధ్యాహ్నం దీనికి ప్రతికారంగా మరో వర్గం జరిపిన ఎదురు దాడుల్లో నాగా కమ్యూనిటీకి చెందిన ఇంకో 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

# అయోధ్య రామమందిరం విరాళాల అక్రమాలపై కీలక భేటీ

## 6న ట్రస్ట్ అత్యవసర సమావేశం

**అయోధ్య, జులై 2:** రామమందిరంలో భక్తుల విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జూలై 6న కీలక సమావేశాన్ని నిర్వహించనుంది. ట్రస్ట్‌కు చెందిన అన్ని ట్రస్టీలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. విరాళాల దొంగతనం కేసు వెలుగులోకి వచ్చిన అనంతరం గత నెల 27న చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ట్రస్ట్ నిబంధనల ప్రకారం వారి రాజీనామాలను ఆమోదించాలంటే సమావేశానికి హాజరయ్యే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ మద్దతు అవసరం. ట్రస్ట్ నిబంధనల ప్రకారం పదవికి మాత్రమే రాజీనామా ఆమోదించబడుతుంది. అయితే ట్రస్టీ సభ్యత్వం మాత్రం కొనసాగుతుంది. దీంతో రాజీనామాలు ఆమోదమైనా చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ అధికారిక బాధ్యతల నుంచి మాత్రమే తప్పుకుంటారు. ట్రస్ట్ జీవితకాల సభ్యులుగా మాత్రం కొనసాగుతారు.

ఇదే నిబంధన ఇతర పదాధికారులకు కూడా వర్తిస్తుంది. ప్రస్తుతం ట్రస్ట్‌లో మొత్తం 14 మంది సభ్యులు ఉండగా, ఇద్దరు రాజీనామా చేయడంతో మిగిలిన 12 మంది ట్రస్టీలు ఈ అంశంపై ఓటింగ్ ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో మాజీ ట్రస్ట్ పదాధికారులపై న్యాయపరమైన ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఫైజాబాద్ బార్ అసోసియేషన్ చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ బాధ్యుడు గోపాల్ రావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది.

# కాంగ్రెస్‌లో విలీనం కానున్న శరద్‌పవార్ ఎన్సీపీ?

**ముంబయి, జులై 2:** మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు దారితీసే ఒక సంచలన పరిణామం తెరపైకి వచ్చింది. సీనియర్ నేత శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ శరద్ పవార్ శ్రేణి) పార్టీని, కాంగ్రెస్‌లో విలీనం చేసేదిశగా ఇరుపార్టీల మహారాష్ట్ర రాష్ట్రస్థాయి విభాగాలమధ్య అత్యంత రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు విశ్వసనీయసమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకవేళ ఈ విలీనంగనుక సఫలమైతే, మహారాష్ట్ర ప్రతిపక్ష రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఈ విలీన ప్రతిపాదనలపై రాష్ట్రస్థాయిలోనే ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ఎన్సీపీ (ఎస్పీ) తమ పార్టీ అంతర్గతంగా నేతలందరి మధ్య ఒక ఏకాభిప్రాయాన్నిసాధించిన తర్వాత, ఈ అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు. నిజానికి, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విలీన ఆలోచన వచ్చినప్పటికీ ఎన్నికల ప్రచారం, వ్యూహాల బిజీ వల్ల దీనిని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ఇప్పుడు ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. ఈ విలీన వార్తలు మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ కాంగ్రెస్, ఎన్సీపీ శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ థాకరే) కూటమిలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల ఉద్ధవ్ థాకరే వర్గంలో జరిగిన తిరుగుబాట్లు, అలాగే కూటమి ఐక్యతపై స్వయంగా ఉద్ధవ్ థాకరే బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎంవిఎ భాగస్వామ్య పక్షాల మధ్య ఇప్పటికే తీవ్రమైన భేదాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్, ఎన్సీపి విలీన ప్రయత్నాలు కూటమి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1999లో సోనియా గాంధీ విదేశీ మూలాల వివాదం నేపథ్యంలో శరద్ పవార్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని స్థాపించారు. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత మళ్లీ అదే కాంగ్రెస్ గూటికి శరద్ పవార్ చేరబోతుండటం గమనార్హం. 2023లో ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ సొంతంగా చీలిక తెచ్చి అధికార పక్షంతో చేతులు కలపడంవల్ల ఎన్సీపీ మరింత బలహీన పడింది. ఇటీవల అజిత్ పవార్ గ్రూపుతో విలీనాన్ని పూర్తిగా తోసిపుచ్చిన శరద్ పవార్.. ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమవ్వడం మహారాష్ట్ర పాలిటిక్స్‌లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

# చేతన్, సియాలకు పాలిగ్రాఫ్ టెస్ట్ తప్పనిసరి



## కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన పోలీసులు

## ఎవరు తోసివేసారనేందుకు ఆధారాలు లేవని వెల్లడి

**పూణె, జులై 2:** రియాల్టీ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్యకేసులో పోలీసులు నిందితురాలు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరిలకు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతించాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. న్యాయపరమైన ప్రక్రియ అనుసరించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పర్యవేక్షణలో ఈ పిటిషన్ దాఖలయింది. దర్యాప్తు అధికారులు ఇందుకు సంబంధించి విభిన్నరకాలుగా నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిశీలించారు. అలాగే కేతన్‌ను లోయలోకి ఎవరు తోసివేసారనడానికి ఆధారాలు కూడా లేవని దర్యాప్తు అధికారులు కోర్టుకు నివేదించారు.ప్రస్తుతం నిందితులిద్దరూ శుక్రవారం వరకూ పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. కేతన్ మొబైల్ ఫోన్ హత్యతర్వాత కొంతసేపటివరకూ సియావద్దనే ఉందని, ఆ తర్వాత ఆతని కుటుంబానికి అందచేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్‌తో ఏంచేసారన్నదే ఇపుడు విచారణలో తేలాల్సి ఉందన్నారు. సియా, ఆమె బాయ్‌ఫ్రెండ్ చేతన్ ఇద్దరూ డేటాను ధ్వంసం చేసారనేందుకు ఆధారాలు లేవని అన్నారు. అయితే కీలకమైన సాక్ష్యం ఏదయినా తొలగించారా అన్నది పరిశీలిస్తున్నట్లు ఒక పోలీస్ అధికారి తెలిపారు. పూణె రూరల్ పోలీసులు క్రైమ్‌సీన్‌ను ఇప్పటికే రీకన్‌స్ట్రక్షన్ చేసారు. చేతన్ చౌదరిని కూడా తీసుకెళ్లి హత్యాస్థలంలో రీకన్‌స్ట్రక్షన్ చేసారు. ఈ సమయంలోనే ఒక దమ్మికేతన్ బొమ్మను సియా, కేతన్‌లతోనే లోయలోకి తోసివేయించి సంఘటన క్రమాన్ని నమోదుచేసుకున్నారు.

# గురుకులాల్లో అవినీతి జరగలేదన్న మంత్రులు పొన్నం, అడ్లూరి, అజారుద్దీన్



గురువారం అమరవీరుల స్తూపం వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజారుద్దీన్ తదితరులు

## చర్చకు సిద్ధంగా ఉన్నామని అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చిన మంత్రులు

### చర్చకు వస్తే ప్రెస్‌క్లబ్‌లో చర్చిద్దామని మంత్రుల సవాల్

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో అవినీతిపై మంత్రులు, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు జరిగాయి. గురుకులాల్లో అవినీతి జరిగిందని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఆరోపించగా.. ఎక్కడా అవినీతి జరగలేదని టెండర్లు పారదర్శకంగా జరిగాయని వివిధ సంక్షేమ శాఖల మంత్రులు ప్రకటించారు. అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చర్చకు రావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, మహ్మద్ అజారుద్దీన్ గురువారం ఉదయం అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం దగ్గరకు వచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఎవరూ వచ్చిన చర్చకు సిద్ధంగా ఉన్నామని, వస్తే ప్రెస్‌క్లబ్‌లో చర్చిద్దామని సవాల్ విసిరారు. మొత్తం టెండర్లు రూ. 1143 కోట్లన్నారు. బీఆర్ఎస్ నేతలు ఒకసారి రూ.2 వేల కోట్లు అని మరోసారి రూ. 3 వేల కోట్లు అని ఆరోపణలు చేశారు ప్రవీణ్ కుమార్ కరీంనగర్ ఎస్పీగా ఉన్నప్పుడు విద్యార్థి నాయకులుగా మా నిజాయితీ తెలుసునని, తాము చర్చ చేయడానికి గన్ పార్క్ వద్దకు వచ్చామన్నారు. మొత్తం కొనుగోలు ప్రక్రియలో రూ. 687.77 కోట్లు టెండర్లు, ప్రభుత్వ రంగ సంస్థలు రూ. 455.23 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. టెండర్లు రూ.1143 కోట్లు అయితే రూ. 2 వేల కోట్లు, రూ.3 వేల కోట్లు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు మఫాత్‌లాల్ బట్టలు ధరించవద్దా, మాఫత్ లాల్ మాకు ఏమైనా చుట్టమా? తెలంగాణ పోరాట వీరులుగా మేము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నువ్వు ఐపీఎస్‌గా చేసిన వ్యక్తివి చట్టసభల్లో లేవు.. మాజీ మంత్రులు చర్చకు రావాలని మంత్రి పొన్నం సవాల్ విసిరారు. దేవాలయం లాంటి శాసనసభలో ఆరోపణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, మొత్తం టెండర్లు రూ.2 వేల కోట్లు కాదన్నారు. ప్రవీణ్ కుమార్ సెక్రటరీగా 10 సంవత్సరాలుగా సోషల్ వెల్ఫేర్‌లో మీరు చేసిన అవినీతిపై విచారణ చేయాలని సీఎంకు ముగ్గురం మంత్రులం లేఖలు రాస్తామన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ గత 10 సంవత్సరాలుగా అవినీతి చేసిన వ్యక్తి అని, ఏదో మాట్లాడడం కాదని, తాము తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర అసెంబ్లీ ముందు ఉన్నామని, చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రెస్ క్లబ్‌కి కూడా రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఎవరికి పడితే వారికి జవాబు చెప్పబోమని, మాజీ మంత్రులు రావాలి, మీ దగ్గర ఆధారాలు తీసుకొని రావాలని సవాల్ విసిరారు. తాము అవినీతి చేసినట్టు నిరూపిస్తే మీ దగ్గర ఆధారాలు చూపిస్తే మేము ముక్కు నెలకు రాసి రాజీనామా చేస్తామన్నారు. శాసన సభకి రండి చర్చిద్దాం, లేదా ప్రెస్‌క్లబ్‌కి మేము మంత్రులుగా వస్తాం మీ మాజీ మంత్రులు రావాలన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గురుకుల టెండర్లపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఇప్పుడు ప్రతిపక్ష నాయకులు వెనక్కి తగ్గడం ఎందుకని ప్రశ్నించారు. గురుకులాల టెండర్ల ప్రక్రియ మొత్తం అత్యంత పారదర్శకంగా, నిబంధనల మేరకే జరిగింది. రూ.686 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచాం... ప్రతి దశకు పూర్తి వివరాలు, ఆధారాలు మా వద్ద ఉన్నాయి. దాదాపు రూ.400 కోట్ల పనుల్లో ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రాధాన్యత కల్పించాం. ఎక్కడా అవకతవకలకు, అక్రమాలకు, పొరపాట్లకు తావులేకుండా టెండర్ల ప్రక్రియను నిర్వహించామన్నారు. హరీశ్‌రావుతో పాటు ఆయన భజన బృందం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవన్నారు. ఆరోపణలు చేయడం కాదు... ఆధారాలతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. పేద పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం పనిచేస్తుంటే... ప్రతిపక్షం రాజకీయ లబ్ధి కోసం అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న ఆరోపణలకు మా పార్టీ అధికార ప్రతినిధులే తగిన సమాధానం చెబుతారనన్నారు. స్పీకర్ వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, గురుకుల టెండర్లతో పాటు అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరగాలి. చర్చకు తేదీ, సమయం నిర్ణయించండి... ఆధారాలతో వచ్చి నిజాలు వెల్లడిస్తామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

# సిఎం, మంత్రులు తొడగొట్టి తోకముడిచారు

### మంత్రి జూపల్లి కోసం తెలంగాణభవన్‌లో కుర్చీ వేసి ఉంచాం

### మేం గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుని డ్రామాలు ఆడారు

### ముఖ్యమంత్రికి చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైర్



గురువారం పోలీసులతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వాగ్వాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై2:** అప్పులపై చర్చకు సిద్ధమని సవాళ్లు విసిరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రులు తీరా సమయం వచ్చేసరికి తోకముడిచి పారిపోయారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. సవాల్ విసిరి చేతకాక పారిపోయిన ఈ సన్నాసుల బాగోతాన్ని రాష్ట్ర ప్రజలంతా కళ్లారా చూశారని ఆయన మండిపడ్డారు. తానే స్వయంగా తెలంగాణ భవన్‌కు వస్తున్నానని ప్రగల్భాలు పలికిన మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం ప్రత్యేకంగా కుర్చీ వేసి, శాలువాతో మూడు గంటలపాటు వేచి చూసినా రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంత్రి రాకుండా మొహం చాటేయడంతోపాటు మరో చోట డ్రామాకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి గన్ పార్క్ వద్ద చర్చకు సిద్ధమై బయలుదేరిన హరీశ్‌రావును ఇతర నేతల్ని అరెస్టు చేయడం, మమ్ములను అడుగడుగునా అడ్డుకోవడం సిగ్గు చేటు అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అక్కడ కూర్చుని మంత్రులు సవాళ్లు విసరడం, ఇక్కడ పోలీసులను పెట్టి అడ్డుకోవడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని దుయ్యబట్టారు. కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌లోకు తరలించిన నేతలను పరామర్శించేందుకు కూడా వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు నిజంగానే చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సభలో మైక్ కట్ చేయకుండా తమకు మాట్లాడే అవకాశం ఇస్తే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల డొల్ల తనాన్ని, అవినీతి బండారాన్ని మొత్తం బట్టబయలు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలు, పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం నిత్యం ప్రయత్నిస్తోందని, ఇలాంటి శిఖండి రాజకీయాలను తెలంగాణ ప్రజలు అస్సలు సహించరని హెచ్చరించారు. రెండున్నరేళ్లలో అనుముల బ్రదర్స్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్నారని, అదానిని మించిన ఆస్తులు కూడబట్టారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం 2.80 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆర్బీఐ, కాగ్ లెక్కలు చెబుతుంటే, సీఎం, డిప్యూటీ సీఎంలు పొంతన లేని కాకి లెక్కలతో ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధానమంత్రి మాట్లాడినా, ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని బీజేపీని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై జరిగిన ఇడి దాడుల విచారణ ఏమైందో బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. అమృత్ టెండర్లలో జరిగిన భారీ అవినీతిపై ఎందుకు విచారణ జరపడం లేదని, కాంగ్రెస్ సర్కారులో బీజేపీ ఎంపీలకు కాంట్రాక్టులు ఎలా దక్కుతున్నాయో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై రాజకీయాలు, చీకటి ఒప్పందాలు తెలంగాణ ప్రజలకు అర్థమయిపోయాయని కేటీఆర్ విరుచుకు పడ్డారు. సీఎం, మంత్రులు ఇవాళ పారిపోయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నాలుగు కోట్ల ప్రజల పక్షాన నిత్యం ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒకే వేదికపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పొంతన లేని గణాంకాలు చెప్పి అడ్డంగా దొరికిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో నోట్ల కట్టలతో దొరికిన రేవంత్‌కు రాష్ట్రంలో విశ్వసనీయతే లేదని కేటీఆర్ మండిపడ్డారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పొంగులేటి కుమారుడు వట్టినాగులపల్లిలో కంపెనీలపై పడి భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. మేం హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టాం. దమ్ముంటే పొంగులేటి లక్షా ఒకటో ఇల్లు కట్టి చూపించాలని సవాల్ విసిరారు. దగాకోరు, అవినీతి పాలనపై రాజీలేని పోరాటం చేసి కాంగ్రెస్ ముసుగును తొలగిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రైతు సంగ్రామసదస్సులు, యువజన, విద్యార్థి సదస్సుల ద్వారా కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ నిలదీసి, ప్రజలను చైతన్యవంతం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.



గురువారం సచివాలయంలో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతిపత్రం అందజేసిన గిరిజన ఎమ్మెల్యేలు

# ఏజెన్సీలోని నియోజకవర్గాల్లో అదనంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గిరిజన ఎమ్మెల్యేలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** తెలంగాణకు చెందిన ఆదివాసి,గిరిజన శాసన సభ్యులు పలు అంశాలపైన సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు అందించారు. గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో వారు సిఎంను కలిసి ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు ఇందిర గిరిజల వికాసం పథకం అమలు చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలి. ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్‌రావు, ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడ్మ బొజ్జు ఉన్నారు, ఈ సందర్భంగా సిఎం వద్ద జరిగిన సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

# గుడిసెలకు పట్టాలివ్వాలని 6న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

### వామపక్షాల తీర్మానం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గుడిసెలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ధర్నా చేపట్టాలని రాష్ట్రంలోని లెఫ్ట్ పార్టీలు తీర్మానించాయి. గురువారం తెలంగాణ రాష్ట్రంలోని లెఫ్ట్ పార్టీలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్రంలోని గుడిసె వాసులందరికి పట్టాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యానగర్‌లోని సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యాలయం మార్క్స్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో తీర్మానం చేశాయి. ప్రతి గుడిసెకు పట్టా- పేదవాడికి ఇల్లు అనే నినాదంతో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించాలని లెఫ్ట్ పార్టీలు నిర్ణయించాయి. దీంతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో గల లక్షలాది ఎకరాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కూడా ఈ ధర్నా లో డిమాండ్ చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పశ్య పద్మ, ఇటి నర్సింహ, సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీ, అబ్బాస్, సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఎం.హన్మేశ్, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ నాయకులు భరత్ పాల్గొన్నారు.

# ఫీజులు చెల్లిస్తారా.. లేదా గద్దె దిగుతారా?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బిసి జెఎసి

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బిసి జేఏసీ ఇచ్చిన కళాశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బర్కత్ పుర చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి శాసనమండలి బిఆర్ఎస్ పక్షనాయకుడు ఎస్.మధుసూదనాచారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్ గుజ్జ కృష్ణ రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. తెలంగాణలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారని, కానీ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేయడం, విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు విడుదల చేసి పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ గూండాగిరికి భయపడేది లేదు..

### మీ ప్రవర్తన ఇలాగే ఉంటే భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కూడా గల్లంతు: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ గూండాగిరికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడేది లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై స్పందించారు. కోట్లాది రూపాయిలు కొల్లగొట్టిన బిఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలోనే ఉన్నాం లేదా మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమతో మాట్లాడుతున్నారు. వారి అవినీతి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారు.

అయినా ఇంకా అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ ఈ ప్రభుత్వంపై గుడ్డకాల్చి వేసినట్లు మాట్లాడుతున్నారు. గత పదేళ్లలో వారు అంటించుకున్నబురదను ఇప్పటి ప్రభుత్వానికి లేదా మంత్రులకు అంటించాలని చూస్తున్నారు. ఐదేళ్ల పాలనకు ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిస్తే మతి భ్రమించి రెండున్నరేళ్లకే గద్దె దిగమని డిమాండ్ చేయడం హాస్యాస్పదం. ఈ రెండున్నర సంవత్సరాలలో ఏం జరిగిందో ఎలాంటి తీర్పులు వచ్చాయో రాష్ట్రప్రజలకు, దేశానికి తెలుసు.

ఏ శాఖ అయినా సరే పిలిచిన టెండర్ మొత్తం కంటే మూడు నాలుగు రెట్లు అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శనం. ఇలాగే వారి ప్రవర్తన కొనసాగితే రానున్న కాలంలో వారికి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. మీ సవాల్‌ను స్వీకరించి మా మంత్రులు వస్తే మీరు రాకుండా పరారయ్యారు.

మా మంత్రులు అక్కడే గంట వరకూ వేచి చూసి మీడియాతో మాట్లాడి వచ్చారు. అసెంబ్లీ లో కూడా మీరు ఏం మాట్లాడతారో మాకు తెలుసు. దానికి కూడా తేదీని ఖరారు చేస్తాం.. అని పొంగులేటి అన్నారు.

# తెలంగాణ వేదపండితులకే ఆలయాల్లో అవకాశం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త :** తెలంగాణ వేదపండితులకు మాత్రమే దేవాలయాల్లో పూజారులుగా అవకాశం కల్పిస్తామని ప్రాంతీయే తరులకు ఎలాంటి అవకాశాలు ఇవ్వమని దేవాదాయశాఖ సిఎంఇ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, బాసర,యాదాద్రి దేవాలయాల్లో ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించామనే ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని తెలిపారు. వేదపండితులు తెలంగాణ వారు మాత్రమే నియామకాల్లో దరఖాస్తు చేసుకొనేలా నిబంధనలు మార్పుచేశామని తెలిపారు. తెలంగాణ ప్రాంత వేదపండితుల దరఖాస్తులకు మాత్రమే అనుమతి లభిస్తోందని సిఇఇ ఎంఎంరావ్ తెలిపారు. వేదపండితుల సంక్షేమంకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# కెటిఆర్‌ను కలిసిన పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 2:** రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగ ఖాళీలు ఉంటే కేవలం 5000 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తుందని పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గురువారం పలువురు అభ్యర్థులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి కేటీఆర్‌ను కలిసారు. పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ కోసం రెండున్నరేళ్లుగా తాము కోచింగ్ తీసుకుని సిద్ధమైతే ప్రభుత్వం తూతూ మంత్రంగా నోటిఫికేషన్ వేసి చేతులు దులుపుకునే కుట్ర చేస్తుందని కేటీఆర్ దృష్టికి తెచ్చారు. నిరుద్యోగుల నిరసనలతో అశోక్ నగర్ చిక్కడపల్లి తో పాటు దిల్‌సుఖ్‌నగర్ రోజురోజు రగిలిపోతుందని, ప్రభుత్వం నిరుద్యోగులను ఉక్కుపాదంతో అణచివేస్తుందని మండిపడ్డారు.

నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఓసారి మీరు కూడా దిల్‌సుఖ్‌నగర్‌కు రావాలని కోరారు. ఈ రెండున్నరేళ్లలో నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నామని, తప్పకుండా దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తొలి ఏడాదే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేంద్రం మెడలు వంచి కేసీఆర్ 95 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన 65 వేల ఉద్యోగాలను కూడా నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకునే నీచానికి ఈ ముఖ్యమంత్రి ఒడికట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 20వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రేవంత్‌రెడ్డిని ఎదుర్కోలేక అసెంబ్లీకి ముఖం చాటేసిన కెసిఆర్

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డిని ఎదుర్కోవడం చేత గాకనే కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారనీ, హరీష్, కెటిఆర్‌లతో రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షనేత పరిస్థితి కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లు ఉందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు.ప్రతిపక్ష నేత అసెంబ్లీ చర్చలకు రావాలని కోరేందుకు తాను స్వయంగా కెసిఆర్‌కు ఫోన్ చేశానని, అయితే ఆయన తన ఫోన్ కాల్ కు స్పందించలేదని ప్రభుత్వ విప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం అద్దంకి దయాకర్ సిఎల్‌పి కార్యాలయంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం చర్చల కోసం కెసిఆర్‌ను అసెంబ్లీకి రావాలని కోరుతున్నారని, కానీ ప్రతిపక్షనేతగా ఆయన బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు బిఆర్ఎస్ ముఖ్య నేతలు కెటిఆర్, హరీశ్ రావుల, కవితలు కేవలం సైడ్ యాక్టర్లు మాత్రమే అని అభివర్ణించారు.

ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం కొడుకు, అల్లుడు పోటీ పడుతున్నారనీ అన్నారు. వీళ్ల మాకు లెక్కే కాదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బిజెపితో బేరసారాలను పెంచుకోవడం కోసమే కెటిఆర్, హరీశ్ రావు ప్రయత్నాలు చేస్తున్నారనీ ఆరోపించారు. 70 సీట్లు మీకు 30 మాకు ఇవ్వాలని బిఆర్ఎస్ నాయకులు బిజెపిని బతిమాలు కుంటున్నారు. కెసిఆర్ ప్రతిపక్ష నాయకుడు కాకపోతే ఆయన ఊసు కూడా ఎత్తే వాళ్లం కాదు. తెలంగాణ చరిత్రలో హీనుడుగా మిగిలిపోకుండా కెసిఆర్ బయటకు రావాలి. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ప్రజలు ఇచ్చిన స్థాయి అని అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వంపై విషప్రచారం చేయడానికి చేసే విన్యాసాలకు కల్వకుంట్ల కుటుంబానికి ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువే అన్నారు.

# అప్పులు చేయలేదని కెసిఆర్ చెబితే రాజీనామాకు సిద్ధం



గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

### చర్చకు బావ ఓచోట.. బామ్మర్ది మరోచోట ఎందుకు, ఇద్దరు రండి: మంత్రి జూపల్లి కృష్ణారావు

### ప్రజలతో ముఖాముఖిలో మంత్రి జూపల్లికి 60 మంది వినతులు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏడు లక్షల రూపాయల అప్పు చేసిందని ఆ అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అబ్కారీ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

గాంధీభవన్‌లో గురువారం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని 60మంది నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కోసమే 74వేల కోట్లరూపాయలు అప్పులు చేశారనీ నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాను తాము అప్పులు చేయలేదని కెసిఆర్ చెప్పాలి నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసందుకు సిద్దంగా ఉన్నాను. కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో అప్పులు చేసి కట్టిన ప్రాజెక్టు వ్యయం తిరిగి బ్యాంకుకు రైతుల నుంచి వసూలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు.

ఒక్కోరైతు నుంచి రూ.20లక్షలు వసూలు చేస్తారా? అని అడిగారు. మేం చేసిన ఆరోపణలపై కెసిఆర్ ఎందుకు స్పందించడంలేదు . హారీష్‌రావు కెటిఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు నేను స్పందిస్తే ప్రతిస్పందనగా హారీష్‌రావు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు వస్తానన్నారు.

అందుకే చెబుతున్నాను బావ ఒక చోట బామ్మర్ది మరోచోట మాట్లాడటంఎందుకు ఇద్దరు కలిసి గన్‌పార్క్‌కు రండి మీ ఇద్దరికి ఒకెసారి అక్కడే సమాధానం ఇస్తాను అని అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ చేసిన అప్పులపై కెసిఆర్ స్వయంగా ప్రజలకు చెప్పాలనీ గతప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు ఆరువేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి ఆవేదన చెందారు.

# నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తీసుకు రావాలని ఉపాధ్యాయఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమల్లోకి తేవాలని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కోరారు. నూతనంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజును సచివాలయంలో కలిసిన ఎమ్మెల్సీ సీఎస్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నూతన హెల్త్ స్కీమ్ ప్రారంభించి రెండు మాసాలు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల వేతనం నుండి మినహాయింపులు జరిగినప్పటికీ హెల్త్ కార్డులు మంజూరు చేయకపోవడంతో.. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఉద్యోగ విరమణ చెందిన సీపీఎస్ ఉద్యోగుల మూలవేతనంపై నిర్ణయం, భార్యాభర్తలు ఇద్దరివద్ద మినహాయించిన మొత్తాన్ని వెంటనే ఒకరికి తిరిగి చెల్లింపు జరపాలని కోరారు. ఈ స్కీమ్‌లో అన్ని యాజమాన్యాల, గురుకుల ఉపాధ్యాయులతోపాటు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ ట్రస్టుకి సంబంధించిన కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి వెంటనే స్కీమ్‌ను అమలుపరచాలని కోరారు.

అంతేకాకుండా ఈ స్కీమ్‌ను ప్రైవేటు యాజమాన్యాలలోని ఉద్యోగ, అధ్యాపకులకు కూడా వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సీఎస్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సీఎస్‌ను కలిసినవారిలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, పిఎంటిపి రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో సతీష్, అంజీ తదితరులు

# ఫీజుల బకాయిల కోసం '8న సత్యాగ్రహ దీక్ష'

### 300 కోట్లు కాదు 8 వేల కోట్లు చెల్లించాలి

### చెల్లించే దాకా ఉద్యమాలు కొనసాగుతాయి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది బిసి, ఓబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని, పాత విధానం కొనసాగించాలని, జివో నెంబరు 9ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న ఇందిరాపార్కు వద్ద తాను 'సత్యగ్రహ దీక్ష' చేపడుతున్నానని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. తనతో పాటు వేలాది విద్యార్థులు, 18 బిసి సంఘాలు పాల్గొంటాయని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజుల రీయంబర్స్‌మెంట్ కోసం 8 వేల కోట్లు కేటాయించవలసి ఉండగా ప్రభుత్వం కేవలం మొక్కుబడిగా బుధవారం 300 కోట్లు విడుదల చేసి చేసిందని, ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. మొత్తం బకాయిలను చెల్లించాలని, చెల్లించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నేనని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు పగిళ్ల సతీస్, జిల్లపల్లి అంజీ, మోదరాందేవ్, జి.కృష్ణయాదవ్, నిఖిల్‌పటేల్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# శివకాశి బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

## 20 మందికిపైగా మంటల్లో చిక్కుకున్న కార్మికులు

**శివకాశి, జులై 2:** తమిళనాడులోని శివకాశి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం కోపై నాయకన్‌పట్టి సమీపంలోని గురులక్ష్మి బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. పోలీసులు తెలిపిన ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒక మహిళా కార్మికురాలికి 90 శాతం వరకు కాలిన గాయాలయ్యాయి. 20 మందికి పైగా కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. గాయపడ్డ ఇద్దరినీ హుటాహుటిన దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఫ్యాక్టరీ లోపల ఉన్న బాణసంచా నిరంతరాయంగా పేలుతూ, చుట్టుపక్కల అంతా దట్టమైన పొగ కమ్మేయడంతో సహాయక చర్యలు చేపట్టడం చాలా కష్టంగా మారింది. పేలుడు ధాటికి బాణసంచా కేంద్రానికి చెందిన నాలుగు షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

# సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జిలు

## అక్రమాల్లో కొట్టుమిట్టాడుతున్న సొసైటీలు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా సహకార సంఘాలకు ప్రత్యామ్నాయ నాన్ అఫీషియల్ పర్సన్‌ఇన్‌చార్జ్ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో చట్ట ప్రకారం ఈ కమిటీలను ఆరు నెలలపాటు/ ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు/ తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందన్నారు. సహకార సంఘాల రిజిస్ట్రార్ ఆయా సహకార సంఘాల పనితీరుపై సమగ్ర పరిశీలన నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా, సంఘాల్లో రుణాల వసూళ్లలో తీవ్ర జాప్యం, ఎగవేతదారుల (డిఫాల్టర్ల) జాబితా తయారు చేయకపోవడం, బకాయిల వసూళ్ల కోసం చర్యలు చేపట్టకపోవడం, ఆడిట్ అభ్యంతరాలను సరిదిద్దకపోవడం, నిర్వహణ కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరుకాకపోవడం, పరిపాలనా లోపాలు, సహకార సంఘాల ప్రధాన లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత కమిటీలు కొనసాగితే సహకార రుణ వ్యవస్థ లక్ష్యాల అమలు దెబ్బతింటుందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చిందని చెప్పారు. ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో కొనసాగుతోంది. దీంతో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాని పరిస్థితి నెలకొన్నందున, రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ తదితర వాటికి అంతరాయం లేకుండా కొనసాగేందుకు పర్సన్ ఇన్, చార్జ్ కమిటీల నియామకం అవసరమని భావించినట్లు వెల్లడించారు. కాగా రైతు భరోసా పథకం కింద మూడో రోజు గురువారం 3 నుండి 4 ఎకరాలకు వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.1,330.32 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. ఈ విడతలో రాష్ట్రంలో 6.39 లక్షల మంది రైతులు, 22.17 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని పేర్కొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమం

## పవర్ ఎంప్లాయీస్ జెఎసి డిమాండ్

**హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కలగజేసుకొని పరిష్కరించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం ఖైరతాబాద్‌లోని ఇంజనీర్స్ ఆడిటోరియంలో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర జేఏసీతో పాటు, జిల్లా జేఏసీలు, డివిజన్ జేఏసీలు సమస్యల సాధనకై ఉద్యమించేందుకు సమాయత్తం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు గతనెల 18న జేఏసీ తరఫున రిప్రెజేషన్ ఇచ్చి జూన్ 30లోపు సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

## రైతుల ఖరీఫ్ కొనుగోళ్ల కోసం

# తెలంగాణ మిషన్ కె100

## వరి సేకరణ, నిధులు, రవాణా, నిల్వలే లక్ష్యం

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త :** ఖరీఫ్ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలుగ కుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుండే పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2026-27 మార్కెటింగ్ సీజన్‌కు ముందు రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు, సేకరణ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, లాజిస్టికల్, నిల్వ, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక "మిషన్ కె100"ను ప్రారంభించింది. ఖరీఫ్ సేకరణ సీజన్‌కు ముందు రవాణా, ఆర్థికపరమైన అడ్డంకులను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అధికార వర్గాలు గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం, సేకరణ కేంద్రాలకు కొత్త పంట రాకముందే సేకరణ వ్యవస్థ పూర్తిగా సిద్ధంగా ఉండేలా చూస్తూ, ధాన్యం నిల్వ, రవాణా మరియు ఆర్థిక నిర్వహణను క్రమబద్ధీకరించడానికి మిషన్ కె100 రూపొందించబడింది. గత ఖరీఫ్, రబీ సీజన్లలో వరి ధాన్యం సేకరణలో ఎదురైన అడ్డంకులు, సమస్యలు పునరావృతం కాకుండా వాటిని నివారించడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ), రాష్ట్ర ప్రభుత్వం మధ్య సమన్వయ ప్రయత్నాలను చేపడుతుంది. మిషన్ కె100 యొక్క కీలక దృష్టి కేంద్రీకరణకు సంబంధించి నిల్వ మరియు తరలింపునకు చర్యలు చేపడుతుంది. ఇందుకు అదనపు నిల్వ స్థలాన్ని కేటాయింపు, కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎమ్మార్) డెలివరీని వేగవంతం చేసేలా భారత ఆహార సంస్థతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఆర్థిక అనుమతి విషయంలో రాష్ట్ర కార్యనిర్వహణ మూలధనాన్ని బలోపేతం చేయడానికి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, స్టాక్ క్లియరెన్స్‌కు సంబంధించి ద్రవ్యతను మెరుగుపరచడానికి, గోదాము స్థలాన్ని ఖాళీ చేయడానికి ఇప్పటికే ఉన్న వరి ధాన్యం నిల్వలను వేలం వేయడం వంటి కార్యాచరణను ఈ మిషన్ ద్వారా ప్రభుత్వం అమలు చేయనుంది. అంతేకాకుండా ఆధునీకరణ, లాజిస్టిక్స్ అంశాల్లో అధిక పరిమాణంలో కొనుగోలు చేసే కేంద్రాలను ఆటోమేటెడ్ పరికరాలతో అప్‌గ్రేడ్ చేయడం, ధాన్యం రవాణాను పర్యవేక్షించడానికి రియల్‌టైమ్ వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ (విఎల్‌టిఎస్)ను అమలు చేయనుంది.

# జిఒలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించాలి

## 4 కమిషనరేట్ల అంశాలపై డిజిపి సి.వి.ఆనంద్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై 2:** తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ సి.వి. ఆనంద్ గురువారం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లు పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ, పరిధుల విభజన, పరిపాలనా అవసరాలు తదితర అంశా లపై తమ ప్రతిపాదనలను డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లా డుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు (జీఓలు)కు అనుగుణంగా పోలీస్ స్టేషన్ల పరిధుల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ఆదేశించారు.

మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ డివిజన్లు, న్యాయస్థానాల పరిధులను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్ హద్దులను నిర్ణ యించాలని సూచించారు. భవిష్యత్ పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించాలని తెలిపారు. ఈ ప్రక్రియలో సంబంధిత అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని కొన్ని ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధుల నిర్ణయంపై ప్రత్యేక సూచనలు చేసిన డీజీపీ, పోలీస్ స్టేషన్‌ల పరిధుల మార్పులు, చేర్పుల నిర్ణయం వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు, న్యాయవ్యవస్థకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఆయా ప్రాంతాల భౌగోళిక, పరిపాలనా ప్రత్యేకతలను ప్రతిబింబించే విధంగా పోలీస్ స్టేషన్లకు తగిన పేర్లు నిర్ణయించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పునర్వ్య వస్థీకరణ ద్వారా ప్రజాకేంద్రిత, సమర్థవంతమైన పోలీసింగ్ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని డీజీపీ ఆకాంక్షించారు.



ఈ సమావే శంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతితో పాటు జాయింట్ కమిషనర్లు,ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అప్పుల ఆరోపణలపై కెసిఆర్ ఎందుకు స్పందించరు?

## నా ఆరోపణలు అసత్యమైతే రాజీనామా చేస్తా: జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై2:** 'నేను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా, తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారని, ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా? మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు అని ప్రశ్నించారు. గురువారం ఆయన గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నాం అని జూపల్లి చెప్పారు.అప్పులపై చర్చకు సిద్ధం అని.. సవాల్ కు కట్టుబడి గన్ పార్క్ దగ్గరకు వచ్చానని.. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ఎవరూ రాలేదని మంత్రి జూపల్లి అన్నార. గాంధీభవన్ కు వెళుతున్న సమయంలో.. గన్ పార్క్ దగ్గరకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్నట్లు సమాచారం ఉండటంతో.. నేరుగా గన్ పార్క్ దగ్గరకే వచ్చానని.. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరు వచ్చినా అప్పులపై ఇక్కడే చర్చించుకుందాం అంటూ మంత్రి జూపల్లి సవాల్ విసిరారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అప్పు రూ. 8.21 లక్షల కోట్లు అని, మాజీ మంత్రి కేటీఆర్ తప్పుడు లెక్కలు చెబుతున్నారని, అప్పు రూ. 3 లక్షల 50 వేల కోట్లు మాత్రమే అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన లెక్కలనే నేను చెబుతున్నానని.. కేసీఆర్ చేసిన అప్పులకు లక్షా 80 వేల కోట్ల రూపాయలు వడ్డీనే కడుతున్నామని.. ఇదంతా ప్రజలు పన్నుల ద్వారా కట్టిన డబ్బులతోనే చెల్లిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన ముగిసే నాటికి తెలంగాణ రాష్ట్రంపై అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాము చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా గన్ పార్కు అమరవీరుల స్థూపం సాక్షిగా ఆయన ఈ లెక్కలను మీడియా ముందుంచారు. 2014 జూన్ 2న రాష్ట్ర ఏర్పాటు సమయంలో మొత్తం బకాయిలు రూ.90,161 కోట్లు మాత్రమే ఉండగా, 2023 డిసెంబర్ 1 నాటికి అవి భారీగా పెరిగాయని వివరించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.72,658 కోట్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి అవి రూ.3,89,673 కోట్లకు చేరాయి. ప్రభుత్వ హామీతో ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌పివి) తీసుకుని, ప్రభుత్వం చెల్లించాల్సిన రుణాలు రూ.11,609 కోట్ల నుంచి రూ.1,27,208 కోట్లకు పెరిగాయి.

ఈ రెండు కలిపి ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యతగా ఉన్న అప్పులు రూ.84,268 కోట్ల నుంచి రూ.5,16,881 కోట్లకు చేరినట్లు తెలిపారు. ప్రభుత్వ హామీతో ఎస్‌పీవీలు తీసుకుని, వాటినే చెల్లించే రుణాలు రూ.5,893 కోట్ల నుంచి రూ.95,462 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. కేటీఆర్.. నేను చెప్పిన లెక్కలు తప్పని, కేసీఆర్ తో చెప్పించాలని, నా లెక్కలు తప్పని తేలితే రాజీనామాకు సిద్ధమనే మాటకు కట్టుబడి ఉన్నానని సవాల్ విసిరారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్ష నేతలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన సవాల్ విసిరారు.

# మరో నోటిఫికేషన్ జారీ చేసిన టిజిపిఎస్‌సి

## సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

## 7 నుంచి ఆగస్టు 12 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడం కోసం నోటిఫికేషన్ నంబర్ 03-ఒజి-ఎస్‌డి-2026ను టీజీపీఎస్సీ గురువారం జారీ చేసింది. తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ అర్గానిక్ సర్టిఫికేషన్ అధారిటీలో 19 సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7 నుంచి ఆగస్టు 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 18 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాల వయోపరిమితి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొంది. వేతనం రూ. 51,320 నుంచి రూ. 1,27,310 వరకు ఉంటుందని ప్రకటించింది. అగ్రికల్చర్‌లో డిగ్రీ పొంది ఉండి ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన వారు దరఖాస్తుకి అర్హులుగా ప్రకటించారు. పూర్తి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కమిషన్ ప్రకటనలో పేర్కొంది.

# యుఎస్ హోటల్‌లో అగ్నిప్రమాదం.. గుజరాత్ కుటుంబం మృతి



**వాషింగ్టన్,జులై 2:** అమెరికాలోని ఒక హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక కుటుంబం మొత్తం ఆహుతి అయింది. అక్కడే పనిచేస్తూ నివసిస్తున్న గుజరాత్‌కు చెందిన భార్యాభర్తలు, వారి కుమార్తె మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగి పోయారు. గుజరాత్ లోని ఖేడా జిల్లా నాడియాడ్‌కు చెందిన హితేష్‌భాయ్ సుతార్, ఆయన భార్య హీనాబెన్, 20 ఏళ్ల కుమార్తె ఇషాని రెండేళ్ల కిందట అమెరికాలో స్థిరపడ్డారు. ఒహియోలోని ఎకానో లాడ్జ్‌లో హితేష్‌భాయ్ పనిచేస్తుండటంతో ఆ కుటుంబం అక్కడ నివసిస్తున్నది. కాగా, గురువారం తెల్లవారుజామున ఆ హోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడ నివసిస్తున్న హితేష్‌భాయ్ కుటుంబం మంటలు గమనించి ఆందోళన చెందారు. సహాయం కోసం లాడ్జి ఫ్రంట్ డెస్క్‌కు ఫోన్ చేశారు. తమను కాపాడాలని ప్రాథేయపడ్డారు. హితేష్‌తో మాట్లాడిన వ్యక్తి భద్రత కోసం బాత్‌రూమ్‌లో ఉండాలని, నీటిని ఆన్ చేసి ఉంచమని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత ఎమర్జెన్సీ నంబర్లకు ఫోన్ చేశాడు. మరోవైపు ఫైర్ సిబ్బంది ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. పలు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. బాత్‌రూమ్ లోపల ఉన్న హితేష్‌భాయ్ కుటుంబాన్ని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దట్టంగా కమ్ముకున్న పొగకు ఊపిరాడక ఆ కుటుంబంలోని ముగ్గురు మరణించారు. దట్టంగా కమ్ముకున్న పొగకు ఊపిరాడక ఆ కుటుంబంలోని ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. హితేష్‌భాయ్, అతడి భార్య, కుమార్తె మరణం గురించి గుజరాత్‌లోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



# హనుమంతరావును పరామర్శించిన చిన్నారెడ్డి

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** ప్రభుత్వ సలహాదారులు వి హనుమంత రావుని గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, కరీంనగర్ సిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్‌కుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్, ఏసియన్ ఇన్‌స్టిటిట్యూట్ ఆఫ్ నెఫ్రాలోజి యూనిట్ ఆస్పత్రిలో పరామర్శించినారు. మూత్రపిండాల సమస్యతో జూన్25న ఆసుపత్రిలో చికిత్సకోసం ఇన్‌పేషంట్‌గా చేరినారు. ఆయనకు మూత్రపిండాలలో రాళ్ళు ఉండటంతో సోమవారం శస్త్రచికిత్స చేశారు. జూన్ చివరి వారం తిరుపతి తిరుమలకు దైవదర్శనం వెళ్ళి వచ్చిన విహెచ్ అదేరోజు తీవ్రఅస్వస్థతకు గురైనారు. ఆయనకు రాళ్ళు ఉండటంతో మూత్ర సమస్యతలెత్తింది. దీనితోఆయనకు శస్త్ర చికిత్స చేశారు. విహెచ్‌ను బిసి సంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్రబ్రాహ్మణ సంఘం కార్పొరేషన చైర్మన్ శ్రీనివాస్ రాజు, బీసీ కమిషన్ నెంబర్ రాపోలు జయప్రకాష్‌లు కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షను వ్యక్తంచేశారు. విహెచ్‌ను ఐసియు నుంచి ఆసుపత్రి సాధారణ రూంలోకి మార్చిన తరువాత గత రెండు రోజులుగా పరామర్శించడానికి అనేక మంది వెళ్ళుతున్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర సలహాదారులు కే కేశవరావు, రాష్ట్ర బిసికమిషన్ చైర్మన్ జి నిరంజన్, అంబర్పేట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రోహిన్ రెడ్డి, బిసి కమిషన్ మెంబర్ సురేందర్ మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ ,ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు మొత్త రోహిత్ ముదిరాజ్ , బోయ వాల్మీకి వైస్ చైర్మన్ బోయ నగేష్ , మాజీ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు శ్రీధర్ రామలింగం యాదవ్ టిడిపి రాష్ట్ర నాయకులు అరవింద్ కుమార్ గౌడ్ గుజ్జ కృష్ణ పరామర్శించారు.

# జెబిఎం ఎలక్ట్రిక్ బస్సులు తాత్కాలికంగా నిలిపివేత

## ప్రయాణికుల భద్రతే ధ్యేయం

## బస్‌భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు

**హైదరాబాద్, జులై 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జెబిఎం ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. ప్రయాణీకుల భద్రతే ధ్యేయంగా నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ ప్రకటించింది. నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నడుస్తున్న జె.బి.ఎమ్ ఎలక్ట్రిక్ బస్సులలో (జెబిఎం ఈ-బస్) వరుసగా హై వోల్టేజ్ బ్యాటరీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణీకుల భద్రతను దృష్ట్యా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల పరిధిలో తిరిగే జె.బి.ఎమ్ సంస్థకు చెందిన ఎలక్ట్రిక్ బస్సుల కార్యకలాపాలను తాత్కాలిక నిలిపివేతకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 21వ తేదీ ఉదయం 8 గంటలకు కరీంనగర్ సమీపంలో అలుగునూర్ వద్ద జరిగిన బస్సు అగ్ని ప్రమాదముపై పూర్తి నివేదిక రాకమునుపే మరొక సంఘటన జరగడం వలన ప్రయాణీకులు, సిబ్బంది ప్రజల ప్రాణాల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి, తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. తెలంగాణ ఆర్టీసీ జెబీఎం సంస్థను ప్రమాదాల విశ్లేషణ నివేదిక, శాశ్వత నివారణ చర్యలు, బ్యాటరీ ఫిట్నెస్ సర్టిఫికేషన్, హైదరాబాద్ బస్సు భవన్‌లో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై స్పందించి తగు నివేదిక సమర్పించవలసిందిగా కోరడం జరిగింది. ఆర్టీసీ విజ్ఞాపనపై స్పందించిన జె.బి.ఎమ్ సంస్థపైన పేర్కొన్న పలు అంశాలపై తక్షణమే నివేదికలు, సిద్ధం చేసేందుకై వారి టెక్నికల్ టీం చైనా నుంచి బ్యాటరీ నిపుణుల బృందం కూడా ప్రమాద పరిస్థితులు వాటికి దారి తీసిన సందర్భాలను పరిశీలించి పలు నివారణ చర్యలపై నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి.

భద్రతా ప్రమాణాలు, సంబంధిత నివేదికలను ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, సంస్థ నిర్దేశించిన అన్ని షరతులను జె.బి.ఎమ్. యాజమాన్యం పూర్తిగా పాటించినట్లు సంతృప్తి చెందిన పిదప, వారి టెక్నికల్ బృందం వెహికిల్ ఫిట్ ఫర్ ఆపరేషన్ అని ధృవీకరించిన వాహనాల పునరుద్ధరణపై తుది నిర్ణయం తీసుకోబడుతుంది. ప్రజారవాణాలో భద్రత విషయంలో టీజీఎస్ ఆర్టీసీ ఎటువంటి రాజీ పడదని, ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది.

# రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై 2:** ఉత్తర తెలంగాణలోని రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ఎకరం చొప్పున స్థలాలను కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సచివాలయం వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు ఈ-కేబినెట్ కొనసాగింది.

# వర్షాకాల సన్నద్ధత, విపత్తు నిర్వహణకు 'జాయింట్ యాక్షన్ టీమ్స్'

## 24 గంటలు మానిటరింగ్.. సమన్వయ కేంద్రంగా టిజిఐసిసిసి

## క్యూర్ పరిధిలో 913 వాటర్ లాగింగ్ పాయింట్స్

**హైదరాబాద్, జులై 2,ప్రభాతవార్త:** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వర్షాకాల సన్నద్ధత, విపత్తుల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. 24/7 రియల్ టైం మానిటరింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. అందుకోసం జాయింట్ యాక్షన్ టీమ్స్(జేఏటీ)లను ఏర్పాటు చేసింది. ఈ టీమ్స్ కోసం తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ)లో గురువారం ప్రభుత్వం ఓరింటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సదస్సులో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీస్ కమీషనరేట్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, హైడ్రా, జలమండలి, టీజీఎస్పీడీసీఎల్, అగ్నిమాపక శాఖ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఐఎండీ, వైద్యారోగ్య శాఖ, నీటిపారుదల శాఖ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ ప్లానింగ్ డవలప్ మెంట్ సొసైటీ(టీజీపీడీఎస్), హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్ల అధికారులు, సిబ్బందితో పాటు అత్యవసర స్పందన చర్యలలో పాలుపంచుకునే ఇతర భాగస్వామ్య విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**913వాటర్ లాగింగ్ పాయింట్లు..**

వర్షాకాల అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో కూడిన చర్యల కోసం ఒక సమగ్ర మల్టీఏజెన్సీ రెస్పాన్స్ మెకానిజంగా జాయింట్ యాక్షన్ టీమ్స్ (జేఏటీ) ఏర్పాటు చేశారు. క్యూర్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ ఏరియాల్లో 913 వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నట్టు గుర్తించారు. హైదరాబాద్ (523), సైబరాబాద్ (202), మల్కాజ్‌గిరి (188) ఉన్నాయి. వీటిలో 258 ప్రధాన, 290 మధ్యస్థ, 365 చిన్నపాటి సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయి. సకాలంలో అప్రమత్తం చేయడానికి, ప్రాధాన్యతక్రమంలో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యూర్ పరిధిలో విపత్తులు, వర్షాకాల యాక్షన్ ప్లాన్ లో భాగంగానే చర్యలు తీసుకోవడానికి టీజీఐసీసీసీ సమన్వయ కేంద్రంగా వ్యవహరించనుంది. ఈ ప్రక్రియలో 24 7 రియల్ టైం మానిటరింగ్ తోపాటు సమాచార మార్పిడి, అంతర్గత శాఖలను సమన్వయం చేయనుంది.

# బందిపోటు ముఠాను అరెస్టు చేసిన సత్తుపల్లి పోలీసులు

## 12 మంది అరెస్టు, ఇద్దరు పరార్

## వారి నుంచి 17 లక్షల 60, వేలు నగదు, మూడు కార్లు 16 సెల్ ఫోన్లు స్వాధీనం

## ముఠాలో బెటాలియన్ ఆర్ఎస్ఐ, కానిస్టేబుల్



**సత్తుపల్లి జులై 2, ప్రభాతవార్త:** డబ్బును ఈజీగా సంపాదించాలని ఇద్దరు పోలీసులతో కలిసి, నకిలీ పోలీసుల అవతారం ఎత్తి ఒక ముఠాగా ఏర్పడి కడప జిల్లా పొద్దుటూరు వాసిని మోసం చేసిన కేసులో సత్తుపల్లి పోలీసులకు డేకాయిటి ముఠా చిక్కింది. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో గురువారం ఏసీపి వసుంధర యాదవ్ ఐపిఎస్, సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కడప జిల్లా, పొద్దుటూరు గ్రామానికి చెందిన కుర్ర గంగాధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు గత నెల 26వ తేదీన ఇట్టి ముఠాపై కేసు నమోదు అయింది. అప్పటినుంచి ముఠాపై నిఘ ఏర్పాటు చేయగా బుధవారం ఉదయం గంగారం సమీపంలో ఉన్నట్టు తెలియటంతో పోలీసులు వెళ్లి అట్టి ముఠాను అదుపులోకి తీసుకొని విచారించగా వివరాలు తెలిసాయి. లక్ష రూపాయలకే నాలుగు లక్షలు అంటే ఒకటికి నాలుగు రెట్లు ఇస్తామని నా దగ్గర రెండు కోట్ల రూపాయలు బ్లాక్ మనీ ఉందని, దాన్ని వైట్ మనీ గా మార్చుకోవాలని లేకపోతే ఇన్కమ్ టాక్స్ కట్టాల్సి వస్తుందని మోసపు మాటలు తో ఓ వ్యక్తి ఫోన్ ద్వారా రకరకాల పేర్లతో మాట్లాడి నమ్మించి ఎదుటి వారి దగ్గర డబ్బుని పొందటానికి ప్లాన్ చేసి వీరు చెప్పిన ప్రదేశానికి వచ్చి అట్టి డబ్బు నకిలీ కరెన్సీ రూపేనా నమ్మబలికిన వ్యక్తికి వీరిలోని ముఠాలో ఒక వ్యక్తి అందించి నమ్మిన వ్యక్తి నుంచి అసలు కరెన్సీ తీసుకొని లెక్క వేసే సమయంలో వీరిలో ఉన్న ముఠా లోని మండలంలోని గంగారం బెటాలియన్ కి చెందిన ఒక ఆర్ఎస్ఐ, ఒక కానిస్టేబుల్, తోపాటు కొందరు నకిలీ పోలీసు డ్రస్సులతో వెళ్లి బెదరగొట్టి అట్టి అసలు డబ్బుని దోచుకుని వెళ్ళటం జరుగుతుంది. ఇట్టి ముఠాలో గంగారం బెటాలియన్ కి చెందిన ఆర్.ఎస్.ఐ, బెరా కేశవరావు, కానిస్టేబుల్ ముల్ల గిరి వర్ధన్, కూడా ఈ ముఠాలో కొనసాగుతూ ఉండటం విశేషం. డెకాయిట్ ముఠాని 12 మందిని పట్టుకోగా మరో ఇద్దరూ పరారయ్యారు. వారి వద్ద నుంచి 17 లక్షల అరవై వేల రూపాయల నగదు, మూడు కార్లు, 16 సెల్ ఫోన్లు, పోలీస్ డ్రెస్ లు, హ్యాండ్ కప్స్, పోలీసులు స్వాధీనం చేసుకొని 12 మందిని రిమాండ్ కు తరలించగా మరో ఇద్దరు పరార్ లో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ వసుంధర యాదవ్ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు వీరప్రసాద్, ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

## జగన్‌వి అనాలోచిత వ్యాఖ్యలు



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతి పై అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. అమరావతి రాజధాని అభివృద్ధిని చూసి ఓర్వ లేని స్థితికి దిగజారరన్నారు. మూడు రాజధానుల పేరుతో ఎన్నికలకు వెళ్లి వైసిపికి 11 సీట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు మావిగన్ అనే పిచ్చివేషంతో ఎన్నికలకు వెళ్తే సున్నాకే పరిమితం అవుతారంటూ వ్యాఖ్యానించారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనే లక్ష్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఒక్క ఇటుక కూడా పెట్టకుండా రూ.450 కోట్లు ఖర్చుపెట్టి తన కోసం ప్యాలెస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చూసి తట్టుకోలేని స్థితిలో జగన్ విషం కక్కారని మంత్రి వ్యాఖ్యానించారు. అమరావతిపై తనకు ఎటువంటి వ్యతిరేకతలేదని, 33వేల ఎకరాలు కావాలని చెప్పిన వ్యక్తి జగన్ అని గుర్తుచేశారు. అమరావతిలోనే ఇల్లు కట్టుకున్నానని ఆనాడు ప్రజల్ని నమ్మించారన్నారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పి వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. జగన్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ఆయన అడ్డుకోలేరని మంత్రి మండిపడ్డారు.

## రాజధానిపై జగన్‌ది పూటకో మాట



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధానిపై పూటకో మాట మారుస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా ముందుకు తీసుకెళ్లాలా అని చూస్తుంటే, జగన్ మాత్రం అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ముందుకెళ్తుంటే, జగన్ కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. సైకో ఆలోచనలు కలిగిన వ్యక్తి ఏ విధంగా ఉంటాడనే దానికి జగన్ మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. జగన్ కాసేపు అమరావతే రాజధాని అని అంటారని.. మరికాసేపులేదు, మా స్టాండ్ మావిగన్ అని మాట్లాడతారని ఎద్దేవా చేశారు. ఎవరైనా పచ్చగా ఉంటే చూడలేని మనస్తత్వం ఉన్నవాడినే సైకో అంటారని పేర్కొన్నారు. ఏం మాట్లాడుతారో, ఏం చేస్తారో తెలియని పరిస్థితి జగన్‌దని ఎద్దేవా చేశారు. జగన్ మొన్న తన మనుషులను పంపించి రాజధానిలో సిఆర్‌డిఎ పరిరక్షణ కమిటీ పేరుతో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. దీంతో అక్కడి రైతులు, ప్రజలు వారిని తరిమి కొట్టారని ఎద్దేవా చేశారు.ఇ ంకా ఈ దొంగ డ్రామాలు, నాటకాలు ఆడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలా? అని జగన్‌ని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించాలని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలందరూ పరిస్థితిని దయచేసి గమనించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు



**సచివాలయం, జులై 2 ప్రభాతవార్త:** "ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పుడు మాటలు వినే మూడ్‌లో లేరు, కళ్లముందు ఫలితాలను చూసే దశకు వచ్చారు. కాబట్టే ప్రజలు మిమ్మల్ని 151సీట్ల నుండి కేవలం 11స్థానాలకే పరిమితం చేసి ఇంటికి సాగనంపారు" అని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, జగన్ అసెంబ్లీకి రారు, ప్రజల్లోకి రారు, అడిగిన దానికి జవాబు చెప్పారు, ఒక పక్క ఓట్లేసిన ప్రజలకు సొంత కార్యకర్తలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి అని ఎద్దేవా చేశారు "గత ఐదేళ్ళలో మూడు రాజధానులు అనే చిత్ర విచిత్ర వేషాలతో ఈ రాష్ట్రంలోని స్కూల్ పిల్లల్లో సైతం రాజధాని ఏదో తెలియని తీవ్ర అయోమయాన్ని సృష్టించారు. ఆ మూడు రాజధానుల్లో కనీసం ఒక్క ఇటుకైన పెట్టారా? ఒక దోసెడు ఇసుకైనా వేశారా? లేదు. కానీ ప్రజాధనం రూ.500 కోట్లు తగలేసి రిషికొండకు గుండు గీకి ఒక లగ్జరీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. మీ ప్యాలెస్‌ల పిచ్చి రాష్ట్రానికి పెను ప్రమాదమని గ్రహించే ప్రజలు మిమ్మల్ని ఓడించారు" అని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తుందని, ప్రతిపక్షం ఇప్పటికైనా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని మంత్రి హితవు పలికారు.

## అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే పోటీ



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిపై వైసిపి అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మావిగన్ పేరుతో మరో కొత్తనినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్‌ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని, ఆ లక్ష్యసాధన కోసం సిఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని వివరించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ హంగులు

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఉన్నత స్థాయి సమీక్ష

**నెల్లూరు (వైద్యం), జులై 2, ప్రభాతవార్త:** నెల్లూరు ప్రభుత్వ స్కూళ్లకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న విద్యా విధానంతో కార్పొరేట్ హంగులు కనిపిస్తున్నాయని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాష్ట్ర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గురువారం ఆర్.ఎస్.ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పొంగూరు శరణిలతో కలిసి ఉపాధ్యాయులతో పాల్గొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతర సమీక్షలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలోని 15 పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్నట్లు మంత్రి తెలిపారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై మూతపడి ఉన్న వి.ఆర్ స్కూల్‌ను, కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీ మేరకు వెంటనే పునఃప్రారంభించామని తెలిపారు. ఈ స్కూల్లో కేవలం 1,000 సీట్లు ఉంటే, రికార్డు స్థాయిలో 2,000 మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ల కోసం పోటీ పడటం ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో నెల్లూరు నగరంలోని మరో 15 పాఠశాలలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో డెవలప్ చేయాలని నిర్ణయించామని, దాతలు దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల ఆర్థిక సహాయంతో నూతన భవనాలను నిర్మించామన్నారు. మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి పొంగూరు శరణి నేతృత్వంలో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు, స్టడీ మెటీరియల్, క్వశ్చన్ పేపర్లను ఉచితంగా అందజేస్తూ అండగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, కష్టపడే విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పలుగు చేత పట్టిన మంత్రి శ్రీనివాస్

- జిన్నాంలో విబి జి రామ్‌జి పనులు ప్రారంభం



**విజయనగరం, జులై 2 ప్రభాతవార్త:** విజయనగరం మండలం జిన్నాం గ్రామంలో విబి జి రామ్‌జి పథకం పనుల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పలుగు చేత పట్టారు. జిన్నాం గ్రామంలో తామర చెరువులో విబి జి రాంజీ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విబి జి రామ్‌జి పథకంలో కేంద్ర ప్రభుత్వం వంద రోజుల నుంచి అదనంగా 25 రోజులు పాటు పెంచడంతో పాటు నూతనంగా తెచ్చిన పాలసీలు పేద ప్రజలకు రైతులకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టి వేతనాలు పొందాలని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ పథకంలో గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో దేశంలో మూడవ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. వేసవి సమయంలో పనులు లేనీ కారణంగా మన జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, ఉపాధి హామీ పనులు అటువంటి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. పేద ప్రజల ఉన్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివి గోపాలరాజు, మక్కువ శ్రీధర్, బంగారు నాయుడు, చిన్నం నాయుడు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకం పేదలకు వరం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**గాలివీడు. జులై 2 ప్రభాతవార్త:** ఎంజిఎన్‌ఆరఈజిఎస్ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న విబిజి రాంజీ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని రాష్ట్ర రవాణా యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. పేద ప్రజలకు ఉపాధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఆయన గురు వారం మండలంలోని అరవిడి పంచాయితీలో కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ లాంటి ప్రాంతాలలోని ప్రజలకు విబి జి రాంజీ పథకం ఎం తో ఉపయోగకరంగా ఉంటాదని తెలిపారు. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు కూలీలకు ఆర్థిక భద్రతనుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, నీటి భద్రత, జీవనోపాధి వనరులు, ఆస్తుల సృష్టి ద్వారా గ్రామీణ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పురం హేమ్‌కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు మందపాటి రవీంద్రబాబు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

# సాక్ష్యాల నాశనానికి కుట్ర

- రికార్డులను తారుమారు చేస్తూ అడ్డంగా దొరికిపోయిన కార్యదర్శి
- పైడిభీమవరం పంచాయతీ నిధుల దుర్వినియోగం సర్వత్రా విమర్శలు

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 2 ప్రభాతవార్త:** ప్రజాధనానికి రక్షణగా నిలవాల్సిన అధికార యంత్రాంగమే అవినీతి ఊబిలో కూరుకుపోతే ఎలా ఉంటుందో చెప్పడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం, పైడిభీమవరం పంచాయతీ నిధులు గోల్‌మాల్ ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు రూ.7.50కోట్లు సాధారణ నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేగుతుండగా తాజాగా ఈ అవినీతి తిమింగలాలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వేసిన మరో ముఠా వ్యూహం బయటపడింది. బాధ్యులైన అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి పంచాయతీకి సంబంధించిన అధికారిక రికార్డులను పైడిభీమవరం పంచాయతీ కార్యదర్శి ఇంట్లో రహస్యంగా తారుమారు చేస్తున్నట్లు కొన్ని కీలకమైన ఫోటోలు లభించడం స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తిస్తోంది.

**ఉన్నతాధికారుల విచారణకు ముందే రికార్డుల మాయం:** ఈ భారీ కుంభకోణం ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణకు ఆదేశించే అవకాశం ఉందనే ముందస్తు సమాచారంతో అవినీతి సూత్రదారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎలాంటి తీర్మానాలు, ముందస్తు అనుమతులు లేకుండా కేవలం 10నెలల స్వల్ప కాలంలోనే రూ.7.50కోట్లను ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారు. ఇప్పుడు ఆపాపం ఎక్కడ పట్టుబడుతుందో అనే భయంతో రికార్డులను తారుమారు చేస్తూ దొరికిపోవడంతో నిందితుల్లో వణుకు మొదలైంది. ఈ కుంభకోణంలో బోగస్ బిల్లులు, నకిలీ వ్యయాల పేరిట సాగిన దోపిడి వివరాలు చూస్తే సామాన్యుడు సైతం ముక్కున వేలేసుకోవాల్సిందే.

**అడ్వాన్స్‌పేరుతో దోపిడి.. నిబంధలన్నీ బేఖాతరు:** కమీషన్ల కక్కుర్తితో సి.సి రోడ్డు, డ్రైనేజీ పనుల పేరు చెప్పి నిబంధనలను పూర్తిగా గాలి కొదిలేశారు. అసలు పనులు ఏ మేరకు జరిగాయనే కనీస పర్యవేక్షణ లేకుండానే రూ.2.52కోట్లు అడ్వాన్స్ పేమెంట్ల రూపంలో ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి జమైపోవడం వెనుక కొందరి హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రజలు ఆవేదన:** పరిశ్రమల నుంచి ఏటా రూ.కోట్లు రూపాయలు పన్నుల రూపంలో నిధులు వస్తున్నప్పటికీ పంచాయతీలో కనీస మౌళిక సదుపాయాలు కల్పించక పోవడం దారణం. రూ.కోట్లు నిధులను కొందరు స్వార్థపరుల జేబుల్లోకి వెళ్లడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ విచారణ చేపట్టాలి: నిధుల గోల్‌మాల్‌పై బహిరంగా విచారణ చేపట్టాలని ఇటు ప్రజలు, అటు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై కేవలం కంటితుడుపు ప్రాథమిక విచారణలతో సరిపెడితే ఊరుకునేది లేదని ప్రజలు, ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి.



## దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళాలు

**ఇంద్రకీలాద్రి, జులై 2 ప్రభాతవార్త:** దుర్గమ్మ భక్తులు గురువారం విరాళాలు సమర్పించారు. నిత్యాన్న దాన పథకమునకు కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన సింగీతం నాగమణి రూ.2లక్షల విరాళమును అందించారు. హైదరాబాద్ కు చెందిన మెరుగు గోపాల్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలసి రూ.1లక్ష విరాళమును అందించారు. విజయవాడకు చెందిన ఉమ్మడిశెట్టి సీతారామయ్య, వెంకటలక్ష్మి దంపతులు పరశురామయ్య పేరు మీద రూ.1లక్ష విరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



## ప్రసవ సమయంలో అత్యవసర చికిత్సపై శిక్షణ



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** గర్భిణుల ప్రసవ సమయంలో అధిక రక్తస్రవం, అధిక రక్తపోటు (బిపి) వల్ల మూర్ఛ వంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గైనకాలజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్)లకు శిక్షణ ఇప్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో స్వస్తి (ఎన్‌జిఒ), ఫెడరేషన్ ఆఫ్ అబెస్ట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఫాగ్సి)ల నుంచి సాంకేతిక సహకారాన్ని తీసుకోవడం ప్రారంభించింది. రాష్ట్రంలో తొలివిడత కింద అనంతపురం, బాపట్ల జిల్లాల్లో పనిచేసే గైనకాలజిస్టులు, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సుల (సుమారు 75 మంది)కు మంగళగిరిలో రెండురోజుల శిక్షణ గురువారంతో ముగిసిందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇంఛార్జి కమిషనర్ చక్రధర్ బాబు వెల్లడించారు. దశలవారీగా మిగిలిన జిల్లాలోని వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు.

## సమష్టి కృషితోనే పురస్కారం

- అభినందన సభలో ఆవుల చంద్రశేఖర్



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టికృషితోనే తనకు అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఎపి ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ అవార్డును ఇటీవల అందుకుని గురువారం తొలిసారిగా కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అనంతరం సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్తంగా సిఈఓ చంద్రశేఖర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, తన విజయం వెనక ఎందరో కృషి దాగి వుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధవిశ్వవిద్యాలయాలు, పరిశోధనాశాలలు, మార్కెటింగ్ సంస్థల సహకారం మరువలేనిదన్నారు. ప్రజారోగ్యం కోసం భారతీయ సనాతన వైద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి తన అవార్డు అంకితమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ ప్రదీప్, బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆ కాలేజీల గుర్తింపు రద్దు చేయండి

- పిడిఎస్‌యు నేతలు ఎస్.ఎండి రఫీ, కిరణ్ కుమార్



**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం ఐఐటి జెఇఇ మెయిన్స్, నీట్ పుస్తకాల పేర్లతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, తక్షణమే ఇంటర్మీడియట్ అధికారులు గుర్తింపు రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేటు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు అక్రమంగా పుస్తకాల పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వేల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఎంసెట్, నీట్, జెఇఇలకు అనుమతి లేకున్నా ఐఐటి, జెఇఇ మెయిన్స్, నీట్ అంటూ మోసం చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. ఇంటర్ బోర్డు నిబంధనలుకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలను గుర్తించి గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేని ఇరుకు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు, హాస్టళ్లు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని, ఇలాంటి గుర్తింపు లేని విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దు, రాష్ట్ర మావో, వేణు పిడిఎస్‌యు నాయకులు నవీన్, రూపా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తం

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- క్రాంతికుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో పోలీసు వ్యవస్ధ అస్తవ్యస్తంగా మారిందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి ఆరోపించారు. పోలీసులను ప్రభుత్వ నేతలు స్వార్ధప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆక్షేపించారు. విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న టాక్సీ డ్రైవర్ క్రాంతి కుమార్ కుటుంబాన్ని జగన్మోహన రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా క్రాంతికుమార్ పై ఎలాంటి కేసులు లేవని, పాత కేసులను కోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. గౌరవంగా టాక్సీ నడుపుకుంటూ జీవిస్తున్న వ్యక్తిని రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేశారని ధ్వజమెత్తారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ స్థాయికి పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో భద్రంగా ఉండాల్సిన సిసిటివి



ఫుటేజీని డిలీట్ చేశారని, నిబంధనలకు విరుద్ధంగా ఫుటేజీని ఎలా తొలగిస్తారని జగన్ ప్రశ్నించారు. మరణ వాంగ్మూలం ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎలాంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. క్రాంతికుమార్ కుటుంబానికి వైఎస్సార్సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపరమైన పోరాటానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని జగన్ భరోసా ఇచ్చారు.

## సిహెచ్ చంద్రశేఖర్ అరెస్టు అక్రమం: సిపిఎం

**విజయవాడ, జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా తిరుపతి జిల్లా కోడూరులో ట్రేడ్ యూనియన్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రస్తుతం చిట్వేల్ పోలీసు స్టేషన్ నిర్బంధంలో ఉన్నాడు. అరెస్టు చేసిన చంద్రశేఖర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. ఉపాధిహామీ కొత్త పథకం ప్రారంభించడానికి కేంద్ర మంత్రి వస్తున్న సందర్భంగా నిరసనలు తెలియజేయాలని వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రజలకు శాపంగా మారుతున్న ఈ తప్పుడు పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవడానికి బదులు ఆందోళన చేస్తున్న వారిని నిర్బంధించడం అప్రజాస్వామికం. గ్రామీణ పేదలకు మేలు చేసే (పాత) మహాత్మాగాంధీ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ కోరుతున్నది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు.


# పులివెందులకు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్

ప్రజల సహకారంతో భద్రతా వ్యవస్థ బలోపేతం: కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్



**పులివెందుల, జులై 2 ప్రభాతవార్త:** ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పులివెందులలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సాంకేతికతతో, సీసీ కెమెరాల ద్వారా ప్రజలకు మరింత జవాబు దారీతనంతో పోలీసు సేవలు అందించేలా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ పట్టణంలోని రింగ్ రోడ్‌తో పాటు ప్రధాన కూడళ్లలో మున్సిపాలిటీ, వ్యాపారవేత్తలు, దాతల సహకారంతో రూ.32.62 లక్షల వ్యయంతో 120 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరాల నివారణతో పాటు నేరస్థులను వేగంగా గుర్తించడంలో ఈ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని చెప్పారు. నియోజక వర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు డ్రోన్ కెమెరాలను అనుసంధానించి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. పోలీసు సూపరింటెండెంట్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచనల మేరకు చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పులివెందుల ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, మున్సిపాలిటీ సహకరించాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సహకారంతో మున్సిపాలిటీ రూ.12 లక్షలు అందించిందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం అర్బన్ స్టేషన్ నందు ఉన్న కంట్రోల్ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కమాండింగ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును ఏ విధంగా నేరాలను గుర్తించడం జరుగుతుందో సాంకేతికత నాణ్యతను గురించి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, డీఎస్పీ మురళి నాయక్, మున్సిపల్ కమిషనర్ మునికుమార్, అర్బన్ సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు, వేంపల్లి సీఐ నరసింహులు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

## అవాంఛిత రోమాలు తొలగించాలంటే..



ఈ మధ్య అమ్మాయిల్లో పై పెదవి పైన, గడ్డం దగ్గర, సైడ్‌లాక్స్ దగ్గర అవాంఛిత రోమాలు రావడం ఎక్కువైంది. దీన్ని హిరునసటిజం అంటారు. ఇది ఉన్నవారిలో పురుషులకు ఎక్కడ వెంట్రుకలు వస్తాయో మహిళలకు కూడా అదే ప్రాంతంలో ఒత్తుగా వెంట్రుకలు వస్తుంటాయి. చాలామందిలో పిసిఓఎస్ కారణంగా ఈ సమస్య వస్తుంటుంది. ఇక మరికొంత మందికి ఎలాంటి హార్మోన్ల సమస్య లేకపోయినా పైపెదవి పైన, గడ్డం దగ్గర వెంట్రుకలు వస్తుంటాయి. ఇది వంశపారంపర్యంగా వస్తుంటుంది. దీనిని హైపర్‌ట్రైకోసిస్ అంటారు. హిర్సుటిజం సమస్య ఉన్నప్పుడు దానికి గల కారణాన్ని తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమస్య ఉంటే మొదట అందుకు తగిన చికిత్స తీసుకుని ఆ తర్వాత వెంట్రుకల పెరుగుదలను ఆపడానికి ప్రయత్నించవచ్చు. ఒకవేళ అప్పటికే వెంట్రుకలు ఒత్తుగా పెరిగి ఉంటే వాటిని తొలగించడానికి పర్మనెంట్ హెయిర్ లేజర్ రిడక్షన్ ట్రీట్‌మెంట్ చేస్తుంటారు. అయితే లేజర్ ట్రీట్‌మెంట్‌లోనూ పలు రకాలుంటాయి. ఇందులో ట్రిపుల్ వేవ్‌లెంగ్త్ లేజర్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది వివిధ దశల్లో ఉన్న హెయిర్ ఫాలికల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. ఈ ట్రీట్‌మెంట్‌ని నెలకోసారి చేయించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది సెషన్లలో అవాంఛిత రోమాల సమస్య తగ్గిపోతుంది. అయితే పిసిఓఎస్, హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారికి ఎక్కువ సెషన్లు తీసుకోవాల్సి వస్తుంది. అవాంఛిత రోమాలకు గల అసలు సమస్యను తెలుసుకుంటే సెషన్ల సంఖ్యను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ సమస్యను గుర్తించి, ఆ తర్వాత సరైన సద్ధతిలో హెయిర్ లేజర్ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది. □

## బ్యూటీకి సూత్రాలు

ప్రతి వారు అందంగా కనిపించాలని తాపత్రయపడు తుంటారు. అందంగా వుండాలని కోరికవుంటే సరిపోదు అందనికి అవసరమైన ఆచరించదగిన సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. ★ అందంగా కనిపించాను కునేవారు నిద్రవిషయంలో అత్యంత జాగ్రత్త వహించాలి. పగలు ఎక్కువగా నిద్రించకూడదు. గృహిణులు అరగంట నిద్రపోతే అలసట పోయి ఫ్రెష్‌గా కనిపిస్తారు. ★. వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. □

## పిల్లలు ఎత్తు పెరగడం లేదా ?



తమ పిల్లలు ఎత్తుగా ఉండాలి.. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొంతమంది చిన్నారుల్లో పెరుగుదల మందకొడిగా సాగడం, ఒక వయసొచ్చాక ఆగిపోవడం వల్ల సరైన ఎత్తు పెరగక పొట్టిగా కనిపిస్తుంటారు. తల్లిదండ్రుల జీన్స్ ఒక్కటే దీనికి కారణం అనుకుంటే పొరపాటే! ఎందుకంటే పోషకాహార లోపం, శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, వారుండే వాతావరణం. వంటివీ చిన్నారుల ఎత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు ఎత్తు పెరగడానికి కొన్ని వ్యాయామాలు దోహదం చేస్తాయంటున్నారు. మరి, ఏంటా వర్కవుట్లు? తెలుసుకుందాం..

**స్ట్రెచింగ్ వ్యాయామాలు ...** స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడానికి సులభంగా ఉండడంతో పాటు, పిల్లలు ఎత్తు పెరగడానికి ఎంతో ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నిటారుగా నిల్చొని కిందికి వంగుతూ కాలి వేళ్లను అందుకోవడం, కాళ్లు ముందుకు చాపి కూర్చొని చేతి వేళ్లతో కాళ్లను అందుకోవడం, శరీర పైభాగాన్ని ఇరువైపులా వంచుతూ చేసే వ్యాయామాలు.. ఇలాంట వర్కవుట్లు వెన్నెముకకు ఫ్లెక్సిబులిటీని అందిస్తాయి. అది సులభంగా సాగేలా చేస్తాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం సులువవుతుంది.

**వేలాడితే మంచిదే!...** పిల్లల ఎత్తు పెరగడానికి చాలామంది నిపుణులు సూచించే వ్యాయామాలివి. బార్ హ్యాంగింగ్స్, హ్యాంగింగ్‌రాడ్, పులప్స్, చిన్-అప్స్.. వంటి ఎక్సర్‌సైజెస్ వెన్నెముకను సులభంగా సాగేలా చేస్తాయి. తద్వారా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగచ్చు. అలాగే ఈ వ్యాయామాలు వెన్ను, భుజాల కండరాలకు దృఢత్వాన్ని అందించి ఫిట్‌గా మార్చుతాయి.

**యోగాసనాలతో...** కొన్ని రకాల యోగాసనాలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాదు.. పిల్లలు ఎత్తు పెరగడానికీ దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరమంతటికీ చక్కటి వ్యాయామం అందుతుంది. అలాగే భుజాలు, వీపు, కాళ్లలోని కండరాలను బలంగా మార్చి సులభంగా సాగేలా చేస్తుంది. ఇక చక్రాసనం వల్లభుజాలు, పాదాలపై ఒత్తిడి పడుతుంది. తద్వారా అక్కడి కండరాలు దృఢమవడంతో పాటు సాగుతాయి. ఫలితంగా ఎత్తు పెరిగే ప్రక్రియ వేగవంతమవుతుంది.

**స్కిప్పింగ్-స్విమ్మింగ్...** స్కిప్పింగ్ ఆడడమంటే ఆడపిల్లలకు భలే సరదా. ఎంతో సరదాగా చేసే ఈ వ్యాయామం వారి శరీరానికి దృడత్వాన్ని అందించ డమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. అలాగే ఈ వర్కవుట్‌లో భాగంగా ఎగిరి దూకే క్రమంలో వెన్నెముక, భుజాలు, కాళ్లలోని కండరాలు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. సులభంగా సాగేలా తయారవుతాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం ఈజీ అవుతుంది. ఇక ఈత కొట్టే క్రమంలో కూడా శరీరాన్ని ముందుకు సాగదీస్తాం. తద్వారా వెన్నెముకకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఇది కూడా ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.

మన శరీరంలో హెచ్‌జిహెచ్ అనే పెరుగుదల ప్రేరేపించే హార్మోన్ ఉంటుంది. ఇది పిల్లల్లో నిద్ర పోయినప్పుడు మాత్రమే విడుదల వుతుందట! అందుకే చిన్నారులు ఎంత చక్కగా నిద్రపోతే అంతగా పెరుగుతారంటారు. విటమిన్ 'డి' సైతం చిన్నారులు ఎత్తు పెరిగేందుకు పేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ఇది కండరాలు, ఎముకల సామర్థ్యం పెరిగేలా చేసి.. పరోక్షంగా ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. ఇందుకోసం రోజూ కాసేపు ఎండలో నిలబడడం.. చేపలు పుట్టగొడగులు, గుడ్లు.. వంటి విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారి డైట్‌లో భాగం చేయడం మంచిది. పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు.. ఇలా అన్ని పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం సీజనల్ పండ్లు అన్ని రకాల కాయకూరలు దుంపలు ఆకుకూరలు వంటివన్నీ వీరి ఆహారంలో చేర్చాలి. □

## దానాలు ఫలించాలంటే..

**దానం ఓ మహోత్తర కార్యం.** నువ్వు ఏ దానం అయినా చేయి కాని కుటుంబ అవసరాలు, నీ జీవితానికి సంబంధించినవి తీర్చుకుని దానం చేయి. అలా కాకుండ కొంత మంది మాకు దానం చేస్తే పుణ్యం వస్తుంది. మేము స్వర్గ సుఖాలు పొంద వచ్చని మూఢంగా దానాలు చేస్తుంటారు. కుటుంబంలో కొడుకులు కావొచ్చు. కూతుర్లు కావొచ్చు వాళ్ల అవసరలకు కొంత మంది, వాళ్ల అనారోగ్యంగా ఉన్నా ఖర్చు పెట్టరు. వేలకు, వేలు వివిధ సంస్థలకు డబ్బు దానం చేస్తుంటారు. అది వారి సొంత డబ్బు అయినా ఎంతో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని దానం చేస్తే బాగుంటుంది. ఇది కొంత మందికి నచ్చదు. అందుకే హాతమార్చడం చేస్తు న్నారు. ఉదాహరణకు ఓ ముదుసలికి నెల, నెల ప్రభుత్వ పింఛను వస్తుంది. ఆవిడను కొడుకు,కోడలు తరిమివేశారు. కూతురు ఇంటికి వచ్చినా ఆమె చేసే దానాలకు అంతులేదు కూతురు అనారోగ్యంగా ఉన్నా, ఏమి పట్టనట్లుగా డబ్బు దానం చేస్తుడటం ఆమె మూర్ఖత్వం. అట్టి దానాలు ఎప్పటికి ఫలించవు. వీళ్లేమో మేము దానాలు చేశాం మాకు పుణ్యం వస్తుంది అనుకుంటారు. నిజానికి వారు పాపం మూట గట్టుకుం టారు. మా డబ్బు పేదలకు చేరుతుంది కదా అనుకుంటారు. కానీ నీకు అన్ని సమాకూర్చే నీ వాళ్లకు నీవు ఏమి ఖర్చు పెట్టవు. నేను అంత చేశాను, ఇంత చేశాను అని వాళ్లకు మనసులో ఉండొచ్చు కాని ఏవి నీకు మంచి జరగదు. అవసాన దశలో నీవు నీ కుటుంబ సభ్యులు, వాళ్ళ రోగాలకు డబ్బు ఖర్చు పెడితే అదే నీకు పుణ్యం. నువ్వు చేసేది దానం అయినా, ఆ దానంలో నీ వాళ్లు కూడ ఉన్నారు. నీ వాళ్లకు ఖర్చు పెడితే ఆ పనులకు పెట్టినట్లే. ఇప్పటికైనా ఎవరైనా డబ్బు దానం చేయాలిసివస్తే ముందు కుటుంబ అవసరాలు, తర్వాత దానలు చేస్తే అనంత ఫలితం వస్తుంది. భగవంతుడు కూడ వున్న దానిలో కొంచెం నాకు ఇస్తే నీకు పుణ్యం కలుగుతుంది అని మన పురాణ గ్రంధాలలో, వివిధ మత నగ్రంధాలలో కూడ ఉంది. మొత్తానికి వున్న దానిలో దానంచేస్తే కలిగే ప్రయోజనాలు ఎన్నో. □



## చేతులు మండుతున్నాయా?

వంటన్నాక ప్రతి దానిలో పచ్చి మిర్చిని తప్పక వడుతుంటాం. కొంతమందికి వీటిని కోస్తే చేతులు మండుతాయి. దీనికి కారణం మిర్చిలో ఉండే క్యాప్సైసిన్ అనే రసాయం. ఈచిట్కాలు పాటించడంతో ఉపశమన పొందవచ్చు.

✦ పచ్చిమిరపకాయలు కోసిన వెంటనే టొమాటోలను కోయడమో లేదా ఆ గుజ్జుతో చేతులను శుభ్రం చేసుకుంటేనో మంట తగ్గుతుంది. మరీ ఎక్కువ మంట అనిపస్తే చపాతీపిండి లేదా పూరీపిండిని కలపడంతో ఉపశమనం కలుగుతుంది. ✦. నిమ్మరసంలో విటమిన్-సి, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉండి మంటను తగ్గస్తాయి. పచ్చిమిర్చి కోస్తే సమస్య ఉన్నవారు నిమ్మచెక్క రసంతో చేతులను రుద్ది కడిగితే యాంటీసెప్టిక్ పనిచేసి మంటను తగ్గిస్తాయి. చేతులూ ఎర్రబడవు. ✦ పచ్చిమిర్చిని కోసిన తరవాత ఐస్‌క్యూబ్స్‌తో కాసేపు చేతులను రుద్దాలి. లేదా కలబంద గుజ్జు రాసినా, చక్కెరతో చేతులను కడిగినా ఉపశమనం లభిస్తుంది. □



మురుకులు ఎంతో మంది ఎన్నోరకాలుగా చేస్తారు.

## నూనె పీల్చని జొన్న మురుకులు

బియ్యప్పిండి, మినప్పిండి, పెసర పిండి.. ఇలా చాలా వైరైటీలు ఉన్నాయి. వేటికవే బాగుంటాయి. జొన్నపిండి ఇంకా మంచిది కదా చాలా సులువు కూడా. ఎలా చేయలంటే జొన్న పిండిలో నువ్వులు, వేరుశనగ పొడి, వాము, పచ్చిమిర్చి ముద్ద, ఉప్పు, రెండు చెంచాల వెన్న వేసి.. కొన్ని నీళ్లతో పిండి కలిపి..కాగుతున్న నూనెలో మురుకులు ఒత్తుకోవాలి. ఇవి రుచిగా ఉంటాయి. నూనె కూడా ఎక్కువ పీల్చవు. మూడు కప్పుల జొన్నపిండికి అర కప్పు నువ్వులు, ఒక కప్పు వేరుశనగగుళ్లు, ఒక టేబుల్ స్పూన్ వాము, మూడు పచ్చిమిర్చి అవసరమౌతాయి. వేరుశనగ గుళ్లను వేయించి పొట్టు తీసి, గ్రైండ్ చేయాలి. పిల్లలు చిప్స్ లాంటి స్నాక్స్ తింటే వాటిల్లో ఉండే ప్రిజర్వేటివ్స్ వల్ల జబ్బులపాలవుతారు. ఇలాంటి చిరుతిళ్లు పెడితే ఆరోగ్యంగా, పుష్టిగా ఉంటారు. ముఖ్యంగా దయాబెటిస్‌తో బాధపడేవారికి ఇవెంతో ఉపశమనం కలిగిస్తాయి. పిల్లలు ఇంకా కావాలంటూ ఇష్టంగా తింటారు.. ఈ జొన్నమురుకులు మీరూ ఒకసారి చేసి చూడండి. □

# తెర

## మైత్రీ మూవీ మేకర్స్ 4వ తమిళ చిత్రం పూజా కార్యక్రమం ప్రారంభం



ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ ఖిమైత్రీ మూవీ మేకర్స్‌ఖి కేవలం తెలుగు పరిశ్రమకే పరిమితం కాకుండా ఇతర భాషల్లోనూ భారీ చిత్రాలను నిర్మిస్తోంది. ఈ క్రమంలో వారి నాలుగవ తమిళ చిత్రాన్ని ప్రకటించారు. ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న నాలుగవ చిత్రం కావడం విశేషం. పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. చెన్నైలోని ఎంఆర్‌సి నగర్ మైత్రీ ఆఫీస్ లో జరిగిన పూజా కార్యక్రమంతో MythriTamil04 DV4 ప్రాజెక్ట్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథులు హాజరయ్యారు. ధృవ్ విక్రమ్, దర్శకుడు కరణ్ అరవింద్ కుమార్, చిత్ర బృందంతో కలిసి ఈ శుభకార్యంలో పాల్గొన్నారు. ముహూర్తం షాట్ కు దర్శకుడు కీర్తిశ్వరన్ క్లాప్‌బోర్డ్ కొట్టారు. దర్శకులు అధిక్ రవిచంద్రన్, రవికుమార్, కీర్తిశ్వరన్, ఆంటోనీ భాగ్యరాజ్, రాజా, శశి, 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ ఈ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు.నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం (డివి4), ధృవ్ విక్రమ్‌ను పూర్తిగా మాస్ ఓరియెంటెడ్ అవతార్‌లో కనిపించ నున్నారు. నటనకు ప్రాధాన్యతనిచ్చే పాత్ర లతో ప్రయోగాలు చేయ డానికి పేరు పొందిన ధృవ్ , ఇప్పుడు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతున్న ఒక కమర్షి యల్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమయ్యారు. కరణ్ అరవింద్ కుమార్, సబీతో కలిసి ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను కూడా అందించారు. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది.

## దర్శకుడు మెహార్ రమేష్ కుమార్తె వివాహం: నూతన దంపతులను ఆశీర్వదించిన చిరంజీవి దంపతులు



దర్శకుడు మెహార్ రమేష్ కుమార్తె మోహన వివాహం అనిరుధ్‌తో వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకకు మెగాస్టార్ చిరంజీవి సతీసమేతంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరై సందడి చేశారు. ముఖ్యంగా . పవన్ కల్యాణ్, ఆయన అర్ధాంగి అన్నా లెజెనోవాతో కలిసి విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ నుంచి అగ్ర హీరో వెంకటేశ్, ప్రముఖ దర్శకులు వీవీ వినాయక్, శ్రీను వైట్ల, ఎన్. శంకర్, వీర శంకర్, నిర్మాతలు అల్లు అరవింద్, సి. అశ్వినీదత్, ఏఎం రత్నం, బన్నీ వాసు, రచయితలు కోన రవి, నటుడు మురళీ మోహన్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, యాంకర్ సుమ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాజకీయ రంగం స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, గంటా శ్రీనివాస్, అంబటి రాంబాబు వంటి నేతలు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

## 'నాగబంధం' థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్: డైరెక్టర్ అభిషేక్ నామా



నాగబంధం జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిషేక్ నామా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**నాగబంధం ఆలోచన ఎప్పుడు వచ్చింది?**

పద్మనాభస్వామి ఆలయంలో వాల్ట్ బి ఎందుకు తెరవలేదనే విషయంలో చాలా చర్చలు జరిగాయి. దానిపై ఎన్నో కథలు ఉన్నాయి. ఆ గదిలోపల ఏముందనేది అందరికీ ఎంతో ఆసక్తికరం. నిజంగా ఆ గది తెరిస్తే అందులో ఏముంటుందో ఊహిస్తూ ఒక కథ చేస్తే బాగుంటుందని అనిపించింది. దాన్ని బ్యాక్‌డ్రాప్‌గా తీసుకుని ఒక ఫిక్షనల్ స్టోరీ చేయాలనిపించింది. అలా నాగబంధం కథను రాశాను.

**ఇలాంటి కథలకు పెద్ద హీరోలు అయితే బాగుంటుంది కదా. మీరెందుకు కొత్తవాళ్లతో చేశారు?**

నిజానికి ఈ కథ అనుకున్నప్పుడు ఎవరితో చేయాలనే ఆలోచన లేదు. మంచి కథ చెప్పడంపైనే నా దృష్టి అంతా ఉంది. కథ పూర్తయిన తర్వాత దానికి ఎవరు బాగా సరిపోతారో వారిని ఎంపిక చేశాం.ఇది నేను విజువలైజ్ చేసుకున్న కథ.

**విరాట్ కర్ణలాంటి కొత్త హీరోతో వంద కోట్లకు పైగా సినిమా చేయడం వెనుక కారణం?**

నిజానికి ఈ కథ మొదలుపెట్టినప్పుడు వంద కోట్ల బడ్జెట్ అవుతుందని అనుకోలేదు. కొత్త నటుడితో సినిమా చేయాలని అనుకున్నాను. .

**నిర్మాతల గురించి?** మా నిర్మాతలు మొదటి నుంచి కథను, నన్ను పూర్తిగా నమ్మి సినిమా కోసం ఖర్చు చేశారు. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా కథకు ఏం అవసరమో అది అందించారు.

**మైథాలజీ అంశాలతో సినిమా చేయడం పెద్ద టాస్క్ కదా. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఇది మైథాలజీ మాత్రమే కాదు, ఒక కమర్షియల్ సినిమా కూడా. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా.

**హిందీలో ఎలాంటి స్పందన ఉంది?**

బాలీవుడ్‌లో చాలా మంచి స్పందన వచ్చింది. దాదాపు 700కి పైగా స్క్రీన్లలో విడుదల అవుతోంది. **ఇంత భారీ సినిమా చేయాలని ఎప్పుడు నిర్ణయించుకున్నారు?**

డెవిల్ తర్వాత ఒక కథ చేయాలనుకున్నాను. కొంతకాలం దానిపైనే ప్రయాణించాను. అయితేచేస్తే అందరూ గుర్తుపెట్టుకునే పెద్ద సినిమా చేయాలనిపించి ఈ సినిమాను మొదలుపెట్టాను.

## పాన్ ఇండియా ఫీచర్ ఫిల్మ్ 'వనజీవి రామయ్య'



వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా వనజీవి 90వ జయంతి సందర్భంగా వనజీవి హరిత అవార్డు పురస్కార మహో త్సవం..పరావరణ పరిరక్షణకు విశేష సేవలందించిన పలువురికి సత్కారం తెలంగాణ రాష్ట్రం లోని పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి కోటి మొక్కల రామయ్యగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పర్యావరణ ఉద్యమకారుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ఉద్దేశంతో రూపొందిన లఘుచిత్రం 'వనజీవి రామయ్య' మూవీ టీమ్ సమక్షంలో, వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజీవి అవార్డు పురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాస్విక్ గ్రూప్ చైర్మన్, సినీ నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి, వాస్విక్ ఫౌండేషన్ వైస్ చైర్మెన్ నూకల భాస్కర్ రెడ్డి, దర్శకుడు వేముగంటి తదితరులు నాయకత్వం వహించారు. సమాజానికి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించిన మహనీయుడు దరిపల్లి రామయ్య జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించిన 'వనజీవి రామయ్య' లఘుచిత్రం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే 'గద్దర్ అవార్డ్స్'లో ఉత్తమ లఘుచిత్రాల విభాగానికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా మొక్కల సత్యనారాయణ, మొక్కల వెంకటయ్య మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిర్మాత నిడిగొండ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ, 'నీటి కరువు, పర్యావరణ సంక్షోభం వంటి సమస్య లను సుమారు 50 ఏళ్ల క్రితమే ముందుగానే గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చిన దూరదృష్టి కలిగిన మహనీయుడు వనజీవి రామయ్య. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, 'దాదాపు ఏడు దశాబ్దాల పాటు తన జీవితాన్నే మొక్కల కోసం అంకితం చేసిన వనజీవి రామయ్యను భావితరాలు ఎన్నటికీ మరచిపోకూడదు.

## 'ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్



'ముపాపా' ఫిబ్రవరి 19, 2027న రిలీజ్‌బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ ఆయుష్మాన్ ఖురానా హీరోగా యశ్ రాజ్ ఫిల్మ్స్, పోషమ్ పా పిక్చర్స్ బ్యానర్స్‌పై రూపొందు తోన్న చిత్రం 'ముపాపా'. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సిఇఒ అక్షయ్ విదాని ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇండియన్ మూవీస్‌లో ప్రముఖ షో రన్నర్, డైరెక్టర్ సమీర్ సక్సేనా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన నిర్మిం చిన గత చిత్రం సయారా హయ్యస్ట్ గ్రాసర్ సాధించిన రొమాంటిక్ మూవీగా ఇండియన్ సినిమాలో రికార్డ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ముపాపా చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 19న రిలీజ్ కానున్నట్లు మేకర్స్ తెలియజేశారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌లో కొత్త క్రియేటివ్ బిజినెస్ మోడల్‌ను నిర్మించానే ఆదిత్య చోప్రా విజన్‌కు అనుగుణంగా ఈ భాగస్వామ్యం ఉంది. కంపెనీ సీఈఓ అక్షయ్ విదాని నేతృత్వంలో.. ఆయన నిర్మాతగా స్టూడియో ఈ మోడల్‌ను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తున్నారు. ముపాపా" ఓ వినూత్నమైన థియేట్రికల్ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులకు పూర్తిగా కొత్త విజువల్ అనుభూతిని అందించనుంది. డిఫరెంట్ కంటెంట్ మూవీస్‌తో ప్రేక్షకులను అలరిస్తోన్న ఆయుష్మాన్ ఖురానా ఇందులో కథానాయకుడు. అనౌన్స్‌మెంట్ నుంచే ఈ మూవీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాలా పానీ, మామ్లా లీగల్ హైస వంటి ప్రేక్షకాదరణ పొందిన సినిమాల్లో భాగమైన పోషమ్ పా పిక్చర్స్ పార్ట్‌నర్స్ సమీర్ సక్సేనా, బిస్వపతి సర్కార్, సౌరభ్ ఖన్నా, అమిత్ గోలాని ఇందులోనూ భాగమయ్యారు.

## లవ్ స్టోరీ 'కాగితం పడవలు' 24న




వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరో యిన్స్‌గా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ కాగితం పడవలు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కీర్తన నరేష్ టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజ నప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చిత్ర బృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 24న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన పంపిణీ సంస్థల్లో ఒకటైన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం.ఒక సినిమా కంటెంట్‌పై బలమైన నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటి ప్రముఖ సంస్థలు ముందుకు వస్తాయి. దీంతో 'కాగితం పడవలు' పై పరిశ్రమ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ మరింత ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి ఎఐఎస్ నౌఫల్ రాజామ్యూజిక్ అందిస్తున్నారు. రుద్రసాయి డీవోపీగా పని చేస్తున్నారు, జెస్విన్ ప్రభు ఎడిటర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.హిమ బిందు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆట


సెనెగల్ విజయం ఆశలపై నీళ్లు చల్లిన యూరి టైల్ మన్స్


రెండు మెరుపు గోల్స్ చేసిన హ్యారీ కేన్


గోల్ కొట్టిన అమెరికా ఫార్వర్డ్ బలోగన్‌ను అభినందిస్తున్న సహచరులు

# సెనెగల్‌కు బెల్జియం షాక్ : ఇంగ్లాండ్ గట్టెక్కించిన హ్యారీ కేన్

**కాలిఫోర్నియా, జులై 2:** సాకర్ ప్రపంచకప్‌లో నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. ఇంగ్లాండ్, బెల్జియం, అమెరికా తమ ప్రత్యర్థులపై గెలుపొంది ముందంజ వేశాయి. ఓటమి అంచుల నిలిచిన బెల్జియం చివర్లో చక్కగా పుంజుకుని సెనెగల్‌పై 3-2తో గెలుపొందగా.. కాంగోపై కూడా చివర్లో మెరుపు గోల్స్‌తో ఇంగ్లాండ్ గటెక్కింది. అతిథ్య అమెరికా 2-0 గోల్స్ తేడాతో బోస్నియా-హెర్జ్‌గోవినాపై విజయం సాధించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో క్రొయేషియాతో పోర్చుగల్, స్విట్జర్లాండ్‌తో అల్జీరియా, ఈజిప్ట్‌తో ఆస్ట్రేలియా తలపడతాయి.

ఫిఫా ప్రపంచకప్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సెనెగల్‌తో తలపడిన బెల్జియం ఓటమి అంచుల నుంచి సంచలన కమ్ బ్యాక్ ఇచ్చింది.ఓ దశలో 0-2గోల్స్‌తో వెనుకబడిన బెల్జియం, అనూహ్యంగా పుంజుకుని 3-2 తేడాతో గెలిచి అందరినీ ఆశ్చర్యపర్చింది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు యూరి టైల్‌మన్స్ పెనాల్టీని గోల్‌గా మలిచి బెల్జియంకు అపురూప విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో బెల్జియం ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ హిస్టరీలో బెల్జియం, సెనెగల్ జట్లు తలపడటం ఇదే మొదటిసారి. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బెల్జియం తరఫున లియాండ్రో ట్రోసార్డ్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం సెనెగల్‌దే అయ్యింది. సెనెగల్ ఆటగాళ్లు మైదానంలో చిరుతల్లా కదిలారు. ఇస్మాయిలా గోల్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పోస్ట్‌కి తగిలి రీబౌండ్ అయింది. అయితే, అక్కడే ఉన్న సెనెగల్ యువ మిడ్‌ఫీల్డర్ హబీబ్ దియారా ఆ రీబౌండ్ బంతిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో మ్యాచ్ మొదటి అర్ధభాగంలో సెనెగల్ 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది.

రెండో అర్ధభాగం లోనూ సెనెగల్‌దే హవా నడిచింది. కేవలం ఆరు నిమిషాలకే లాంగ్ బాల్‌ను ఇస్మాయిలా గోల్‌గా మలిచాడు. దీంతో సెనెగల్ 20తో ఆధిక్యాన్ని సాధించింది. ఆట 70వ నిమిషం దాటిన తర్వాత బెల్జియం ఆటలో వేగం పెరిగింది. బెల్జియం స్టార్ స్ట్రైకర్ రోమేలు తనదైన శైలిలో గోల్ పోస్ట్ దగ్గర నుంచి నెట్‌లోకి పంపి బెల్జియం ఖాతా తెరిచాడు. కొద్దిసేపటికే ట్రోసార్డ్ అందించిన అద్భుతమైన పాస్‌ను యూరి టైల్‌మన్స్ గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 2-2తో సమం చేశాడు. ఎక్స్‌ట్రా సమయంలో లభించిన పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి బెల్జియంకు విజయం అందుకుంది.

### బోస్నియాపై అమెరికా విజయం

ఆతిథ్య అమెరికా జట్టు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. రౌండ్32 మ్యాచ్‌లో బోస్నియా అండ్ హెర్జెగొవినాపై 2-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి టైటిల్ రేసులో నిలిచింది. ఈ మ్యాచ్‌లో అమెరికా కేవలం 10మంది ఆటగాళ్లతోనే పోరాటం చేసింది. 64వ నిమిషంలో స్టార్ ఫార్వర్డ్ ఫొలారిన్ బలోగన్ రెడ్ కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాడు. బలోగన్ 45వ నిమిషంలో గోల్ చేసి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఈ టోర్నీలో అతనికి ఇది మూడో గోల్. బలోగన్ రెడ్ కార్డ్‌కు గురైనా అమెరికా 82వ నిమిషంలో మరో గోల్ చేసి ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మలిక్ టిల్‌మ్యాన్ అద్భుతమైన ఫ్రీకిక్‌తో గోల్ చేసి అమెరికా విజయాన్ని ఖాయం చేశాడు. అమెరికా రౌండ్ ఆఫ్ 16కు చేరడం ఇది మూడో సారి. తదుపరి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడనుంది.

### ఇంగ్లండ్‌ను గెలిపించిన హ్యారీ కేన్

ఆరు దశాబ్దాల తర్వాత ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు అద్భుతం చేసింది. ఆరంభంలో వెనుకబడినా చివరి నిమిషాల్లో గోల్స్‌తో కాంగోపై 2-1తో గెలుపొందింది. కెప్టెన్ హ్యారీ కేన్ 11 నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి ఇంగ్లండ్ జట్టును గెలిపించాడు. అంతకుముందు ఏడో నిమిషంలో బ్రియాన్ సిపెంగా గోల్‌తో కాంగో జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత రక్షణాత్మక ఆట తీరుతో ఇంగ్లండ్ జట్టును నిలువరించి గెలుపొందాలని ప్రయత్నించింది.కానీ ఇంగ్లండ్ జట్టు అవకాశం దొరికినపుడల్లా స్కోరును సమం చేసేందుకు యత్నించింది. చివరకు 75వ నిమిషంలో సఫలమైంది. ఆంథోని గోర్డాన్ పాస్‌ను డి-ఏరియాలో అందుకున్న హ్యారీ కేన్ హెడర్ షాట్‌తో గోల్‌గా మలిచాడు. దాంతో ఇంగ్లండ్ 1-1తో స్కోరును సమం చేసింది. అనంతరం 86వ నిమిషంలో గోర్డాన్ అందించిన పాస్‌ను హ్యారీ కేన్ లక్ష్యానికి చేర్చడంతో ఇంగ్లండ్ 2-1తో విజయబావుటా ఎగురవేసింది.

# వింబుల్డన్‌లో సీడెడ్ల జోరు

## మూడో రౌండ్‌లో సిన్నర్, జొకోవిచ్; మిర్రాకు షాక్



**లండన్, జులై 2:** వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్లు జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో ఏడుసార్లు ఛాంపియన్ నోవాక్ జొకోవిచ్, ప్రపంచ నెంబర్ వన్ జానిక్ సిన్నర్ వింబుల్డన్ మూడవ రౌండ్‌లోకి ప్రవేశించగా... మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెనర్ ఛాంపియన్ మిర్రా ఆండ్రీవాకు షాక్ తగిలింది. రెండో రౌండ్‌లోనే అనూహ్య ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఎనిమిదోసారి వింబుల్డన్ అందుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన నోవాక్ జొకోవిచ్.. రెండో రౌండ్‌లో గ్రీక్ ప్లేయర్ స్టెఫానోస్ సిట్సిపాస్‌ను చిత్తుగా ఓడించాడు. 98 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో వరుస సెట్లలో గెలుపొందాడు. ఈమ్యాచ్‌లో అతను ఏకంగా 33విన్నర్లు కొట్టాడు. 12 ఏస్‌లు సంధించాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలన్న జొకోవిచ్ ప్రయత్నానికి తొలి రౌండ్‌లో గట్టిపోటీ ఎదురైనా.. ఈ రౌండ్‌లో మాత్రం అతని ధాటి ముందు స్టెఫానోస్ నిలువలేకపోయాడు. వింబుల్డన్‌లో జొకోవిచ్‌కు ఇది 104వ మ్యాచ్ విజయం.పురుషుల సింగిల్స్‌లో రోజర్ ఫెదరర్ ఓపెన్ ఎరా రికార్డుకు కేవలం ఒక విజయం వెనుక ఉన్నాడు. మూడో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన 25వ సీడ్ ఆర్థర్ రిండర్‌క్నెచ్‌తో తలపడతాడు. జొకోవిచ్ చివరి సారి వింబుల్డన్‌ను 2022లో నెగ్గాడు.

### చెమటోడ్చి నెగ్గిన సిన్నర్

జొకోవిచ్‌కు భిన్నంగా వరల్డ్ నెంబర్ వన్ సిన్నర్... రెండోరౌండ్‌లో చెమటోడ్చా వచ్చింది. పోర్చుల్‌కు చెందిన పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్ గట్టి పోటీ ఇచ్చాడు. తొలి రెండు సెట్లు ట్రైబ్రేకర్ వరకు కొనసాగాయి. గెలుపు నీదా నాదా అన్నట్లుగా ఉత్కంఠగా సాగింది. ఇక్కడ అనుభవజ్ఞుడైన సిన్నర్‌దే పైచేయి అయింది. నూనో బెర్జెస్‌పై 7-6, 7-6, 6-4తో నెగ్గి సిన్నర్ ఊపిరిపీల్చుకున్నాడు. మూడో రౌండ్‌లో అమెరికాకు చెందిన ప్రపంచ 81వ ర్యాంకర్ జెన్సన్ బ్రూక్స్‌బైతో తలపడతాడు.

### మహిళల సింగిల్స్‌లో సంచలనం

కాగా పారిస్‌లో తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గి భారీ ఆశలతో వింబుల్డన్ బరిలో దిగిన మిర్రా అండ్రీవా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఈ రష్యా టీనేజర్ అండ్రీవాపై 4-6, 7-5, 6-4తో 30 ఏళ్ల చెకొస్లోవేకియా క్రీడాకారిణి బార్బోరా క్రెజిస్కి గెలుపొందింది. తొలి సెట్ నెగ్గి ఊపుమీద కనిపించిన అండ్రీవా.. రెండో సెట్‌లోనూ మ్యాచ్ పాయింట్ వరకు వచ్చి ఆ తర్వాత చేతులెత్తేసింది.

ఇక మహిళల వరల్డ్ నెంబర్ వన్ సబలెంకా, జపాన్‌కు చెందిన ఏడో సీడ్ నయోమి ఒసాకా, నాలుగో సీడ్ కొకా గాఫ్ విజయాలతో వింబుల్డన్‌లో ముందంజ వేశారు.





# శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ : షెడ్యూల్ రిలీజ్

**కొలంబో, జులై 2:** ఇంగ్లండ్‌తో టీ20, వన్డేల సిరీస్ తర్వాత టీమిండియా...శ్రీలంకలో పర్యటించనుంది. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ సిరీస్‌లోని మొదటి టెస్టు మ్యాచ్ ఆగస్టు 15 నుండి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. రెండో టెస్టు మ్యాచ్ ఆగస్టు 23 నుండి 27వరకు కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యమివ్వనుంది. ఈ రెండు మ్యాచ్‌ల సిరీస్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగనుంది. శ్రీలంకతో సిరీస్ టీమిండియాకు చాలా కీలకం. ఇప్పటి వరకు తొమ్మిది టెస్ట్‌లు ఆడగా, కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో నిలిచింది. డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలను గిల్ సేన సజీవంగా ఉంచుకోవాలంటే శ్రీలంక గడ్డపై ఖచ్చితంగా గెలవాల్సిందే. శ్రీలంక జట్టు గత కొంత కాలంగా సొంత గడ్డపై అద్భుత విజయాలతో దూసుకు



పోతోంది.కాగా 2017 తర్వాత టెస్టుల కోసం శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లనుండటం తొలిసారి కానుంది. అప్పట్లో విరాట్ కోహ్లీ సారథ్యంలో భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

# ప్రజ్ఞానంద గెలుపు బోణీ, గుకేష్ డ్రా



**జాగ్రెబ్(క్రొయేషియా). జులై 2:** నార్వే చెస్ టోర్నీ ఛాంపియన్ ప్రజ్ఞానంద జోరు కొనసాగుతోంది. క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో జరుగుతున్న చెస్ టోర్నీ ర్యాపిడ్ విభాగంలో ప్రజ్ఞానంద తొలిగేమ్‌లో జర్మనీ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్‌పై గెలుపొంది శుభారంభం చేశాడు. కీమర్‌పై దూకుడుగా ఆడిన ప్రజ్ఞానంద, ప్రత్యర్థి రాజుపైకి తన పావులతో దాడిని సాగించి, కేవలం 26 ఎత్తులలోనే పూర్తి 2 పాయింట్లను సాధించాడు. మాగ్జిమి లాగ్రెవ్‌తో జరిగిన రెండో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఇక ప్రపంచ ఛాంపియన్ గుకేష్ ప్రారంభం మాత్రం నిరాశతో మొదలైంది. ఇవాన్ సరిక్‌తో గేమ్‌ను గుకేష్ డ్రాతో సరిపెట్టాడు. ఫ్రాన్స్ సంచలనం అలిరెజా ఫిరౌజా రెండు గేమ్‌ల్లో గెలుపు, ఓ గేమ్ డ్రాతో అయిదు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## రెండోరోజూ లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు

# గ్లోబల్ సానుకూలతలే సెన్సెక్స్, నిఫ్టీలకు దన్ను





**ముంబయి, జులై 2:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండోరోజు మార్కెట్ లాభాల్లో ముగియడం విశేషం. సెన్సెక్స్ 579 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. ఉదయం 9.15 గంటలకు ట్రేడింగ్ లాభాల్లో ప్రారంభమైంది.బీఎస్‌ఈ సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా లాభంతో 77,100 వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 70 పాయింట్ల లాభంతో 24,100 వద్ద ప్రారంభమైంది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 579 పాయింట్లు లాభంతో 77,502 వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 169 పాయింట్ల లాభంతో 24,175 వద్ద ముగిసింది.

పశ్చిమాసియా యుద్ధం నివారణ, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు, చమురు ధరలు తగ్గడం, ఇరాన్, అమెరికా శాంతి చర్చలు వంటివి మార్కెట్‌కు కలిసొచ్చాయి. అదే విధంగా ఐటీషేర్లలో కొనుగోళ్లకు మద్దతు లభించడంతో మార్కెట్ మరింత లాభపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మారుతి, ఎల్‌అండ్‌టి, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, కోటక్ బ్యాంక్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి.ఇతర ఆసియా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి. దక్షిణ కొరియా కోస్పి ఐదు శాతం నష్టపోయింది. జపాన్ నిక్కీ కూడా నష్టాలతోనే ముగిసింది. అమెరికా మార్కెట్లు కూడా నష్టాల బాటలోనే సాగాయి.

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర భారీగా తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71 డాలర్లుగా ఉంది. డబ్ల్యూటీఐ బ్యారెల్ క్రూడాయిల్ ధర 68 డాలర్లుగా ఉంది. గత మార్చి తర్వాత ఈ స్థాయిలో ధరలు తగ్గడం ఇదే మొదటిసారి. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఔన్స్ బంగారం ధర 4,063 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి విలువ 95.40 వద్ద కొనసాగుతోంది. బిఎస్‌ఇలో 2536 షేర్లు లాభాల్లో కొనసాగితే 1740 షేర్లు క్షీణించి 191 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఆగస్టు 5 నాటిధరలు రూ.1,44,488గా కొనసాగాయి.

# ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు కేంద్రం మరో అడుగు

**న్యూఢిల్లీ, జులై 2:** ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియలో కీలకమైన ఐడీబీఐ బ్యాంకు విక్రయ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం మరోసారి వేగం పెంచింది. వ్యూహాత్మక విక్రయ ప్రక్రియను పునరుద్ధరించే క్రమంలో ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన బిడ్డర్ల నుంచి తాజా ఆర్థిక బిడ్లను ఆహ్వానించినట్లు సమాచారం.వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లోనే ఈ వాటాల విక్రయాన్ని పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లావాదేవీ ద్వారా సుమారు రూ.50 వేల కోట్ల నుంచి రూ.55 వేల కోట్ల వరకు ఆదాయం సమీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నది.గతంలో వచ్చిన ఆర్థిక బిడ్లు ప్రభుత్వం నిర్ణయించిన కనీస విలువ కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రక్రియ ఆశించిన విధంగా ముందుకు సాగలేదు. అయితే కొత్తగా బిడ్లను ఆహ్వానించకుండా, ఇప్పటికే షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలకే తమ ఆర్థిక ప్రతిపాదనలను సవరించి మళ్లీ సమర్పించాల్సిందిగా కేంద్రం సూచించింది. ఈ వ్యూహాత్మక విక్రయంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎల్ఐసీకి చెందిన ఐడీబీఐబ్యాంకు యాజమాన్య నియంత్రణను కూడా బదిలీ చేయనున్నారు.




## ఆయిల్ కంపెనీలకు రూ.74,781 కోట్ల నష్టం

# పెట్రోడీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర మంత్రి హార్దీప్

**న్యూఢిల్లీ, జులై 2:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినా దేశీయంగా ధరలను పెంచకుండా ఉంచడం వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గతనెలాఖరుకు రూ.74,781 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ పూరీ తెలిపారు.అంతర్జాతీయంగా చమురు ధరలు పడిపోయినప్పటికీ పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తున్నాయని, ధరలు తగ్గకపోవడానికి ఇదే కారణమని చెప్పారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలపై వివరాలు వెల్లడించారు. పెట్రో ఉత్పత్తులను ప్రాసెసే చేసేందుకు 2 నెలల ముందే క్రూడ్ ఆయిల్‌ను చమురు మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. 2నెలల ముందు నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు ప్రాసెస్ చేస్తున్న ఆయిల్ ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో గ్లోబల్ మార్కెట్ ధరలు అధికంగా ఉన్నాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ఆయిల్ ధరలు దిగివచ్చాయి. రాబోయే




కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు తగ్గించరా అని అడగడం సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 71.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఏప్రిల్ 29వ తేదీన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 118 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో భారత్ భారీగా విదేశీ మారకం నిల్వలను వెచ్చించాల్సి వచ్చింది. దీంతో దేశీయంగా లీటర్ పెట్రోల్ ధరను రూ.7.50 మేర పెంచాల్సి వచ్చింది.

# బ్యాంకింగ్ రంగానికి అతిపెద్ద ముప్పు ఏఐ




**న్యూఢిల్లీ, జులై 2:** :దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ హెచ్చరించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన జూన్ 2026నాటి ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఈ కీలక అంశాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ ప్రవేశంవల్ల పనితీరు మెరుగైనప్పటికీ, అదే స్థాయిలో వ్యవస్థ భద్రతకు ఇది ఒక పెద్ద సవాలుగా పరిణమించిందనిఆర్‌బీఐ ఆందోళన వ్యక్తంచేసింది. దేశంలోని ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థల అభిప్రాయాల ప్రకారం రాబోయే 12 నెలల్లో సంభవించే సైబర్ ముప్పులలో ఏఐ ఆధారిత సైబర్ దాడులే అత్యంత ప్రమాదకరమైనవిగా మొదటి స్థానంలో నిలిచాయి. హ్యాకింగ్, రాన్సమ్‌వేర్, ఫిషింగ్ దాడుల కంటే ఏఐ సాయంతో సైబర్ నేరగాళ్లు చేసే దాడులు అత్యంత వేగంగా, సమర్థంగా, ఊహించని స్థాయిలో వ్యవస్థలను అతలాకుతలం చేసేలా ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించిన మైథోస్‌రాన్సమ్‌వేర్ దాడి ఇందుకు నిదర్శనమని పేర్కొంది. సైబర్ దాడులతో పాటు ఆర్‌బీఐ ఈ నివేదికలో మరికొన్ని ముఖ్యమైన లోపాలను ఎత్తిచూపింది. మెజారిటీ బ్యాంకులు కేవలం కొన్ని క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా ఏఐ టెక్నాలజీ ప్రొవైడర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అంతర్జాతీయ నియంత్రణ సంస్థల తరహాలోనే ఆర్‌బీఐ కూడా త్వరలోనే అత్యంత కఠినమైన ఏఐ గవర్నెన్స్ నియమాలను, సరికొత్త ఫైనాన్షియల్ సెక్టార్ సైబర్ సెక్యూరిటీ ప్రణాళికలకోసం రిజర్వ్ బ్యాంక్ కసరత్తులు చేస్తోంది.



# ఒక్కనెలలోనే రూ.49,340 కోట్లు ఎఫ్‌పిఐలు వెనక్కి!

**న్యూఢిల్లీ, జులై 2:** భారతీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి గత నెలలో కూడా కొనసాగింది. ఎఫ్‌పిఐలు రూ.49,340 కోట్లు (సుమారు 5.16 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లను విక్రయించి మార్కెట్ నుంచి తమ షేర్లు విత్‌డ్రా చేసారు. నెల ప్రారంభంలో ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్లపై పెట్టుబడిదారుల మొగ్గు, అమెరికా బాండ్ యీల్డ్‌ల పెరుగుదల, భారతీయ మార్కెట్‌లో అధిక విలువలు ఈ విక్రయాలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) గణాంకాల ప్రకారం, 2026లో ఇప్పటివరకు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి మొత్తం రూ.2.7 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇది 2025 మొత్తం ఏడాదిలో ఉపసంహరించుకున్న రూ.1.66 లక్షల కోట్ల కంటే ఎక్కువ.ఈ ఏడాదిలో ఫిబ్రవరి మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు నికర విక్రేతలుగానే వ్యవహరించారు. జనవరిలో రూ.35,962 కోట్లు ఉపసంహరించుకున్న ఎఫ్‌పిఐలు, ఫిబ్రవరిలో మాత్రం 22,615కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇది గత 17 నెలల్లో నమోదైన అత్యధిక నెలవారీ పెట్టుబడిగా నిలిచింది.మళ్లీ మార్చిలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ నెలలోనే రికార్డు స్థాయిలో రూ.1.17లక్షల కోట్లను విదేశీ ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. ఏప్రిల్‌లో రూ.60,847 కోట్లు, మేలో రూ.32,963 కోట్లు, జూన్‌లో రూ.49,340కోట్ల నికర విత్‌డ్రాలు రికార్డయ్యాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్ మాట్లాడుతూ, డాలర్‌తో పోలిస్తే రూపాయి స్థిరపడటం,కొంత బలపడటం, అలాగే దక్షిణ కొరియా, తైవాన్ మార్కెట్లలో అధిక ఒడిదుడుకుల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గ చూపడం వల్ల ఎఫ్‌పీఐల విక్రయాల తీవ్రత కొంత తగ్గిందని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులు దేశ కరెంట్ అకౌంట్ లోటును భర్తీ చేయడంలో, చెల్లింపుల సమతుల్యతను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ జూన్‌లో పలు చర్యలను ప్రకటించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.